ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
గుంటూరు జిల్లా వార్తలు
5
శుక్రవారం 15 నవంబరు 2024





పాత గుంటూరు శుద్దపల్లి డొంక ప్రగతినగర్‌లో తాగునీరు అందక డ్రమ్ములలో నిల్వ చేసుకుంటున్న దృశ్యం

ఆంధ్రజ్యోతి ఫోకస్

సమస్యలతో సహవాసం

రోడ్లపై మురుగు, పేరుకుపోయిన చెత్తచెదారాలు, దుర్వాసన, అపరిశుభ్రత, వర్షం వస్తే ముంపు, పొంగి ప్రవహించే డ్రెయిన్లు, పగలు రాత్రి అన్న తేడా లేకుండా దోమల దాడి, గుంతల రోడ్లు, ట్రాఫిక్ ఇక్కట్లు, అరకొర తాగునీటి సరఫరా, కుక్కల స్వైర విహారం, వెలగని వీధి దీపాలతో అంధకారం.. తదితర సమస్యలతో పుర ప్రజలు సహజీవనం చేస్తున్నారు. అభివృద్ధికి మారుపేరుగా నిలవాల్సిన మున్సిపల్ కేంద్రాలు సమస్యలకు నిలయాలుగా మారుతున్నాయి. పట్టణాలను విస్తరిస్తూ పన్నుల వసూళ్లపై శ్రద్ధ చూపుతున్న పాలకులు.. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారంపైన, మౌలిక వసతుల కల్పనపైనా కనీసం కూడా దృష్టి సారించడంలేదు. ఎన్నికలు జరుగుతున్నాయి.. పాలకులు మారుతున్నారు.. కానీ ప్రజల సమస్యలు మాత్రం తీరడంలేదు. అధ్వాన పారిశుధ్యం, అపరిశుభ్రమైన తాగునీటి సరఫరా, దోమలతో ప్రజలు రోగాల బారిన పడుతున్నా పాలకులకు పట్టడంలేదు. సమస్యలపై ప్రజల నుంచి పెద్దఎత్తున ఫిర్యాదులు వస్తున్నా అధికారులు వాటిని తీర్చడంలో నిర్లక్ష్యం చూపుతున్నారు. మున్సిపాలిటీల్లో విభాగాల వారీగా రూ.కోట్లలో వ్యయం చేస్తున్నా ఆ మేరకు ప్రజలకు కనీస మేలు కూడా జరగడంలేదు. నిధులు ఏమవుతున్నాయో కూడా తెలియడంలేదు.

ఆంధ్రజ్యోతి - న్యూస్ నెట్‌వర్క్

- అవస్థల్లో ప్రజలు.. పట్టించుకోని పుర పాలకులు
- పట్టణాల్లో జనాభాకు అనుగుణంగా లేని సౌకర్యాలు
- పన్నుల వసూళ్లపైనే శ్రద్ధ.. వసతుల కల్పనలో అశ్రద్ధ



వీఎస్ఆర్ కళాశాల తాగునీటి ప్రధాన పైపులైనుకు లీకులు

కలుషిత నీరే దిక్కు

తెనాలి: సమస్యల వలయంలో తెనాలి పురపాలక సంఘం ఉంది. ఒకపక్క పారుదల లేని మురుగు, మరోపక్క పైపులైన్లు లీకులతో కలుషిత నీటితో ప్రజలు అవస్థలు పడుతున్నారు. జనాభాకు అనుగుణంగా పురపాలక సంఘ సేవలు మెరుగుపర్చలేదు. సమస్యలపై ప్రజల నుంచి ఎన్ని విమర్శలు వస్తున్నా పాలకులు ఆలకించడంలేదు.

జనాభా	: 1,85,398
కుళాయి కలెక్షన్లు పెండింగ్	: 36746
ఉద్యానవనాలు	: 4 (మరో నాలుగు అవసరం)
డ్రెయిన్‌లు	: 3
మరుగుదొడ్లు	: 5 (మరో 3 అవసరం)
డంపింగ్ యారు	: 1
నీటిసంరక్షణ వ్యవస్థలు	: 3



ఓ ప్రధాన రహదారి ప్రక్కనే కుప్పలు కుప్పలుగా పేరుకుపోయిన చెత్త, చెద్దారం



బాలయ్య నగర్‌లో గ్రావెల్ రోడ్డు



పురపాలక సంఘంలో మురుగు నీటి ఔట్‌లెట్ కాల్వ



ఇటీవల కురిసిన భారీ వర్షాలకు నీటమునిగిన ఎన్నారై ప్రాంతం (ఫైల్)

కనీస సౌకర్యాలు కనుమరుగు

గుంటూరు: గుంటూరు నగరపాలక సంస్థగా పరిణితి చెం ది ఏళ్లు గడుస్తున్నాయి. రాజధాని జిల్లా కేంద్రమైనా సౌకర్యాలు గగనంగా మారాయి. అభివృద్ధి, మౌలిక వసతుల కల్పనలో నగరం మున్సిపాలిటీ కంటే తక్కువగానే ఉంది. యూజీడీ, అమృత్, ఎన్ఎఫ్‌బీసీ, జేఎన్ఎన్‌యూఆర్ఎమ్, సమగ్ర తాగునీటి పథకం తదితర పథకాలు వచ్చినా ఎక్కడి పనులు అక్కడే నిలిచిపోయాయి. నగరం రోజురోజుకు విస్తరిస్తూ సమీప గ్రామాలు కార్పొరేషన్‌లో విలీనమవుతున్నా.. సమస్యలు కూడా అదే స్థాయిలో పెరిగిపోతున్నాయి. నగరం 2011 లెక్కల ప్రకారం 141.52 స్క్వేర్ కిలోమీటర్లు ఉండగా ఇప్పుడు 220.45 స్క్వేర్ మీటర్లకు పెరిగిం ది. 2012లో పది రెవెన్యూ గ్రామాలను విలీనం చేశారు. పెరిగిన జనా భాకు అనుగుణంగా మాలిక వసతులు లేవు. విద్య, వ్యాపార, వాణిజ్య కేంద్రంగా ఉన్న నగరానికి లక్షల్లో ప్రజలు వస్తుంటారు. అయితే వారి కనీస అవసరాలు అయినా మరుగుదొడ్లు, మూత్రశాలలు, నైట్ షెల్టర్లు అందుబాటులో లేవు. ఉన్నవి కూడా అరకొరగానే ఉన్నా యి. ఆరుబయటే మల, మూత్ర విసర్జనతో ప్రధాన మార్గాలు దు ర్వాసనతో నిండి ఉంటున్నాయి. నగరంలో 12 మరుగు దొడ్లు ఉన్నా అవన్నీ కూడా ప్రైవేట్ వ్యక్తుల చేతిలో ఉండి డబ్బులు ఉం టేనే లోపలికి రానిస్తున్నారు. దీంతో పల్లె ప్రజలు అటు వైపు వె ళ్లాలంటేనే ఇష్టపడటం లేదు. నగరంలో తాగునీరు, అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ, విద్యుత్ దీపాలు సక్రమంగా లేవు.

జనాభా	: 10.70 లక్షలు
మరుగుదొడ్లు	: 5 (మరో 3 అవసరం)
మురుగుకాల్వలు	: 190 కిలోమీటర్లు (40కిలోమీటర్లు విస్తరించాలి)
డంపింగ్‌యార్డు	: 1 (మరొకటి ఏర్పాటు చేయాలి)
ఎస్ఎస్‌ట్యాంక్	: 1 (మరొకటి ఏర్పాటు చేయాలి)
తాగునీటి సరఫరా పైపులైన్లు	: 70కిలోమీటర్లు(మరో 60కిలోమీటర్లు ఏర్పాటు చేయాలి)

విలీన ప్రాంతాల్లో వెతలు

నరసరావుపేట: మున్సిపాల్టీలో శివారు ప్రాంతాలను విలీనం చేశారు. అయితే మౌలిక వసతుల కల్పన లేదు. తాగునీరు, వీధి దీపాలు, రహదారులు, మురుగు కాల్వల వసతి లేక ప్రజలు ఇక్కట్లు పడుతున్నారు. సీసీ రోడ్లకు విలీన ప్రాంతాలు నోచుకోవడంలేదు. కొన్ని ప్రాంతాల్లో వీధి దీపాలు లేక రాత్రిళ్లు రాకపోకలకు ఇబ్బంది పడుతున్నారు. మురుగు నీరు రోడ్లపై ప్రవహిస్తుంది. తాగు నీటి సరఫరా జరగడంలేదు.

ప్రస్తుత జనాభా	: 1,64,000
ఉద్యానవనాలు	: ఏడు అధ్వానం
పబ్లిక్ టాయిలెట్లు	: నాలుగు బ్లాక్‌లు
భూగర్భ డ్రెయినేజీ పథకం	: నిరుపయోగం
డంపింగ్ యార్డులు	: ఒకటి
నీటి సంరక్షణ వ్యవస్థ	: లేదు

సౌకర్యాలు కరువు

పొన్నూరు: పొన్నూరు పురపాలక సంఘంలో పెరుగుతున్న జానాభాకు సరిపడ సౌకర్యాలు లేవు. గత ప్రభుత్వ హయాంలో తీసుకున్న అసంబద్ధ నిర్ణయాల కారణంగా పురపాలక సంఘం ఎన్నికలు నిలిచిపోయి కేంద్ర ప్రభుత్వం నుంచి రూ.3.16 కోట్ల వరకు నిధుల విడుదలను నిలిపివేసింది. దీంతో పురపాలక సంఘంలో అభివృద్ధి పనులకు నిధులు లేకుండా పోయాయి. తాగునీటి సరఫరాకు దశాబ్దాల క్రితం నిర్మించిన సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్ ఒకటే ఉంది. 40 కిలో మీటర్ల మేర అంతర్గతంగా సిమెంట్ రోడ్ల నిర్మాణం చేయాలి. అమృత్ పథకం కింద ప్రజల తాగునీటి అవసరాలు తీర్చేందుకు రూ.17.50 కోట్లతో మూడు ప్రాంతాల్లో ఓవర్ హెడ్ ట్యాంక్‌ల నిర్మాణానికి అనుమతులు మంజూరయ్యాయి.

జనాభా	: 61,500
డంపింగ్ యార్డు	: 1
పబ్లిక్ టాయిలెట్లు	: 3 (పది అవసరం)
సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్	: 1(మరో మూడు అవసరం)
పార్కులు	: 4 (మరో 5 అవసరం)
శ్మశానవాటికలు	: 12
వరద కాల్వలు	: 0

ముంపు ముప్పు

మంగళగిరి: మంగళగిరి పట్టణాన్ని ముంపు ముప్పు కలవరపెడుతోంది. గత యాభైయేళ్లలో ఎన్నడూ లేని విధంగా ఈ ఏడాది ఆగస్టు మాసాంతంలో కురిసిన భారీ వర్షాలకు పట్టణ శివారు ప్రాంతాలు ముంపునకు గురయ్యాయి. పట్టణం కొండ ప్రాంతం కావడంతో ఎగువ నుంచి వచ్చే వర్షపు నీరు వాగుల గుండా ఊరు శివార్లకు మళ్లేది. ఆక్రమణలతో వాగులు కనుమరుగై ప్రధాన డ్రెయిన్లు పూడిపోయి వర్షపు నీరు పోయే దారిలేక నివాస ప్రాంతాలను ముంచెత్తుతోంది. పెరుగుతున్న జనాభా, నిర్మాణాలు, వాహనాల సంఖ్యకు అనుగుణంగా రహదార్లను విస్తరించకపోవడంతో ట్రాఫిక్ విపరీతంగా పెరిగిపోయి ప్రజలు నరకయాతనపడుతున్నారు. పదేళ్ల క్రితం జేఎన్ఎన్‌యూఆర్ఎం కింద రూ.32 కోట్లతో సమగ్ర మురుగు పారుదల వ్యవస్థను నిర్మించినా మురుగు సమస్య నుంచి ప్రజలకు తిప్పలు తప్పడంలేదు.



మంగళగిరి పట్టణంలో ఇష్టానుసారం తవ్వి వదిలేసిన రోడ్డు

జనాభా	: లక్షన్నరపైగానే
తాగునీటి పథకాలు	: 3(మరో 2 అవసరం)
ఉద్యానవనాలు	: 5 (మరొకటి అవసరం)
మరుగుదొడ్లు	: 3(మరో 3 అవసరం)
వరద కాలువలు	: 1(మరో 2 అవసరం)
డంపింగ్ యార్డులు	: 1(మరొకటి అవసరం)
నీటి సంరక్షణ వ్యవస్థ	: 1(మరొకటి అవసరం)

దేశం కోసమే నెహ్రూ కుటుంబం బతికింది
- ముగ్గురు మాజీ ప్రధానుల విగ్రహాల ఆవిష్కరణ సభలో షర్మిల
8

మేయర్ మనోహర్‌ను అరెస్టు చేయాలి
- గతంలో చేసిన వ్యాఖ్యలపై డీఎస్పీకి ఆధారాల అందజేత
- పోలీసుల లాఠీతో దాడి.. పవన్‌కల్యాణ్‌ను దూషించారన్న టీడీపీ నేతలు

హత్య కేసులో నిందితుల అరెస్టు 6

లాటరీ టిక్కెట్లు.. డూప్లికేటు

- నిషేధించినా యథేచ్ఛగా అమ్మకాలు
- రెండు తెలుగు రాష్ట్రాల్లో ఓ వైసీపీ నేత హవా
- అసలుతోపాటు నకిలీలూ కోకొల్లలు.. రూ.కోట్ల దోపిడీ
- 2023లో విజయనగరంలో వెలుగుచూసిన ఘరానా మోసం
- తెనాలిలో మూలాలు గుర్తించినా అప్పటి నేతల ఒత్తిడితో చర్యలు శూన్యం
- ప్రస్తుతం ప్రభుత్వం మారినా ఆగని దందా.. పడని అడ్డుకట్ట

తెనాలి, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): లాటరీ టిక్కెట్లపై రెండు తెలుగు రాష్ట్రాల్లో ఎప్పటి నుంచో నిషేధం ఉంది. అయినా బహిరంగంగానే టిక్కెట్‌లు అమ్మేస్తున్నారు. అయితే వీటిలో అసలు టిక్కెట్లు 100 ఉంటే, దానికి పది రెట్లు నకిలీ టిక్కెట్లు ఉన్నాయి. వైసీపీ సర్కారు పోయి, కూటమి ప్రభుత్వం వచ్చినా గంజాయి కంటే ప్రమాదకారిగా పేదల రెక్కల కష్టాన్ని దోచేస్తున్న ఈ నకిలీ దందా గుట్టుపై మాత్రం ఇంకా కన్నుపడలేదు. 2023లోనే విజయనగరం, శీకాకుళం జిల్లాల్లో నకిలీ లాటరీ టిక్కెట్ల గుట్టు బయటపడినా అప్పట్లో వారికి అధికారపార్టీ నేతల అండదండలు ఉండటంతో చర్యలేమీ లేవు. అయితే రెండు రాష్ట్రాల్లో లాటరీ దందాకు మూల కేంద్రం తెనాలే కావడం వణుకుపుట్టించే విషయం. గంజాయి, బెట్టింగ్‌ల వంటివాటి విషయంలో ఇప్పటికే తెనాలికి అక్రమార్కులు ఖ్యాతిని తీసుకొస్తే, ఇప్పుడు లాటరీ టిక్కెట్ల వ్యవహారం కనిపించకుండా వేళ్లూనుకుపోవటం కలవర పరిచే విషయం. విజయనగరం, శ్రీకాకుళం జిల్లాల్లో గతేడాది ఈ లాటరీ టిక్కెట్లు, వాటి మాటునే గుట్టు చప్పుడు కాకుండా అమ్మేస్తున్న నకిలీ లాటరీ టిక్కెట్ల వ్యవహారం బయటపడింది. అక్కడ తీగలాగితే లాటరీ దందా డొంక తెనాలిలో తేలింది. ఆయా జిల్లాల పోలీసులు తెనాలి వచ్చి సోదాలు నిర్వహించారు. దీంతో లాటరీ టిక్కెడ్ల బండారం బయటకు పొక్కింది. నిషేధిత లాటరీ వ్యవహారంలో సూత్రధారి తెనాలిలోని వైసీపీకి చెందిన ఓ నాయకుడని తేల్చారు. అయితే అతడిపై చర్యలు లేకుండా అప్పట్లో పోలీసులపై ఒత్తిళ్లు వచ్చాయి. దీంతో చేసేదిలేక సూత్రధారులను పట్టుకోకుండానే పోలీసులు వెనుదిరిగి వెళ్లాల్సిన పరిస్థితి ఎదురైంది. శ్రీకాకుళం పోలీసులకు వైసీపీ సర్కారులోని ఓ ముఖ్యనేత, సీఎంవో నుంచి వార్నింగ్‌లు వచ్చాయి. ఆ తర్వాత ఈ అక్రమ వ్యాపారానికి అడ్డేలేని పరిస్థితి నెలకొంది. అప్పటి నుంచి నిషేధిత లాటరీ టిక్కెట్ల వ్యవహారం నేటికీ మూడు అసలు టిక్కెట్‌లు... ఆరు నకిలీ టిక్కెట్‌ల తరహాలో సాగిపోతూనే ఉంది. అప్పట్లో విజయనగరం జిల్లాలో ఇద్దరు స్నేహితులు రెండు లాటరీ టిక్కెట్లు కొనగా ఒకరికి రూ.కోటి గెలుచుకోగా, టిక్కెట్‌లు అమ్మిన వ్యాపారి మొండి చెయ్యిచూపాడు. దీంతో వారు పోలీసులను ఆశ్రయించగా లాటరీ టిక్కెట్ల వ్యవహారం వెలుగుచూసింది. అయితే ఒక్క శ్రీకాకుళమే కాకుండా విజయనగరం, విశాఖపట్టణం, అనకాపల్లి, అనంతపురం, కర్నూలు, గుంటూరు, ప్రకాశం, చిత్తూరు వంటి మరికొన్ని జిల్లాలు, ఆయా జిల్లాల్లోని వెనుకబడిన ప్రాంతాలే కేంద్రాలుగా వీరి దందా సాగిపోతూ వస్తోంది. చివరకు పట్టణాలు కాకుండా, మండల కేంద్రాలు, పల్లెలనూ వదలకుండా అక్రమ లాటరీ టిక్కెట్‌ల దందాను నడుపుతున్నారని అప్పట్లో పోలీసులే గుర్తించారు.

అసలు కంటే నకిలీలతో ఘరానా మోసం

అసలు టిక్కెట్‌లు కొని కూలి డబ్బులు పోగొట్టుకునే పరిస్థితి చాలాచోట్ల ఉంటే, వాటిలో నకిలీ లాటరీ టిక్కెట్‌లు కలిపి అమ్మేస్తూ ఘరానా మోసానికి తెగబడుతున్నారంటే ఎంత దారుణం. ఈ అక్రమార్కులకు అసలు టిక్కెట్ల కంటే, నకిలీలే మంచి ఆదాయ వనరుగా మారిపోయాయి. ఉదాహరణకు సిక్కిం, నాగాలాండ్ లాటరీల వంటి వాటి నుంచి రూ.లక్ష విలువైన లాటరీ టిక్కెట్లను ఈ నేత కొనుగోలు చేస్తాడు. వాటిని తమ వ్యాపారానికి ఎంపిక చేసుకున్న బడ్డీ కొట్లకు పంపుతాడు. అసలు టిక్కెట్లు కొంటేనే వాటిలో అదృష్టం కలిసొచ్చి లాటరీ తగలడం కష్టం, ఇంక వీటికి నకిలీలు కలిపేసి అమ్మితే లక్షల మంది ఆదృష్టం ఘరానా మోసం మాటున కొట్టుకుపోయి నట్లే. అంటే ఆయా లాటరీ సంస్థల నుంచి ఒక వెయ్యి నంబర్ల వరకు టిక్కెట్లు కొంటే, వాటి సీరియల్ నంబర్ 200 నుంచి 1200 వరకు ఉన్నాయనుకుందాం. వీటి విలువ కూడా రూ.లక్ష అనుకుంటే, ఈయన మాత్రం వాటికి మరో రూపది లక్షల నుంచి రూ.కోటి వరకు టిక్కెట్ విలువ ఆధారంగా నకిలీ టిక్కెట్లు కొత్త నంబర్‌లతో ముద్రించేసి ఆయా దుకాణాల ద్వారా అమ్మేస్తున్నాడు. ఈ రూపంలోనే ఆ నేత రూ.కోట్లకు పడగలెత్తాడని చెబుతున్నారు. అయితే ఇప్పటి వరకు లాటరీ టిక్కెట్‌ల వ్యవహారంలో పోలీసులు పట్టుకున్నా నిషేధిత లాటరీ టిక్కెట్ల విక్రయంపైనే కేసులు నమోదు చేసేవారు. అయితే ఈ నకిలీ రాకెట్ విషయం మాత్రం విజయనగరం, శ్రీకాకుళం జిల్లాల్లో బయటకు వచ్చాకే తెరపైకొచ్చింది. ఈ వ్యవహారంపై ఇప్పటికైనా పోలీసులు దృష్టిపెడితే పేదల రెక్కల కష్టం దోపిడీకి గురి కాకుండా కాపాడినవారవుతారు.

కబ్జా చేస్తే.. కటకటాలే

- భూ కబ్జాలపై ఉక్కుపాదం
- తప్పించుకునే వీలులేకుండా పగడ్బందీ చట్టం
- నిందితులకు అత్యంత తీవ్రమైన శిక్షలు.. ఆస్తుల సీజ్
- బాధితులకు భారీగా పరిహారం చెల్లింపునకు చర్యలు
- భూ కబ్జా కేసుల కోసం జిల్లా స్థాయిలో ప్రత్యేక కోర్టులు
- నేడు అసెంబ్లీలో ల్యాండ్ గ్రాబింగ్ ప్రొహిబిషన్ యాక్ట్ బిల్లు ప్రవేశపెట్టే అవకాశం

గుంటూరు, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): ల్యాండ్ మాఫియాను ఉక్కుపాదంతో అణచివేసేందుకు ప్రభుత్వం పగడ్బందీ చట్టాన్ని తీసుకొస్తున్నది. భూకబ్జాలకు పాల్పడ్డారో ఖతం అయినట్లే. ల్యాండ్ మాఫియాను ఉక్కుపాదంతో అణచివేసేందుకు ప్రభుత్వం పగడ్బందీ చట్టాన్ని తీసుకొస్తుంది. భూ కబ్జాదారుల మెడకు ఉచ్చు బిగించబోతోంది. అర్థబలం... అంగబలంతో రెచ్చిపోయిన ల్యాండ్ మాఫియా కట్టడే లక్ష్యంగా సామాన్యుల ఆస్తులకు రక్షణ కవచం లాగా నూతన ఆక్రమణల నిషేధిత చట్టాన్ని ప్రభుత్వం తీసుకొస్తోంది. ఇందుకు సంబంధించి అసెంబ్లీలో శుక్రవారం ల్యాండ్ గ్రాబింగ్ ప్రొహిబిషన్ యాక్ట్ బిల్లు ప్రవేశపెట్టే అవకాశం ఉన్నట్లు సమాచారం. ఇప్పటి వరకు ఇష్టారీతిన భూకబ్జాలతో ప్రజ, ప్రభుత్వ ఆస్తులను కొల్లగొట్టారు. రాజధాని అమరావతి ప్రాంతంలోని గుంటూరు జిల్లాతో పాటు అటు పల్నాడు, ఇటు బాపట్ల జిల్లాల్లో ల్యాండి మాఫియాకు సంబంధించి అక్రమార్కులు రాజకీయ పలుకుబడితో పాటు పోలీసులను గుప్పెట్లో పెట్టుకుని యథేచ్ఛగా తమ కార్యకలాపాలను కొనసాగించేవారు. ఎవరైనా వీరి అక్రమాలను అడ్డుకునేందుకు ప్రయత్నిస్తే వారిపై తప్పుడు కేసులతో వేధింపులకు గురి చేసేవారు. కోర్టులకు వెళితే ఎన్నేళ్ళకు కేసు తేలుతుందో అర్థం కాక కొందరు, కోర్టులకు వెళ్ళలేక మరికొందరు, కోట్ల ఖరీదైన ఆస్తులను వదులుకోలేక ఇంకొందరు అలాగని న్యాయపోరాటం చేయలేక సతమతమవుతూ వచ్చారు. అంతేకాక ఎవరైనా వారిని ధీటుగా ఎదుర్కొని పోలీసులకు ఫిర్యాదు చేసినా చట్టంలో ఉన్న లొసుగులను అడ్డుపెట్టుకుని స్టేషన్ బెయిల్‌పై వచ్చి ఆయా భూ యజమానులకు హెచ్చరికలు చేస్తూ తమ భూకబ్జాల పర్వం కొనసాగిస్తూ వచ్చారు. కొన్ని సందర్భాల్లో ల్యాండ్ మాఫియా, పోలీసులు చేతులు కలిపి భూ కబ్జాలను తెలివిగా సివిల్ వివాదం అంటూ ఉన్నతాధికారులను, చివరకు చట్టాన్ని సైతం తప్పుదారి పట్టించే ప్రయత్నం చేసి కోట్ల ఖరీదైన అమాయకుల భూములను

(మిగతా 6వ పేజీలో...)



ముఖ్యమంత్రిని కలసిన రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ చైర్మన్



రొంపిచర్ల, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రొంపిచర్ల గ్రామానికి చెందిన రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ చైర్మన్ గోనుగుంట్ల కోటేశ్వరరావు గురువారం ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడును కలిశారు. ఈ సందర్భంగా ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు. తనకు ఇచ్చిన పదవిని బాధ్యతగా నిర్వహిస్తానని తెలిపారు. అనంతరం మంత్రి నారా లోకేశ్, నారా భువనేశ్వరిని కలిశారు. ఆయన వెంట పలువురు తెలుగుదేశం పార్టీ నాయకులు ఉన్నారు.

ఏఎన్‌యూ మహిళా కబడ్డీ జట్టు ఎంపిక



ఎంపికైన జట్టుతో ప్రిన్సిపాల్ నాతాని వెంకటేశ్వర్లు, సెలక్షన్ కమిటీ సభ్యులు

నరసరావుపేట టౌన్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): కృష్ణవేణి డిగ్రీ కళాశాలలో జరిగిన ఏఎన్‌యూ అంతర కళాశాలల మహిళా కబడ్డీ పోటీల్లో భాగంగా ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం మహిళా కబడ్డీ జట్టును ఎంపిక చేసినట్లు టోర్నమెంట్ చైర్మన్, కళాశాల ప్రిన్సిపాల్ నాతాని వెంకటేశ్వర్లు గురువారం తెలిపారు. నరసరావుపేట కృష్ణవేణి డిగ్రీ కళాశాలకు చెందిన ఎం.త్రివేణి, ఎం.కావేరి, సీహెచ్ హేమలత, నాగార్జున యూనివర్సిటీ వ్యాయామ విద్య ఏఎన్యూకు చెందిన వి.పుష్ప, టి.ప్రమీల, తెనాలి జేఎంజే కాలేజికి చెందిన డి.హేమలత, పి.హేమలత, నరసరావుపేట విక్టరీ డిగ్రీ కాలేజీకి చెందిన జి.హర్షిత, నరసరావుపేట వాగ్దేవి డిగ్రీ కళాశాలకు చెందిన కె.ఆదిలక్ష్మి, ఒంగోలు డీఏస్ గవర్నమెంట్ డిగ్రీ కాలేజికి చెందిన కె.రత్నకుమారి, గుంటూరు గవర్నమెంట్ డిగ్రీ కాలేజీకి చెందిన పి.యమున, ముప్పాళ్ల ధనలక్ష్మి, ఫిజికల్ ఎడ్యుకేషన్‌కు చెందిన కె.శాంతకుమారి జట్టుకు ఎంపిక అయ్యారన్నారు. స్టాండ్ బైగా నరసరావుపేట కృష్ణవేణి డిగ్రీ కళాశాలకు చెందిన పి.లక్ష్మి, ఆచార్య నాగార్జున యూనివర్సిటీకి చెందిన ఎస్.నీలిమా, బాపట్ల ఇంజనీరింగ్ కాలేజికి చెందిన ఎ.గోపి శివమ్మ ఎంపిక అయ్యారు. జట్టును ఎంపిక చేయడానికి యూనివర్సిటీ సెలక్షన్ కమిటీ సభ్యులుగా సీహెచ్ వెంకట్రావు, పి.గణేష్, ఎ.అరుణ సుజాత, టోర్నమెంట్ అబ్జర్వర్‌గా డాక్టర్ డి.సూర్యనారాయణరావు వ్యవహరించారు. జట్టుకు ఎంపికైన సభ్యులు ఈ నెల 29న తమిళనాడులోని అలగప్ప యూనివర్సిటీ కారైకుడిలో జరగబోయే సౌత్ జోన్ అంతర విశ్వవిద్యాలయ మహిళా కబడ్డీ పోటీల్లో పాల్గొంటారని టోర్నమెంట్ ఆర్గనైజింగ్ సెక్రటరీ, కళాశాల పీడీ ఈదర ఆదిబాబు తెలియజేశారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ కె.నాసరయ్య, వీర రాఘవులు, వైస్ ప్రిన్సిపాల్ ఎంఆర్‌కే సతీష్‌బాబు, సయ్యద్ మహమ్మద్, ఎం తిరుపతిరావు పాల్గొన్నారు.

ఎంబీబీఎస్ ఎక్కడ చదివినా స్థానికులుగానే పరిగణించాలి

గుంటూరు(విద్య), నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్‌కు చెందిన విద్యార్థులు దేశంలో ఏ రాష్ట్రంలో ఎంబీబీఎస్ కోర్సు పూర్తి చేసినా స్థానికులుగానే పరిగణించాలని కోరుతూ ఆంధ్రప్రదేశ్ మెడికోస్ పేరెంట్స్ అసోసియేషన్(ఏపీఎంపీఏ) తరఫున అధ్యక్షులు డాక్టర్లు ఆలా వెంకటేశ్వర్లు, న్యాయ సలహాదారు వై.ఠాగూర్ యాదవ్ పేర్కొన్నారు. ఈ మేరకు వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్‌కు గురువారం లేఖ రాసినట్లు తెలిపారు. ప్రస్తుత నిబంధనలు కొనసాగినట్లయితే అనేకమంది ప్రతిభావంతులైన విద్యార్థులు పీజీ సీట్లు పొందే అర్హత కోల్పోతారని అన్నారు. అంతేకాకుండా భవిష్యత్తులో ఆంధ్రప్రదేశ్ విద్యార్థులెవరూ ఆల్ ఇండియా కోటా ద్వారా ఇతర రాష్ట్రాల్లో ఎంబీబీఎస్ చేయడానికి ఇష్టపడరని తెలిపారు. దీనివల్ల ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఆల్ ఇండియా కోటాకు కేటాయిస్తున్న దాదాపు 450 ఎంబీబీఎస్ సీట్లు వృథా అయ్యే అవకాశం ఉందన్నారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి ప్రస్తుతం ఉన్న జీవోను మార్చాలని కోరారు.

సాగర్ ప్రాజెక్ట్ నీటి సమాచారం

మాచర్ల రూరల్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): నాగార్జున సాగర్ ప్రాజెక్ట్ నీటి మట్టం గురువారం నాటికి 586.20 అడుగులు ఉంది. ఇది 301.35 టీఎంసీలకు సమానం. కుడి కాలువ ద్వారా 9500 క్యూసెక్కులు, ఎడమ కాలువ ద్వారా 6556 క్యూసెక్కులు, ప్రధాన జలవిద్యుత్ కేంద్రం ద్వారా 12,424 క్యూసెక్కులు, ఎస్ఎల్‌బీసీ ద్వారా 2400, ఎల్ఎల్‌సీ ద్వారా 400 క్యూసెక్కులు, మొత్తం ఔట్‌ఫ్లో వాటర్ 31,280 క్యూసెక్కులను విడుదల చేస్తున్నారు. శ్రీశైలం నుంచి నాగార్జున సాగర్‌కు ఇన్‌ఫ్లో వాటర్‌గా 31,280 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతోంది.

పుస్తక పఠనాన్ని అలవర్చుకోవాలి

- స్మార్ట్ ఫోనుకు బానిసలుగా మారొద్దు
- జిల్లా విద్యాశాఖాధికారి సీవీ రేణుక
- ఘనంగా గ్రంథాలయ వారోత్సవాలు ప్రారంభం



గ్రంథాలయ వారోత్సవాలను ప్రారంభిస్తున్న డీఈవో రేణుక, డీపీవో నాగసాయి కుమార్

గుంటూరు(తూర్పు), నవంబరు 14(ఆంధ్రజ్యోతి): పుస్తక పఠనంపై దృష్టి సారించేలా తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు కృషి చేయాలని జిల్లా విద్యాశాఖాధికారి(డీ ఈవో)సీవీ రేణుక అన్నారు. గురువారం స్థానిక అరండలపేటలోని ఉమ్మడి గుంటూరు జిల్లా గ్రంథాలయ సంస్థ, జిల్లా కేంద్ర గ్రంథాలయంలో 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలను జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి వి.సుబ్బరత్నమ్మ, డీపీవో బి.వి.నాగ సాయి కుమార్, కన్నా విద్యా సంస్థల అధినేత కన్నా మాస్టరు. గుళ్ళపల్లి సేవా సంస్థ మేనేజింగ్ ట్రస్టీ గుళ్ళపల్లి సుబ్బారావులతో కలిసి ఆమె ప్రారంభించారు. అనంతరం డీఈవో రేణుక మాట్లాడుతూ ముఖ్యంగా డిజిటల్ యుగంలో మొబైల్ లేకుండా జీవించడం లేదని, దీంతో రేడియేషన్ బారినపడి పిల్లల జ్ఞాపకశక్తి దెబ్బతింటుందని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యార్థులు మొబైల్‌కు బానిసలుగా మారద్దని హితవు పలికారు. జ్ఞానం సంపాదించడానికి గ్రంథాలయాలు దోహదపడతాయన్నారు. వి. సుబ్బరత్నమ్మ మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా ఉన్న 97 శాఖ, 32 గ్రామీణ గ్రంథాలయాలు, 103 పుస్తక పంపిణీ కేంద్రాల ద్వారా ప్రజలకు ఎనలేని సేవలు అందిస్తున్నట్లు తెలిపారు. జిల్లా గ్రంథాలయంలో 51 వేల పుస్తకాలు ప్రజలకు అందుబాటులో ఉన్నాయన్నారు. ఈ వారోత్సవాల సందర్భంగా విద్యార్థులకు, మహిళలకు వివిధ అంశాల్లో పోటీలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించి ముగింపు రోజున విజేతలకు బహుమతులు అందజేయనున్నట్లు తెలిపారు. డీపీవో బి. వి.నాగసాయికుమార్, కన్నా మాస్టారు మాట్లాడుతూ పుస్తక పఠనంతో క్రమశిక్షణ, విలువలు పెరుగుతాయని అన్నారు. ఈ సందర్భంగా గ్రంథాలయ వారోత్సవాలను పురస్కరించుకొని గుళ్ళపల్లి సేవా సంస్థ మేనేజింగ్ ట్రస్టీ గుళ్ళపల్లి సుబ్బారావు రూ.10 వేల విలువ కలిగిన పోటీ పరీక్షల పుస్తకాలను గ్రంథాలయానికి అందించారు. కార్యక్రమంలో చిన్నారులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ఉప గ్రంథపాలకురాలు కందుల ఝాన్సీ లక్ష్మీ, ప్రముఖ వ్యాఖ్యాత సుజాత, విద్యార్థులు, తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

హత్య కేసులో నిందితుల అరెస్టు



వివరాలను వెల్లడిస్తున్న డీఎస్పీ జనార్దనరావు

పొన్నూరుటౌన్, నవంబరు14: ములుకుదురు గ్రామంలో ఇటీవల జరిగిన హత్య కేసులో ఏడుగురు నిందితులను అరెస్టు చేసినట్లు తెనాలి డీఎస్పీ పి.జనార్ధనరావు తెలిపారు. గురువారం రూరల్ పోలీస్ స్టేషన్‌లో జరిగిన విలేకర్ల సమావేశంలో డీఎస్పీ నిందితులను అరెస్టు చూపి హత్య కేసు వివరాలను వెల్లడించారు. ములుకుదురు గ్రామానికి చెందిన దేవరాజ్ విద్యుత్ మీటర్ రీడింగ్ తీసే పని చేసేవాడు. ములుకుదురు గ్రామానికే చెందిన మాధవ్ అనే యువకుడితో దేవరాజ్‌కు విభేదాలు ఉన్నాయి. అదే గ్రామానికి చెందిన జ్యోతి అనే వివాహితతో దేవరాజ్ వివాహేతర సంబంధం నేపథ్యంలో చనువుగా ఉన్నాడు. దీంతో ఆగ్రహానికి గురైన మాధవ్ తన మిత్రుడి సహాయంతో దేవరాజ్‌ను హత్య చేయాలని నిర్ణయించుకున్నాడు. ఇందు కోసం తన మిత్రుడు మణికంఠకు రూ. 2 లక్షలు ఇస్తానని ఒప్పందం కుదుర్చుకున్నాడు. మణికంఠ అదే గ్రామానికి చెందిన యువకులు జోసఫ్, సాయి, రాజు అనే యువకులను సంప్రదించి డబ్బులు ఆశ చూపి హత్యకు సిద్ధమైయ్యారు. ఈ నెల 9వ తేదీ రాత్రి జ్యోతి ఇంటికి వచ్చిన దేవరాజ్ కళ్లలో కారం చల్లి పంట పొలాల్లోకి తీసుకెళ్లి హత్య చేశారు.దేవరాజ్ బంధువులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి ఐదుగురు నిందితులతోపాటు వారికి సహకరించిన మరో ఇద్దరు మైనర్లను అరెస్టు చేసినట్లు డీఎస్పీ వివరించారు. సమావేశంలో సీఐ వై.కోటేశ్వరరావు, ఎస్సై జి.కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

కబ్జా చేస్తే.. కటకటాలే

(5 పేజీ తరువాయి)

అప్పనంగా కొట్టేసిన ఉదంతాలెన్నో ఉన్నాయి.

గడిచిన ఐదేళ్లలో రెచ్చిపోయిన భూమాఫియా..

గడిచిన ఐదేళ్లలో రాష్ట్రవ్యాప్తంగా ముఖ్యంగా ఉమ్మడి గుంటూరు జిల్లాలో భూమాఫియా రెచ్చిపోయింది. అధికార పార్టీ నేతలు, పోలీసులను తమ గుప్పెట్లో పెట్టుకుని ఖరీదైన భూములను కొట్టేశారు. ఒకవైపు ప్రభుత్వ, అసైన్డ్ భూములు, చుక్కల భూములు వంటి వాటిని సైతం తమ మాయాజాలంతో చేతులు మార్చుకున్నారు. పేదలు, అమాయకుల ఆస్తులను తప్పుడు రిజిస్ట్రేషన్లతో వశం చేసుకున్నారు. ప్రశ్నించిన వారిపై ఎస్సీ ఎస్టీ సహా తప్పుడు కేసులు బనాయించి వేధింపులకు గురి చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే టీడీపీ, జనసేన రాష్ట్ర కార్యాలయాల్లో ఫిర్యాదుల స్వీకరణ కార్యక్రమం ప్రారంభించారు. మరోవైపు లోకేశ్ కూడా తన నివాసంలో బాధితుల నుంచి ఫిర్యాదుల స్వీకరిస్తున్నారు. గడిచిన ఐదు నెలలుగా రాష్ట్రవ్యాప్తంగా వస్తున్న ఫిర్యాదుల్లో 80 శాతానికి పైగా ల్యాండ్ మాఫియా సాగించిన భూకబ్జాలపైనే కావడంతో ప్రభుత్వం ఉలిక్కిపడింది. మరోవైపు నాడు అధికారాన్ని వెలగబెట్టిన వారిలో అనేకమంది మంత్రులు, ఎమ్మెల్యేలు కీలక పదవుల్లో ఉన్న నాయకులు, వైసీపీ ముఖ్య నేతలు పెద్ద ఎత్తున ప్రభుత్వ భూములను తమ పేరిట, అనుయాయుల పేరిట, బినామీ పేర్లతో కొట్టేశారు. వీటిని పరిశీలించిన ప్రభుత్వం ల్యాండ్ మాఫియాపై ఉక్కుపాదం మోపాలని నిర్ణయించుకుని పకడ్బందీగా భూకబ్జా నిషేధిత చట్టాన్ని తీసుకొచ్చింది. దీనిపై ఈ నెల 4న జరిగిన క్యాబినెట్ సమావేశంలో మంత్రి మండలి ఆమోదముద్ర కూడా వేసింది. ప్రస్తుతం జరుగుతున్న అసెంబ్లీ సమావేశాల్లోనే దీనిని ఆమోదించనున్నారు. ఈ నేపథ్యంలో రానున్న కొద్ది నెలల్లో ఈ చట్టం అమల్లోకి రాబోతుంది.

ఎస్పీ గ్రీవెన్స్‌కు వెల్లువెత్తుతున్న ఫిర్యాదులు

భూకబ్జాలకు సంబంధించి ప్రతి సోమవారం బాధితులు పెద్దసంఖ్యలో గుంటూరు, బాపట్ల, పల్నాడు ఎస్పీ కార్యాలయాల్లో జరిగే గ్రీవెన్స్‌లకు పోటెత్తుతున్నారు. ఎస్పీల గ్రీవెన్స్‌కు వచ్చే ఫిర్యాదుల్లో అత్యధికం భూకబ్జాలకు సంబంధించినవే ఉంటుండటం గమనార్హం. ఎస్పీ కార్యాలయం నుంచి సంబంధిత స్టేషన్‌లకు వెళ్లినా పోలీసులు సివిల్ వివాదమని పక్కన పెట్టేస్తున్నారు. దీంతో బాధితుల గోడు వినేవారే కరువవుతున్నారు. కోట్ల ఖరీదైన సామాన్యుల భూములను చట్టంలో ఉన్న లొసుగులను, రాజకీయ పలుకుబడిని అడ్డుపెట్టుకుని కొట్టేశారు. సంచలనం సృష్టించిన గుంటూరు శ్యామలానగర్‌లో జరిగిన భూకబ్జా వ్యవహారం మొదలు ఇటీవల వరకు ఎన్నో ఉదంతాలు చోటుచేసుకున్నాయి. శ్యామలానగర్‌లో జరిగిన భూకబ్జా వ్యవహారంలో ఏకంగా డీఎస్పీ, సీఐ, ఎస్ఐ, పోలీసు సిబ్బంది సస్పెన్షన్‌కు గురైన వ్యవహారం తీవ్ర కలకలం రేపిన విషయం విదితమే. ఆ తర్వాత గుంటూరు పలకలూరు రోడ్డులోను ఇదే తరహాలో అనేక భూకబ్జా ఘటనలు చోటుచేసుకున్నాయి.

ఆరు నెలల్లోనే విచారణ పూర్తయ్యేలా చట్టం

అమాయకులు, వృద్ధులు, ఎన్ఆర్ఐల భూములపై కన్నేసి తప్పుడు డాక్యుమెంట్లు సృష్టించి డబుల్ రిజిస్ట్రేషన్ చేసి వివాదం సృష్టిస్తే కోర్టుల చుట్టూ తిరగలేక వారే దారికి వస్తారులే అని ఇప్పటిదాకా భూములు కొల్లగొట్టిన ల్యాండ్ మాఫియా ఆటలు ఇక సాగవు. కొత్తగా వస్తున్న ఈ చట్టం ప్రకారం ఏ వివాదమైనా ఆరు నెలల్లో విచారణ పూర్తి చేసి తీర్పు వెలువరించాల్సి ఉంటుంది. ఇంతకు ముందు మాదిరిగా కేసు కొట్టేయడం కాదు. భూమి ఆక్రమించినట్లు తేలితే నిందితుడిపై కఠిన చర్యలు ఉండనున్నాయి. నిందితుడికి కనీసం 10 నుంచి 14 ఏళ్లకు తక్కువ కాకుండా జైలుశిక్ష విధించనున్నారు. అంతేకాదు ఆక్రమించిన భూమి విలువతో పాటు మూడు రెట్ల వరకు నిందితుడి నుంచి నష్ట పరిహారం వసూలు చేయనున్నారు. ఇందుకుగాను ప్రతి జిల్లాలో ప్రత్యేక కోర్టులు ఏర్పాటు చేయనున్నారు. ఆయా కోర్టుల్లో కేవలం భూ కబ్జా కేసులు మాత్రమే విచారించనున్నారు. భూ ఆక్రమణలకు సంబంధించి ఆయా కోర్టులే నేరుగా సుమోటోగా కేసులు విచారణ చేపట్టే అధికారాలు కూడా కల్పించనున్నారు. భూకబ్జాలకు పాల్పడే మాఫియాకు ఏ మాత్రం అవకాశం, లొసుగులకు ఆస్కారం లేకుండా నూతన చట్టాన్ని తీసుకురాబోతున్నారు.

రూ.3.97 లక్షల నకిలీ ఇంజన్ ఆయిల్ పట్టివేత



నకిలీ ఇంజన్ ఆయిల్ పట్టుకున్న విజిలెన్స్ సీఐలు కొమ్మలపాటి చంద్రశేఖర్, పి.శివాజీ

గుంటూరు సిటీ, నవంబర్ 14 (ఆంధ్రజ్యోతి): నకిలీ ఇంజన్ ఆయిల్ నిల్వలను గుంటూరు విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు చాకచక్యంగా పట్టుకున్నారు. విజిలెన్స్ ఎస్పీ సూర్య శ్రావణ కుమార్ పర్యవేక్షణలో గురువారం తాడేపల్లి మండలం మెల్లెంపూడి గ్రామంలో అక్రమంగా నిల్వ ఉంచిన నకిలీ ఇంజన్ ఆయిల్ నిల్వలను గుర్తించారు. విజయవాడలోని కృష్ణలంకకు చెందిన మాదాసు నాగ దుర్గ ప్రసాద్ అనే వ్యక్తి పలు ట్రేడర్ల వద్ద నుంచి రీసైక్లింగ్ చేసిన ఇంజన్ ఆయిల్ కొనుగోలు చేసి వాటిని కొత్త వాటిలా ప్యాక్ చేసి మార్కెటింగ్ చేస్తున్నాడు. రీసైక్లింగ్ చేసిన ఇంజన్ ఆయిల్‌ను 5, 3, 1, అర లీటర్ల డబ్బాల్లో నింపి వాటికి క్యాస్ట్రల్, బజాజ్, హీరో, హోండా మొదలగు ప్రముఖ కంపెనీల స్టిక్కర్లు వేసి నకిలీ ఇంజన్ ఆయిల్‌ను మార్కెట్లో అక్రమంగా విక్రయిస్తున్నాడు. ప్యాకింగ్‌కు కావాల్సిన డబ్బాలు, లేబుల్స్‌ను కలకత్తా నుంచి ఎటువంటి బిల్లులు లేకుండా తెప్పించుకుంటున్నారు. విజిలెన్స్ అధికారుల దాడుల్లో రూ.3,97,950 విలువ చేసే 1280 లీటర్ల నకిలీ ఇంజన్ ఆయిల్ లభ్యం అయినట్లు సీఐలు కొమ్మలపాటి చంద్రశేఖర్, పి.శివాజీ వెల్లడించారు. మాదాసు నాగ దుర్గాప్రసాద్, అతనికి సహకరించిన వారిపై తాడేపల్లి పోలీస్ స్టేషన్‌లో క్రిమినల్ కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఈ దాడుల్లో రూ.60,000 విలువ చేసే ప్యాకింగ్ మెటీరియల్, ఆయిల్ గన్స్ ఆయిల్ ఫిల్లింగ్ మిషన్, క్యాప్ ప్రెస్సింగ్ మిషన్, మెజరింగ్ జార్స్‌ను స్వాధీనం చేసుకుని సీజ్ చేసినట్లు తెలిపారు.

ఉన్నత వైద్యులుగా ఎదిగి సమాజ సేవ చేయాలి



వైద్య విద్యార్థికి యాప్రాన్ అందజేస్తున్న పొదిల ప్రసాద్

గుంటూరు మెడికల్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): వైద్య విద్యార్థులు జీవితంలో ఉన్నత స్థాయికి ఎదిగి తల్లిదండ్రులు తమపై పెట్టుకున్న నమ్మకాన్ని నిలబెట్టుకోవాలని ఎన్నారై, ప్రముఖ గ్యాస్ట్రోఎంటిరాలజిస్ట్ డాక్టర్ పొదిల ప్రసాద్ ఉద్బోధించారు. గురువారం గుంటూరు వైద్య కళాశాల జింకానా ఆడిటోరియంలో జరిగిన 2024-25 బ్యాచ్ మెడిసిన్ విద్యార్థులు నిర్వహించిన ఫ్రెషర్స్ డే వేడుకలు 'లూమినా 24'లో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. జీఎంసీ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎన్‌వీ సుందరాచారీ అధ్యక్షత వహించారు. దేశ, విదేశాల్లో ప్రఖ్యాతి గాంచిన గుంటూరు వైద్య కళాశాలలో మెడిసిన్ చదవడం గొప్ప అదృష్టంగా భావించాలని డాక్టర్ ప్రసాద్ తెలిపారు. ప్రజాధనంతో ప్రభుత్వ వైద్య కళాశాలలో చదుకొని వైద్యులుగా ఎదిగిన తర్వాత సమాజానికి ఏదో ఒక రూపంలో తిరిగి తమ వంతు సేవలు అందించాలని ఆయన కోరారు. జీఎంసీ, జీజీహెచ్ అభివృద్ధికి కళాశాల పూర్వ విద్యార్థులు చేస్తున్న సేవలు అభినందనీయమన్నారు. అనంతరం వైట్‌కోట్ సెర్మనీ నిర్వహించారు. జింకానా తెలకచర్ల ట్రస్ట్ సౌజన్యంతో 250 మంది మెడికోలకు యాప్రాన్ (వైట్‌కోటు)లను డాక్టర్ పొదిల ప్రసాద్, జింకానా కోఆర్డినేటర్లు డాక్టర్ పీవీ హనుమంతరావు, డాక్టర్ వి. బాలభాస్కరరావు అందజేశారు. కార్యక్రమంలో జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ రమణ యశస్వి, జీఎంసీ వైస్ ప్రిన్సిపాళ్లు డాక్టర్ శ్రీధర్, డాక్టర్‌ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

పుస్తక పఠనాసక్తి పెంచడమే లక్ష్యం

- ఉమ్మడి గుంటూరు జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి సుబ్బరత్నమ్మ





గుంటూరు, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): నేటి ఇంటర్నెట్ యుగంలో పిల్లల్లో పుస్తక పఠనాసక్తి తగ్గిపోయింది. ప్రతీ దానికి గూగుల్‌లో వెతుకుతున్నారు. దీని వలన వారికి వివిధ రంగాలపై అవగాహన ఉండటం లేదు. ఈ నేపథ్యంలో పిల్లల్లో పుస్తక పఠనాసక్తి పెంచడమే లక్ష్యంగా గ్రంథాలయ వారోత్సవాలను ప్రారంభించారు. ఈ నెల 20వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు ఉమ్మడి గుంటూరు జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి వంకదారి సుబ్బరత్నమ్మ తెలిపారు. గ్రంథాలయాల వారోత్సవాల లక్ష్యంపై ఆమె 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడారు.

గ్రంథాలయాల ఉనికికి ముప్పు వాటిల్లుతున్న ప్రస్తుత తరుణంలో దానిని ఎదుర్కోవడానికి ఎలాంటి చర్యలు చేపట్టారు?

కార్యదర్శి: ప్రతి ఆదివారం వుయ్ లవ్ రీడింగ్ (చదవడం మాకు ఇష్టం) అనే కార్యక్రమాన్ని అన్ని గ్రంథాలయాల్లో నిర్వహిస్తున్నాం. పాఠశాలలు, కళాశాలలకు వెళ్లి విద్యార్థులను ఆహ్వానిస్తున్నాం. ఈ కార్యక్రమానికి విద్యార్థుల నుంచి స్పందన కూడా బాగుంది.

వారోత్సవాల్లో ఎలాంటి కార్యక్రమాలు నిర్వహించనున్నారు?

కార్యదర్శి: 15న పుస్తక ప్రదర్శన ఏర్పాటు, మాదకద్రవ్యాలపై అవగాహన, 16న గ్రంథాలయ ఉద్యమంలో పాల్గొన్న ప్రముఖులను స్మరించుకోవడం, 17న కవి సమ్మేళనాలు, సదస్సులు, రచయితల సందేశాలు, 18న విద్యార్థులకు చిత్రలేఖనం, వ్యాసరచన, వక్తృత్వ, క్విజ్, ఆటల పోటీలు, 19న మహిళలకు రంగవల్లి, అల్లికల పోటీలు, 20న సామూహిక స్వీయ పఠనం కార్యక్రమాలను నిర్వహించనున్నాం.

డిజిటల్ గ్రంథాలయాల కాన్సెప్ట్ ఏమిటి?

కార్యదర్శి: డిజిటల్ గ్రంథాలయాలంటే ఉమ్మడి గుంటూరు జిల్లాలోని అన్ని లైబ్రరీలను ఇంటర్‌లింకప్ చేయడం. దాంతో ఒక గ్రంథాలయంలో పొందలేకపోయిన సమాచారాన్ని వేరే దాంట్లో డిజిటల్ రూపంలో ఇక్కడి నుంచే పొందవచ్చు.

ఎలాంటి పుస్తకాలు పాఠకులకు అందుబాటులో ఉన్నాయి?

కార్యదర్శి: గ్రంథాలయాలంటేనే చరిత్రకి అద్దం పడతాయి. దశాబ్దాల నాటి దినపత్రికలు. పోటీ పరీక్షలకు సన్నద్ధం కావడానికి అవసరమయ్యే పుస్తకాలు, స్టడీ మెటీరియల్ వంటివి అందుబాటులో ఉన్నాయి. వందల సంఖ్యలో పాఠకులు ఉదయం వచ్చి సాయంత్రం వరకు గ్రంథాలయాల్లో ఉండి పోటీ పరీక్షలకు సన్నద్ధం అవుతున్నారు. చాలామంది ఉద్యోగాలు సంపాదించిన సంఘటనలు ఉన్నాయి.

డీఎస్సీ పరీక్షకు ఉచిత శిక్షణ

గుంటూరు(విద్య), నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): డీఎస్సీ పరీక్షకు(ఎస్‌జీటీ) అర్హులైన ఈబీసీ, ఈఎస్‌డబ్ల్యూఎస్, అభ్యర్థులకు బీసీ స్టడీ సర్కిల్ ఆధ్వర్యంలో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు బీసీ సంక్షేమశాఖ డీడీ కె.మయూరి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు తమ దరఖాస్తులను నవంబరు నెల 17వ తేదీ లోగా బీసీ స్టడీ సర్కిల్, గుంటూరు వారికి దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. శిక్షణకు ఎంపికైన 20 మంది అభ్యర్థులకు 2 నెలలు పాటు ఉచిత శిక్షణతో పాటు సైఫండ్, స్టడీ మెటీరియల్ ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. టెట్ పరీక్ష క్వాలిఫై అయిన అభ్యర్థులు మాత్రమే ఈ శిక్షణకు అర్హులని తెలిపారు. టీటీసీలో వచ్చిన మార్కుల మెరిట్ ప్రాతిపదికన అభ్యర్థులను ఎంపిక చేస్తామన తెలిపారు. ఈ ఉచిత శిక్షణకు ఎంపికైన అభ్యర్థులకు ఈ నెల 18వ తేదీ నుంచి శిక్షణ తరగతులను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. అభ్యర్థులు తమ బయోడేటాతో పాటు 10వ తరగతి, టీటీసీ మార్కు లిస్టులు, టెట్ మార్కులిస్టులు, కుల ధ్రువీకరణ పత్రం, ఆదాయ ధ్రువీకరణ పత్రం (తల్లిదండ్రుల వార్షిక ఆదాయం రూ. 1,00,000 లోపు ఉండాలి) ఆధార్, బ్యాంక్ పాస్ పుస్తకం జిరాక్స్, 2 పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోలు జతపరచి ఈ నెల 17 తేదీలోగా రాజాగారితోటలోని బీసీ స్టడీ సర్కిల్, గుంటూరు కార్యాలయంలో అందజేయాలని తెలిపారు. ఇతర వివరాల కోసం బీసీ స్టడీ సర్కిల్ 0863- 2358071 ను సంప్రదించాలని సూచించారు.

లక్నోకు ప్రత్యేక గరీబ్ రథ్ రైలు

- గయ, కాశీ, అయోధ్య వెళ్లే యాత్రికులకు ఉపయోగకరం

గుంటూరు, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): గయ, వారణాసి(కాశీ), అయోధ్య తదితర పుణ్యక్షేత్రాలను సందర్శించే ప్రయాణికుల సౌకర్యార్థం గుంటూరు మీదగా గరీబ్ రథ్ రైలుని నడపనున్నట్లు దక్షిణ మధ్య రైల్వే గురువారం ప్రకటించింది. ఈ నెల 15, 22(శుక్రవారం) తేదీల్లో నంబరు. 07084 సికింద్రాబాద్ - లక్నో ప్రత్యేక రైలు రాత్రి 7.05కి బయలుదేరి 11.35కి గుంటూరు, ఆదివారం వేకువజామున 4.30కి గయ, ఉదయం 9.15కి వారణాసి, మధ్యాహ్నం 1.35కి అయోధ్య, సాయంత్రం 6 గంటలకు లక్నో చేరుకుంటుంది. నంబరు. 07083 లక్నో - సికింద్రాబాద్ ప్రత్యేక రైలు ఈ నెల 18, 25 తేదీల్లో(సోమవారం) ఉదయం 9.50కి బయలుదేరి మధ్యాహ్నం 1 గంటకు అయోధ్య, సాయంత్రం 5.30కి వారణాసి, రాత్రి 10.50కి గయ, బుధవారం ఉదయం 7.55కి గుంటూరు, మధ్యాహ్నం 3 గంటలకు సికింద్రాబాద్ చేరుకుంటుంది. ఈ రైళ్లు మొత్తం ఏసీ త్రీటైర్ బోగీలతో ప్రయాణిస్తాయి.

మోటార్ సైకిల్‌పై నుంచి పడి అధ్యాపకురాలు మృతి

మేడికొండూరు, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): మోటార్ సైకిల్‌పై వెళ్తూ కింద కు పడిపోయి అధ్యాపకురాలు మృతి చెందిన సంఘటన మేడికొండూరు మండలంలోని పేరేచర్ల ఆరో మైలు కాలనీ వద్ద గురువారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గుంటూరు నగర పరిధిలోని నల్లపాడుకు చెందిన దాసరి సుష్మిత (49) మాచర్లలోని ఎస్‌కేబీఆర్ డిగ్రీ కళాశాలలో అధ్యాపకురాలిగా పని చేస్తున్నారు. ప్రతి రోజూ ఉదయం 6 గంటలకు ఆమె బస్సులో వెళ్లి వస్తుంటారు. ఎక్స్‌ప్రెస్ బస్సులు నల్లపాడులో ఆగకపోవడం వల్ల పేరేచర్లలో బస్సు ఎక్కేందుకు తన కుమారుడు దాసరి ధనుష్ శ్రీవత్సవతో కలసి బుల్లెట్ మోటార్ సైకిల్‌పై బయలుదేరి పేరేచర్లకు వస్తున్నారు. మార్గమధ్యలో 6వ మైలు కాలనీ వద్ద ఆమె ప్రయాణిస్తున్న మోటార్ సైకిల్ వెనుక చక్రంలో సుష్మిత చీర చుట్టుకుపోయింది. దీనిని గమనించకుండా మోటార్ సైకిల్ వెళ్తుండటంతో ఆమె మోటార్ సైకిల్ పైనుంచి కిందకు పడిపోయింది. సుష్మిత తలకు గాయం కావడంతో అక్కడికక్కడే మృతి చెందారు. మృతదేహాన్ని గుంటూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించి కేసు నమోదు చేశారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

- విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.40
- నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	125, 134,145
చికెన్ విత్ స్కిన్	236.00
చికెన్ స్కిన్ లెస్	246.00

మూడు రోజులపాటు తాగునీటి సరఫరాలో అంతరాయం

గుంటూరు కార్పొరేషన్, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): నగరంలో మూడు రోజులపాటు శుక్ర, శని, ఆదివారాల్లో తాగునీటి సరఫరాలో అంతరాయం కలుగుతుందని జీఎంసీ కమిషనర్ పులి శ్రీనివాసులు గురువారం ప్రకటనలో తెలిపారు. స్థానిక నెహ్రూనగర్ నుండి హెచ్‌ఎల్‌ఆర్ రిజర్వాయర్‌కు తాగునీటి సరఫరా జరిగే 800 ఎంఎం డయా పిఎస్సీ పైప్ లైన్‌పై సంజీవయ్యనగర్ రైల్వే గేటు వద్ద ఏర్పడ్డ లీకుల మరమ్మతులు శుక్రవారం మధ్యాహ్నం నుండి చేపట్టేందుకు జీఎంసీ ఇంజినీరింగ్ అధికారులు యాక్షన్ ప్లాన్ సిద్ధం చేసినట్లు తెలిపారు. శుక్రవారం ఉదయం నీటి సరఫరా అనంతరం పనులను చేపట్టనున్నారని పేర్కొన్నారు. స్థానిక లక్ష్మీపురం, స్తంభాల గరువు, గుజ్జనగుండ్ల, ఏటీ అగ్రహారం, ఏఎంసీ, హౌసింగ్ బోర్డ్, కోర్ట్ కాంపౌండ్, కేవీపీ కాలనీ, వికాస్ నగర్, శ్యామలానగర్, హనుమయ్య నగర్, నెహ్రూ నగర్, రాజీవ్ గాంధీ నగర్, బొంగరాల బీడు, వసంతరాయపురం, శారదా కాలనీ రిజర్వాయర్ల పరిధిలో శుక్రవారం సాయంత్రం, శనివారం రోజు పూర్తిగా నీటి సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు. ఆదివారం ఉదయం పాక్షికంగా, సాయంత్రం నుండి యథావిధిగా సరఫరా జరుగుతుందని, ఈ విషయాన్ని నగర ప్రజలు గమనించి, తగిన ముందస్తు ఏర్పాట్లు చేసుకోవాలని తెలిపారు.



నగేశ్‌ను పరామర్శిస్తున్న ఆర్డీవో, రెవెన్యూ సంఘ నాయకులు

కారు బోల్తా పడి తహసీల్దార్ నగేశ్‌కు గాయాలు

గుంటూరు(తూర్పు), నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): అదుపు తప్పి కారుబోల్తా పడిన ఘటనలో నగర తూర్పు తహసీల్దారు నగేశ్‌కు గాయాలయ్యాయి. ఆయనతో పాటు డ్రైవర్ కూడా గాయపడ్డారు. బుధవారం కర్నూల్‌లో జరిగిన వివాహానికి ఆయన హాజరయ్యారు. తిరుగు ప్రయాణంలో నగర శివారు చిన పలకలూరు వద్ద ఈ ప్రమాదం జరిగింది. తెల్లవారుజామున డ్రైవరుకు నిద్రమత్తు కారణంగా కారు అదుపు తప్పి రోడ్డు పక్కకు బోల్తా కొట్టింది. కారు నుజ్జునుజ్జయింది. ప్రమాదాన్ని గమనించిన స్థానికులు, కారులో ఉన్నవారిని నగరంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం వారి ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని, ప్రాణాపాయం లేదని వైద్యులు తెలిపారు. చికిత్స పొందుతున్న నగేశ్‌ను ఆర్డీవో కే శ్రీనివాసరావు, రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు కిరణ్ కుమార్, ఇతర సంఘ నాయకులు, రెవెన్యూ సిబ్బంది, ఇతర అధికారులు పరామర్శించారు.



పాలకవర్గ సభ్యులకు చెక్కును అందజేస్తున్న దాతలు

నూతన భవన సముదాయానికి రూ.5 లక్షల విరాళం

గుంటూరు(తూర్పు), నవంబరు 14(ఆంధ్రజ్యోతి): స్థానిక జేకేసీ కళాశాల రోడ్డులో కమ్మ జన సేవా సమితి ఆధ్వర్యంలో నూతనంగా నిర్మిస్తున్న వసతి భవన సముదాయంలో ఒక గది నిర్మాణానికి అయ్యే ఖర్చు రూ.5 లక్షలను నగరానికి చెందిన వేములపల్లి పద్మావతి, పావెల్ విరాళంగా ప్రకటించారు. స్థానిక బృందావన్‌గార్డెన్స్‌లోని కమ్మ బాలికల వసతి గృహంలో గురువారం కేజేఎస్ ఎస్ సంయుక్త కార్యదర్శి మర్రిపూడి సీతారామయ్య, గౌరవ సలహాదారు కన్నెగంటి బుచ్చయ్య చౌదరికి వారు చెక్కును అందజేశారు. బుచ్చయ్య మాట్లాడుతూ గతంలో కూడా పావెల్ రూ.6 లక్షల విరాళాన్ని అందజేసినట్టు గుర్తుచేశారు. నూతన భవన సముదాయానికి మరోసారి విరాళం అందజేయడం అభినందనీయమని కొని యాడారు. కార్యక్రమంలో పాలకవర్గ సభ్యులు మైనేని సీతారామయ్య పాల్గొన్నారు.

సంతృప్తి చెందేలా రెవెన్యూ ఫిర్యాదులు పరిష్కరించాలి

● రెవెన్యూ అధికారుల జిల్లా స్థాయి సమావేశంలో కలెక్టర్ ఎస్ నాగలక్ష్మి

గుంటూరు, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో రెవెన్యూ శాఖకు సంబంధించి అందే ఫిర్యాదులు ప్రజల సంతృప్తి చెందేలా అధికారులు బాధ్యతగా పరిష్కరించాలని కలెక్టర్ ఎస్ నాగలక్ష్మి ఆదేశించారు. కలెక్టరేట్‌లోని ఎస్ఆర్ శంకరన్ మిని సమావేశ మందిరంలో గురువారం రెవెన్యూ అధికారుల జిల్లా స్థాయి సమావేశం జరిగింది. ఉదయం రెవెన్యూ అంశాలపై తహశీల్దార్లు, సర్వేయర్లతో, సాయంత్రం రెవెన్యూ, పోలీస్ సమన్వయ అంశాలపై తహశీల్దార్లు, పోలీస్ అధికారులతో కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. రెవెన్యూకు సంబంధించిర ఫిర్యాదుల పరిష్కారం, ఏపీ సేవా సర్వీసులు, ఎల్పీఎంలు, రీసర్వే, ల్యాండ్ కన్వర్షన్, భూ సేకరణ, కోర్టులు, కమిషన్‌లలో నమోదైన కేసులు తది తర అంశాలపై మండలాలు వారీగా తహశీల్దార్లు, సర్వేయర్లతో కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రెవెన్యూ శాఖ ప్రధాన విధులైన భూ సంబంధిత, సర్టిఫికెట్ల జారీ సేవలలో జాప్యం లేకుండా సత్వరమే పరిష్కరించాలన్నారు. జిల్లాలో రెవెన్యూ శాఖ పని తీరు మరింత మెరుగుపర్చేందుకు ప్రతి నెలా రెవెన్యూ అధికారుల సదస్సు నిర్వహించి సమీక్షిస్తామన్నారు. గుంటూరు జిల్లా రాజధాని ప్రాంతంలో ఉండటంతో భూముల విలువ ఎక్కువ ఉన్నందున ప్రభుత్వ ప్రాజెక్టులకు అవసరమైన భూముల సేకరణకు అత్యధిక ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. రెవెన్యూలో కొంతమంది చేస్తున్న తప్పుల వలన శాఖ మొత్తానికే చెడ్డ పేరు వచ్చే అవకాశం ఉన్నందున తహ శీల్దార్లు కింది స్థాయి ఉద్యోగుల పనితీరును నిరంతరం పర్యవేక్షించాలన్నారు. పీజీఆర్ఎస్‌లో ఫిర్యాదులు, ఏపీ సేవలో రెవెన్యూసేవలకు సంబంధించిన ధృవీకరణపత్రాల జారీ గురించి ప్రస్తావించారు. రీ సర్వే పూర్తయిన గ్రామాల్లో అభ్యంతరాలను పూర్తి స్థాయిలో పరిశీలించి నవంబరు చివరి నాటికి పూర్తి చేయాలని, హద్దురాళ్ళపై పేర్లను చెరిపేసే పనులు డిసెంబరు నాటికి పూర్తయ్యేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. జిల్లాలో ఇళ్ళ స్థలాలకు సేకరించిన భూములపై వివరాలను సమర్పించాలని, ల్యాండ్ కన్వర్షన్‌కు సంబంధించి పెండింగ్ దరఖాస్తులను పరిష్కరించాలని, గతంలో వివిధ శాఖలకు కేటాయించిన భూములు కేటాయించినా ఇప్పటికీ వినియోగించకపోతే వాటి వివరాలు సేకరించి మండల స్థాయి ల్యాండ్ బ్యాంక్ ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని, జిల్లాలో 2019 నుంచి 2024 వరకు కేటాయించిన భూములపై వివరాలు అందించాలని తెలిపారు. జిల్లాలో విలేజ్ హెల్త్ క్లినిక్ ఏర్పాటుకు అవసరమైన భూములను నవంబరు చివరి నాటికి గుర్తించి వివరాలు అందించాలన్నారు. అనంతరం సంయుక్త కలెక్టర్ ఏ భార్గవ తేజ మాట్లాడారు. సమావేశంలో తెనాలి సబ్ కలెక్టర్ సంజనా సిన్హా, అసిస్టెంట్ కలెక్టర్ పవార్ స్వప్నిల్ జగన్నాథ్, జిల్లా రెవెన్యూ అధికారి ఖాజావలి, అడిషనల్ ఎస్పీ రమణమూర్తి, కేఆర్సీ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ గంగరాజు, ఆర్డీవో శ్రీనివాసులు, డీఎస్పీలు అజీజ్, సీతారామయ్య, మురళీకృష్ణ, భార్గవి, టీ మల్లికార్జునరావు, సర్వే ఏడీ పవన్ కుమార్ పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న కలెక్టర్, జేసీ, తెనాలి సబ్ కలెక్టర్ తదితరులు

పోలీస్‌స్టేషన్లలో ఎస్పీ అర్ధరాత్రి ఆకస్మిక తనిఖీలు



అరండల్‌పేట పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసేందుకు వచ్చిన మహిళతో మాట్లాడుతున్న ఎస్పీ

గుంటూరు, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి) : అర్ధరాత్రి సమయంలో పోలీస్ స్టేషన్లలో ఏమి జరుగుతోంది, లాకప్‌లలో ఎవరైనా ఉన్నారా? లాకప్‌లు ఎలా ఉన్నాయి? అనే ప్రశ్నలకు ఎస్‌హెచ్‌ఓలను అడిగి జవాబులు తెలుసుకోవడం కంటే స్వయంగా పరిశీలించి తెలుసుకోవాలనుకున్న ఎస్పీ సతీష్‌కుమార్ బుధవారం అర్ధరాత్రి దాటిన తరువాత నగ రంలోని పోలీస్ స్టేషన్లను ఆకస్మిక తనిఖీ చేశారు. స్థానిక అరం డల్‌పేట పోలీస్ స్టేషన్‌లో అర్ధరాత్రి సమయంలో రౌడీషీటర్ బోరుగడ్డ అనిల్‌కు రాచమర్యాదలు జరిగినట్లు సీసీటీవీ ఫుటేజ్‌లు వెలుగుచూసిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఎస్పీ సతీష్‌కుమార్ నగరంపాలెం, అరండల్‌పేట, పట్టాభిపురం, లాలాపేట పోలీస్ స్టేషన్లలో ఆకస్మిక తనిఖీలు చేశారు. పోలీస్ స్టేషన్లలో సెంట్రీ కానిస్టేబుళ్ల పని తీరును, వారు బాధితులతో ప్రవర్తించే విధానాన్ని స్వయంగా పరిశీలించారు. తమ వారు తప్పిపోయారని అరండల్ పేట పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసేందుకు వచ్చిన ఓ మహిళతో ఎస్పీ మాట్లాడారు. త్వరితగతిన ఆ సమస్యను పరిష్కరించాలని ఆదేశించారు. ఆయా తనిఖీల్లో ఎస్పీతో పాటు జిల్లా అదనపు ఎస్పీ(ఏఆర్) హనుమంతు, లాలాపేట సీఐ శివప్రసాద్ పాల్గొన్నారు.

జీజీహెచ్‌లో ఇద్దరు రోగులకు అరుదైన చికిత్స



రోగులతో రమణ యశస్వి, కవిత, నాగూర్‌బాషా

గుంటూరు మెడికల్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): గుంటూరు ప్రభుత్వ సమగ్రాస్పత్రిలోని జీర్ణకోశవ్యాధుల వైద్యవిభాగంలో ఇద్దరు రోగులకు అరుదైన చికిత్సలు చేసి వారు అనారోగ్యం నుంచి కోలుకునేలా చేసిన గ్యాస్ట్రో ఎంట్రాలజీ వైద్యులను సూపరింటెండెంట్ డాక్టర్ రమణ యశస్వి గురువారం అభినందించారు. వివరాల్లోకి వెడితే... స్థానిక ప్రకాష్ నగర్‌కు చెందిన వెంకటేశ్వర్లు (38)కు ఇటీవల దెబ్బతిన్న క్లోమ గ్రంధిని వైద్యులు తొలగించారు. ఆ తర్వాత కూడా క్లోమ గ్రంధి నుంచి లీక్ వస్తున్నట్లు పరీ క్షల్లో తేలింది. ఈ నెల 2న జీజీహెచ్‌లో చేరిన బాధితుడిని గ్యాస్ట్రో ఎంట్రాలజీ ప్రొఫెసర్ డాక్టర్ ఏ కవిత, అసిస్టెంట్ ప్రొఫెసర్లు డాక్టర్ నాగూర్ బాషాలు పరీక్షించారు. అనంతరం ఈఆర్‌సీపీ పద్ధతిలో విజయవంతంగా రోగికి స్టెంట్ వేశారు. ఈ శస్త్రచికిత్సను ఎన్టీఆర్ వైద్య సేవ ద్వారా ఉచితంగా చేశారు. వెంక టేశ్వర్లు కోలుకోవడంతో ఈ నెల 12న ఆసుపత్రి నుంచి డిశ్చార్జి చేశారు. మరో కేసులో చేబ్రోలు మండలం శ్రీరంగపురానికి చెందిన మల్లీశ్వరి (47) చిన్న పేగులో రక్తస్రావం కావడంతో జీజీహెచ్‌లో చేరారు. ఈ నెల 7న జిల్లాలో మొదటిసారిగా చిన్న పేగు జబ్బులను గుర్తించే ఎండోస్కోపీ పరికరంతో గుర్తించి సర్జరీతో సరిచేశారు.

నూతన ఆర్‌ఓబీ నిర్మాణానికి సహకరించండి

● తగిన నష్టపరిహారం చెల్లిస్తాం ● జీఎంసీ కమిషనర్

గుంటూరు కార్పొరేషన్, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): గుంటూరు నగరవాసుల ట్రాఫిక్ సమస్య పరిష్కారం కోసం ఎన్నో ఏళ్ల నుండి ఎదురు చూస్తున్న శంకర్ విలాస్ వద్ద నూతన ఆర్‌ఓబీ నిర్మాణం వలన నష్టం కలిగే ప్రతి ఒక్కరికీ తగిన నష్టపరిహారం అందిస్తామని జీఎంసీ కమిషనర్ పులి శ్రీనివాసులు కోరారు. నగరపాలక సంస్థ కౌన్సిల్ సమావేశ మందిరంలో ప్రతిపాదిత శంకర్ విలాస్ ఆర్‌ఓబీ నిర్మాణ ప్రభావిత ప్రైవేట్ భవన యజమానులు, ప్రభుత్వ శాఖల భవనాల అధికారులతో వేర్వేగా కమిషనర్, ఆర్ అండ్ బీ అధికారులు గురువారం సమావేశం ఏర్పాటు చేశారు.ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ఫిబ్రవరి చివరికి రోడ్డు విస్తరణ పనులు పూర్తి చేసి, నూతన ఆర్‌ఓబీ నిర్మాణ స్థలాన్ని ఆర్‌అండ్‌బీకి అప్పగించాలన్న సూచన మేరకు ఈ సమావేశం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ప్రస్తుతం ఉన్న బ్రిడ్జి స్థానంలో 71 అడుగుల వెడల్పుతో 4 లైన్ల బ్రిడ్జి, డివైడర్, ఫుట్‌పాత్‌లతో నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం అయ్యాయని, హిందూ కాలేజ్ జంక్షన్ నుండి లాడ్జి సెంటర్ వరకు 1.6 కిలోమీటర్ల పొడవులో ప్రస్తుతం 85 అడుగుల నుండి 105 అడుగుల వరకు ఉన్న రోడ్డును మాస్టర్ ప్లాన్ ప్రకారం 120 అడుగులకు రోడ్డు విస్తరణ చేయాలని చెప్పారు. 19 ప్రభుత్వ, 99 ప్రైవేట్, 14 మిషనరీల, 2 ప్రార్థనా మందిరాలు ప్రభావితమవుతాయని తెలిపారు. ఆర్‌ఓబీ నిర్మాణం వలన నష్టపోతున్న భవనాలకు ప్రభుత్వ మార్గదర్శకాల మేరకు అమల్లో ఉన్న నిబంధనల ప్రకారం స్థలాలకు టీడీఆర్‌లు, భవనాలకు, ప్రభుత్వ, మిషనరీల భవనాలకు, ప్రార్థనా మందిరాలకు నష్టపరిహారం ఇస్తామని చెప్పారు. కనుక ప్రభావిత భవన యజ మానులు రోడ్డు విస్తరణకు సహకరించాలని కోరారు. అనంతరం భవన యజమానులు చేసిన సూచనలు, ప్రతిపాదనలు, అభ్యంతరాలను తీసుకొని, వాటిని రికార్డ్ చేసి, తదుపరి ఉన్నతస్థాయి సమావేశంలో చర్చిస్తామని తెలిపారు. జీఎంసీ ప్రకటించిన నష్టపరిహారానికి సంతృప్తి చెందిన లాల్ వజీర్ అనే భవన యజమాని బ్రిడ్జి నిర్మాణం వలన తాను కోల్పోనున్న స్థలానికి అంగీకారపత్రాన్ని ఈ సమావేశంలోనే కమిషనర్‌కి అందిం చారు. సమావేశంలో సిటీ ప్లానర్ రాంబాబు, డీసీపీ సూరజ్ కుమార్, ఏసీఈ అబ్దుల్ రెహ్మాన్, ఆర్‌అండ్‌బీ డీఈఈ చిన్నయ్య, ట్రాఫిక్, బీఎస్ఎన్ఎల్, పోస్టల్, సీపీడీసీఎల్, లేపాక్షి, జీజీహెచ్, ఉమెన్స్ కాలేజి, పోలీసు అధికారులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలి



సుగాలి కాలనీ వద్ద పరిశీలన చేస్తున్న కమిషనర్ పులి శ్రీనివాసులు

నగరపాలక సంస్థ పరిధిలో చేపట్టే అభివృద్ధి పనులు నాణ్యతా ప్రమాణాలు పాటిం చేలా ఇంజనీరింగ్ అధికారులు పర్యవేక్షించాలని జీఎంసీ కమిషనర్ ఆదేశించారు. చేపట్టిన పనులు నిర్దేశిత గడువుకు ముందే డ్యామేజీ జరిగి సంబంధిత కాంట్రాక్టర్, పర్యవేక్షణ చేసిన ఇంజినీరింగ్ అధికారులే బాధ్యత వహించాలని స్పష్టం చేశారు. స్థానిక స్తంభాల గరువు రిజర్వాయర్, ఎస్వీఎన్ కాలనీ పార్క్, జేకేసీ రోడ్డులోని పైప్ లైన్ వర్క్, నవభారత్ 3వ లైన్ లో సీసీ రోడ్డు, వికాస్‌నగర్, సుగాలి కాలనీలో సీసీ రోడ్లను ఇంజినీరింగ్, ప్రజారోగ్య అధికారులతో కలిసి గురువారం ఆయన పరిశీలించారు. సుగాలీకాలనీ, వికాస్‌నగర్ 1వ లైన్‌లో సీసీ రోడ్లను నాణ్యత లేకుండా నిర్మించారని, సదరు కాంట్రాక్టర్‌కి బిల్లుల చెల్లింపు నిలిపివేయాలని ఆదే శించారు. అనంతరం సుగాలీకాలనీ నుండి ద్వారకా నగర్ ద్వారా అమరావతి రోడ్డు మేజర్ డ్రెయిన్‌లోకి వచ్చే అవుట్ ఫాల్ డ్రెయిన్‌ని పరిశీలించి తగుఆదేశాలు జారీ చేశారు.

కార్మికులు, ఉద్యోగులకు ఉచిత డయాబెటిక్ స్క్రీనింగ్

వరల్డ్ డయాబెటిక్ డే సందర్భంగా సిటి డయాబెటిస్ ఫెడరేషన్, గుంటూరు నగరపాలక సంస్థ కార్మికులు, ఉద్యోగులకు ఉచితంగా డయాబెటిక్ స్క్రీనింగ్ చేపట్టడం అభినందనీయమని జీఎంసీ కమిషనర్ అన్నారు. జీఎంసీ ప్రధాన కార్యాలయంలో జీఎంసీ కార్మికులు, ఉద్యోగులకు గురువారం ఉచిత డయాబెటిక్ స్క్రీనింగ్ పరీక్షల క్యాంప్ ఏర్పాటు చేశారు. క్యాంప్‌ని ప్రారంభించిన కమిషనర్ మాట్లాడారు. కార్యక్రమంలో జీఎంసీ సీఎంఓహెచ్ డాక్టర్ శోభారాణి, ఎంహెచ్‌ఓ డాక్టర్ రవిబాబు పాల్గొనారు.

బైక్ రేసర్ల ఆట కట్టించండి: ఎమ్మెల్యే మాధవి

గుంటూరు, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): నగరంలోని రోడ్లపై కొంతమంది పోకిరీలు తమ ఇష్టానుసారం బైక్ రేసులకు పాల్పడుతూ ప్రజలను గాయపరుస్తున్నారని, అలాంటి వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని గుంటూరు పశ్చిమ ఎమ్మెల్యే గళ్లా మాధవి పోలీసు అధికారులను కోరారు. శాసన సభ సమావేశాల్లో వున్న ఆమె రేసింగ్ విషయం తెలిసిన వెంటనే అధికారులతో ఫోన్‌లో మాట్లాడారు. నియోజకవర్గంలో పలు చోట్ల బైక్ రేసింగులు జరుగుతున్నట్లు తన దృష్టికి వచ్చిందని, వారి వల్ల సాధారణ ప్రజలు గాయాల పాలవుతున్నారని, వారిపై ఉక్కుపాదం మోపాలని పోలీసు అధికారులను ఆదేశించారు.

నిందితుడితో రాజీ చేసుకోమంటున్న పోలీసులు

● బైక్ రేసింగ్ ప్రమాదంలో గాయపడ్డ విద్యార్థి తండ్రి ఆరోపణ



చికిత్స పొందుతున్న బీటెక్ విద్యార్థి పవన్

గుంటూరు, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి) : స్థానిక వెస్ట్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధి లోని రింగ్ రోడ్ లోని నవభారత్ నగర్ మెయిన్ రోడ్డు పై ఈ నెల 9న రాత్రి జరిగిన బైక్ రేసింగ్ ప్రమాదం ఘటనలో నిందితుడితో రాజీ చేసుకోవాలని పోలీసులు చెబుతున్నారని బాధిత విద్యార్థి బెల్లం నర్సు పవన్ తండ్రి ఆరోపించారు. పవన్ ఫిర్యాదు మేరకు వెస్ట్ ట్రాఫిక్ పోలీసులు కేసు నమోదు చేసినప్పటికీ నిందితుడిని పోలీసులు వదిలి వేశారని విద్యార్థి తండ్రి వాపోయారు. తన కుమారుడు అదృష్టవశాత్తు బతికి బయటపడ్డాడని, తొంటి ఆపరేషన్ చేయడానికి గంటల సమయం పట్టిందన్నారు. తన కుమా రుడి లాగే మరొకరికి జరగకూడదనే ఉద్దేశంతోనే నింది తుడిపై చర్యలు తీసు కోవాలని కోరుతుంటే ఒత్తిళ్ల కారణంగా పోలీసులు పట్టించుకోవడం లేదని అన్నారు. కాగా, ఈ ఘటనలో విజయవాడకు చెందిన డెంటల్ విద్యార్థి ఖలీఫా రేసు బైక్ పై మితిమీరిన వేగంతో కొరిటెపాడు వైపు వెళుతుండగా నవ భారత్‌నగర్ మెయిన్ రోడ్డు వద్ద స్కూటీ యాక్టివాను ఢీ కొట్టడంతో పవన్ పక్కటెముక విరగగా, అదేవాహనంపై ఉన్న మరో విద్యార్థి కౌశిక్‌కు స్వల్ప గాయాలయ్యాయి.

మధుమేహ వ్యాధిని తరిమికొడదాం



డయాబెటిస్ వాక్‌లో దేగల ప్రభాకర్, విజయలక్ష్మి

గుంటూరు మెడికల్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): మధుమేహ మహమ్మారిని తరిమికొట్టేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఆంధ్రప్రదేశ్ పరిశ్రమల అభివృద్ధి సంస్థ (ఏపీ ఐడీసీఎల్) ఛైర్మన్ డేగల ప్రభాకర్ తెలిపారు. వరల్డ్ డయాబెటిస్ డే సందర్భంగా జిల్లా ల్యాబ్స్ అండ్ ఎక్స్‌రే ఓనర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో స్థానిక బృందావన్ గార్డెన్స్‌లోని ఎన్టీఆర్ స్టేడియంలో గురువారం నిర్వహించిన డయాబెటిస్ వాక్‌లో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ప్రభాకర్ మాట్లాడుతూ మధుమేహ వ్యాధిపై ప్రజల్లో అవగాహన కల్పిం చేందుకు ర్యాలీలు, వాక్‌లు నిర్వహించడం అభినందనీయమన్నారు. షుగర్ నివారణ కోసం యోగా, వ్యాయామం, నడక వంటివి చేయాలని ఆయన సూచించారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ కే విజయలక్ష్మి మాట్లాడుతూ ఆరోగ్యకరమైన జీవనశైలితో మధుమేహం నుంచి రక్షణ పొందవచ్చని తెలిపారు. కార్యక్రమంలో ల్యాబ్స్ ఎక్స్‌రే ఓనర్స్ అసోసియేషన్ నాయకులు పాల్గొన్నారు.

కష్టపడి పనిచేస్తే తగిన గుర్తింపు



గంగాధర్‌ను సన్మానిస్తున్న శివరామయ్య, వేములకొండ

గుంటూరు, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీలో కష్టపడి పనిచేసేవారికి తప్పకుండా గుర్తింపు వుంటుందని తెలుగుదేశం పార్టీ జిల్లా కార్యాలయ కార్యదర్శి కంచర్ల శివరామయ్య, బీసీ విభాగం జిల్లా అధ్యక్షుడు వేములకొండ శ్రీనివాస్ అన్నారు. ఇటీవల రాష్ట్ర నాయిబ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్‌గా నియమితుడైన మద్దిరాల గంగాధర్‌ను గురువారం ఆయన సన్మానించారు. శివరామయ్య మాట్లాడుతూ గంగాధర్ విద్యార్థి దశ నుంచే రాజకీయాల్లో వున్నారని, రాష్ట్ర స్థాయి వరకూ అంచెలంచెలుగా ఎదిగారని తెలిపారు. వేములకొండ శ్రీనివాస్ మాట్లాడుతూ బీసీ విభాగం జిల్లా పరిశీలకుడిగా వున్న గంగాధర్ పార్టీ కార్యకలాపాల్లో చురుకుగా పాల్గొని, పార్టీ బలోపేతంలో భాగస్వాములయ్యారని అన్నారు. కార్యక్రమంలో బొబ్బిలి రామారావు, పాటిబండ్ల బలరాం, బెల్లంకొండ సురేశ్, హుస్సేన్; చిన్నబాజీ, సతీశ్; సాంబశివరావు, గణపతి, పున్నారావు, మురళి, మాణిక్యం తదితరులు పాల్గొన్నారు.

బహిరంగ ప్రకటన

నా క్లయింటు అయిన గుంటూరుసిటీ, కన్నావారితోట, మెడికల్‌కాలేజ్‌రోడ్డు, రైల్వే కోర్టర్స్ నెం.236/1 కాపురస్తులు తప్పెరు వెంకటేశ్వర్లుగారి కుమారుడు బ్రహ్మానాయుడుగారి సంజాయిషీ పొంది యావన్మందికీ తెలియజేయునది ఏమనగా దిగువ షెడ్యూలు ఆస్తి ది.19-03-1931న దాసరి అదిశేషు గారికి విక్రయ ద.నెం.496/1931 గా ది.24-03-1931న రిజిష్టరు కాబడిన విక్రయ దస్తావేజు రీత్యాను మరియు ది.27-07-1931న దాసరి శ్రీహరి మైనరైనందున గార్డియన్ తల్లి అదిశేషుగార్ల పేరుతో విక్రయ ద.నెం. 1530/1931 ది.31-07-1931న రిజిష్టర్ కాబడిన విక్రయ దస్తావేజుల రీత్యా వారిరువురికీ సంక్రమించినదని సదరు దాసరి అదిశేషుగారు మరణించిన దరిమిలా వారి ఏకైక సంతతి వారసురాలు అయిన దాసరి శ్రీహరి @హరిరాజమ్మగారికి సంక్రమించినదని ఆ తదాది ఆమె నిరాటంకంగా సదరు ఆస్తిని అనుభవించుచూ తన జేష్ఠ కుమార్తె అయిన దాసరి రాజకుమారికి ద.నెం.1946/1965గా కొంత ఆస్తిని రిజిష్టర్ చేసిఇవ్వగా మిగిలిన ఆస్తిని లేటు చదలవాడ కుమారరావు గారి భార్య శ్రీహరి@హరిరాజమ్మగారు అనుభవించుచూ, తన తృతీయ కుమార్తె అయిన గుంటూరుజిల్లా, వినుకొండ, కొత్తపేట కాపురస్తులు సారంగం లోకనాథంగారి భార్య బేబీ సరోజిని @ బేబి సరోజినినాథ్ గారికి ది.10-07-2003న దఖలు దస్తావేజు నెం.6437/2003గా రిజిష్టర్ చేసిన దరిమిలా సదరు ఆస్తి బేబీ సరోజిని @ బేబి సరోజిని నాథ్ గారికి సంక్రమించి ఆ తదాది ఆమె స్వాధీన హక్కు భుక్తములో అనుభవించుచూ మరణించిన దరిమిలా ఆమె ఏకైక వారసురాలైన యస్. సురేష్‌కుమార్ గారి భార్య యస్.వెంకట పద్మబిందు గారికి సంక్రమించినదని, ఆమె మాత్రమే హక్కుదారురాలిని అని తెలుపుచూ దిగువ షెడ్యూలు ఆస్తిని అమ్ముటకు బహిరంగపరచగా నాక్లయింటు కొనుగోలు చేయుటకు సిద్ధపడి విక్రయ ఖరారుపడి కొంత క్రయ ధనమును చెల్లించియున్నారు. కావున దిగువ షెడ్యూలు దాఖలా ఆస్తిపై గాని మరియు దాసరి అదిశేషు, బేబీ సరోజిని @ బేబి సరోజిని నాథ్ గార్ల వారసత్వంపై గాని ఎవరికైనా ఏవిధమైన అభ్యంతరములు ఆక్షేపణలు, ఇతర క్లయిములు వగైరాలు ఉన్నయెడల ఈ ప్రకటన తేది నుండి 7 రోజులలోగా నాకు గాని, నాక్లయింటుకు గాని వ్రాతపూర్వకమైన అధారాలతో లిఖితపూర్వకముగా తెలియజేయగలరు. గడువు లోగా షెడ్యూలు ఆస్తిపై గాని, అదిశేషు గారి వారసత్వంపై గాని ఎటువంటి క్లయిములు రానియెడల షెడ్యూలు ఆస్తి నిష్పేచి ఆస్తిగా భావించి నాక్లయింటు సదరు యస్.వెంకట పద్మబిందు గారి నుండి సక్రమమైన విక్రయ దస్తావేజును పొందగలరని గడువు తరువాత వచ్చే ఎట్టి ఆక్షేపణలు, క్లయిములు షెడ్యూలు ఆస్తిని గాని, నా క్లయింటు హక్కులను గాని బైండుచేయజాలవు.

షెడ్యూలు:గుంటూరు డి॥సబ్.డి॥, గుంటూరు మున్సిపల్ కార్పోరేషన్ ఏరియాలో చేరిన గుంటూరు సిటీ, కన్నవారి తోట ఏరియా మున్సిపల్ పాత వార్డు నెం.17రు, కొత్త వార్డు నెం.21రు బ్లాకు నెం.5రు మున్సిపల్ సర్వే నెం.135రు విస్తీర్ణం 12662 చ.అ లు మింజుమలె మున్సిపల్ డోరు నెం.27-6-35రు మున్సిపల్ ఆస్తి పన్ను అసెస్మెంటు నెం.4082220-01,02 చ.గ.210లు స్థలము గల ఆస్తికి హద్దులు. తూర్పు:నందన హాస్పిటల్ గోడ వెంబడి ఈ దఖలు ఆస్తికి చెందిన గోడ కొంత స్థలం హద్దు,49-8లు, దక్షిణం:చదలవాడ రామకృష్ణ వాకీ క్రింద దఖలు పరచిన ఆస్తి హద్దు, అ.37-10లు,పడమర:కుర్నాపు అదిలక్ష్మీకి దఖలు పరచిన ఆస్తి హద్దు, అ.50-2.1/2లు.ఉత్తరం:కన్నవారి తోట 5/1వ అడ్డరోడ్ మున్సిపల్ రోడ్ హద్దు.అ.37-11లు.

నరాలశెట్టి శ్రీనివాసరావు, న్యాయవాది
అంకమ్మనగర్, 3వ లైను, గుంటూరు, 8464962960, 8309369942


విద్యాసంస్థల్లో ఘనంగా బాలల దినోత్సవం



మాట్లాడుతున్న కిరణ్ ప్రభ

గుంటూరు(విద్య),నవంబరు 14(ఆంధ్రజ్యోతి): ప్రముఖ వ్యక్తుల జీవితాల్లోని ఎత్తుపల్లాలను బాగా రీసెర్చ్ చేసిన తర్వాతే టాక్ షోలో వారి గురించి చెప్తానని శ్రీ కౌముది వెబ్ మ్యాగజైన్ ఫౌండర్ అండ్ ఎడిటర్ కిరణ్ ప్రభ అన్నారు. చేబ్రోలు మండలం వడ్లమూడి విజ్ఞాన్ యూనివర్సిటీలోని ఎన్టీఆర్ విజ్ఞాన్ లైబ్రరీ, డిపార్ట్‌మెంట్ ఆఫ్ సోషల్ సైన్స్ అండ్ హ్యూమానిటీస్, స్టూడెంట్ అఫైర్స్ విభాగాల ఆధ్వర్యంలో 57వ నేషనల్ లైబ్రరీ వారోత్సవాలను గురువారం ఆయన ఘనంగా ప్రారంభించారు. ముందుగా 'కౌముది కిరణాలు' పుస్తకాన్ని ఆవిష్కరించారు. ముఖ్య అతిథిగా హాజరైన కిరణ్ ప్రభ మాట్లాడుతూ ఇప్పటివరకు దాదాపు 1350 టాక్ షోలు నిర్వహించానని, అందులో భాగంగా దాదాపు 700 మంది ప్రముఖ వ్యక్తుల బయోగ్రఫీలను శ్రోతలతో పంచుకున్నానని తెలిపారు. విజ్ఞాన్స్ విద్యా సంస్థల ఛైర్మన్ డాక్టర్ లావు రత్తయ్య మాట్లాడుతూ గొప్ప వ్యక్తుల బయోగ్రఫీలను విశ్లేషించి అర్థమయ్యేలా విశ్లేషించి చెప్పగలిగిన ఘనత ఆయనకే దక్కిందన్నారు. కిరణ్ ప్రభ భార్య కాంతి కిరణ్, వైస్ చాన్సలర్ కల్నల్ ప్రొఫెసర్ పీ నాగ భూషణ్, రిజిస్ట్రార్ డాక్టర్ ఎమ్మెస్ రఘునాథన్, మాజీ డీజీపీ మాలకొండయ్య, ఎస్వీఎస్ లక్ష్మీనారాయణ, పెద్ది సాంబశివరావు పాల్గొన్నారు.

ఉన్నత లక్ష్యాలే బంగారు భవితకు సోపానాలు: డాక్టర్ లావు రత్తయ్య



పోటీల్లో పాల్గొని బహుమతులు సాధించిన విద్యార్థులు

స్థానిక ఎల్ఐసి కాలనీలోని విజ్ఞాన్ స్కూల్‌లో బాలల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన సంస్థల ఛైర్మన్ డాక్టర్ లావు రత్తయ్య మాట్లాడుతూ ఉన్నత లక్ష్యాలే బంగారు భవిష్యత్‌కు సోపానాలని పేర్కొన్నారు. విద్యార్థులు ప్రాథమిక స్థాయి నుంచే లక్ష్యాలను నిర్దేశించుకోవాలని సూచించారు.

భాష్యం విద్యా సంస్థల్లో..



నెహ్రూ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న విద్యార్థులు

స్థానిక చంద్రమౌళినగర్‌లోని భాష్యం మెయిన్ క్యాంపస్, ఆర్టీసి కాలనీ, సాంబశివ పేట, ఎస్వీఎన్‌కాలనీ, నగరాలు, పట్టాభిపురంలోని విద్యాసంస్థల్లో బాలల దినోత్సం నిర్వహించారు. చాచా నెహ్రూ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు.

కన్నా స్కూల్‌లో..



వేడుకల్లో పాల్గొన్న విద్యార్థులు

స్థానిక రైలుపేటలోని కన్నా స్కూల్‌లో బాలల దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. కన్నా స్కూల్ డైరెక్టర్ కన్నా మాస్టారు మాట్లాడుతూ పండిట్ నెహ్రూ జయంతిని బాలల దినోత్సవంగా నిర్వహిస్తారని తెలిపారు. విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

ఏసీఎంఈ స్కూల్‌లో..

స్థానిక పొత్తూరులోని ఏసీఎంఈ స్కూల్‌లో బాలల దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో డైరెక్టర్ దీపి నందమూరి,సౌగంధ్ నందమూరి పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థిని విద్యార్థులకు పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు.

శ్రీవికాస్ స్కూల్‌లో..



వేడుకల్లో చిన్నారులు

శ్రీవికాస్ స్కూల్‌లో బాలల దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి చిన్నారుల సాంస్కృతిక కార్యక్రమాలు అందరిని ఆకట్టుకున్నాయి. నెహ్రూ జయంతి సందర్భంగా డైరెక్టర్ దాసరి రాజా మాష్టారు పూలమాలలు వేసి నివాళులర్పించారు. సాంస్కృతిక కార్యక్రమాలు, ఆటల పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు.



విద్యార్థులతో డాక్టర్ కృష్ణప్రసాద్ తదితరులు

కేఎల్‌పీలో..

స్థానిక జెకెసి కళాశాల రోడ్డులోని డాక్టర్ కేఎల్‌పీ పాఠశాలలో బాలల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు వేషధారణలతో అలరించారు. పాఠశాల కార్యదర్శి డాక్టర్ కే కృష్ణప్రసాద్ మాట్లాడుతూ విద్యార్థులందరూ వారివారి నైపుణ్యాలను పెంపొందించుకోవాలని సూచించారు. వివిధ విభాగాలలో గెలుపొందిన విద్యార్థులు బహుమతుల అందజేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ రత్తయ్య తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీతకు సత్కారం

స్థానిక నల్లపాడులోని ఎంబీటీఎస్ ప్రభుత్వ పాలిటెక్నిక్‌లో సీనియర్ కంప్యూటర్ ఇంజనీరింగ్ అధ్యాపకురాలు పదముత్తం నీలిమ రాష్ట్ర ఉత్తమ అధ్యాపక అవార్డు స్వీకరించిన సందర్భంగా కళాశాలలో గురువారం సత్కరించారు. స్థానిక నగరంపాలెంలోని ప్రజ్ఞ పాఠశాలలో బాలలదినోత్సవం నిర్వహించారు.

బాలికోన్నత పాఠశాలలో..

స్థానిక వెంగళరావునగర్ బాలికోన్నత పాఠశాలలో బాలల దినోత్సవం నిర్వహించారు. గుంటూరు ఈస్ట్ ఎంఈఓ జ్యోతి కిరణ్, వాసవి క్లబ్ గుంటూరు ప్రెసిడెంట్ నగేష్ కుమార్ , వాసవి సభ్యులు పాల్గొన్నారు.

భారతీయ విద్యాభవన్‌లో..

విద్యార్థులు మహనీయులు ఆశయ సాధన కోసం కృషి చేయాలని, చదువును కష్టంగా కాకుండా ఇష్టంగా చదవాలని రైల్వే డీఆర్ఎం ఎం రామకృష్ణ విజ్ఞప్తిచేశారు. కలెక్టర్ బంగ్లా రోడ్డులోని భారతీయ విద్యాభవన్‌లో బాలల దినోత్సవ వేడుకల్లో ఆయన పాల్గొన్నారు.

సీతారామయ్య హైస్కూల్‌లో..

గుంటూరు కార్పొరేషన్, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): గుంటూరు లక్ష్మీపురం మెయిన్ రోడ్ లోని పాటిబండ్ల సీతారామయ్య హైస్కూల్లో బాలల దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల సెక్రెటరీ, కరస్పాండెంట్ విష్ణువర్ధన్ మాటాడారు. ఉపాధ్యాయులు ఆటపాటలతో హాస్య భరిత నాటికలతో ఆనందింప చేశారు. బుడంపాడులోని ప్రాడిజి విద్యాలయ్ (సీబీఎస్ఇ)లో జరిగిన బాలల దినోత్సవంలో గుంటూరు ఎక్సైజ్ శాఖ డిప్యూటీ కమిషనర్ డాక్టర్ కే శ్రీనివాసులు పాల్గొన్నారు.

సోషల్ మీడియా కార్యకర్తల అక్రమ కేసులపై అండగా వైసీపీ బృందాలు

● గుంటూరు జిల్లాకు విడదల రజనీ, డైమండ్‌బాబుకు బాధ్యతలు

గుంటూరు, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): వైసీపీ సోషల్ మీడియా కార్య కర్తలపై పోలీసుల కేసుల నేపథ్యంలో వైసీపీ కేడర్‌లో హా హా కారాలు మొద లయ్యాయి. పార్టీ శ్రేణులు, నాయకులు చేజారిపోతారన్న ఆందోళన ఆ పార్టీలో నెలకొంది. ఈ నేపథ్యంలో పార్టీ సోషల్ మీడియా కార్యకర్తలకు అండగా నిలిచేందుకు జిల్లాల వారీగా ప్రత్యేకంగా పార్టీ బృందాలను వైసీపీ అధినేత జగన్ నియమించినట్లు ఆ పార్టీ నేతలు తెలిపారు. ఉమ్మడి గుంటూరు జిల్లాలో వైసీపీ సోషల్ మీడియా కార్యకర్తలకు అండగా నిలిచేందుకు మాజీ మంత్రి విడదల రజని, డిప్యూటీ మేయర్ ఇటీవల తాడికొండ ఇన్‌చార్జిగా నియ మితులైన వనమా బాలవజ్రబాబు (డైమండ్ బాబు)ను నియమించారు. ఈ మేరకు గురు వారం రాత్రి ఆదేశాలు జారీ చేశారు.

డీసీఎమ్ఎస్‌లో ఘనంగా సహకార వారోత్సవాలు

గుంటూరు, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్ర సహకార మార్కెటింగ్ సొసైటీ ఆధ్వర్యంలో జిల్లా కోర్టు రోడ్డులోని కార్యాలయంలో గురువారం 71వ అఖిల భారత సహకార వారోత్సవాలు జరిగాయి. సహకార పతాకాన్ని ఆవిష్కరించారు.

నటశేఖరుడు

నటనకే నవ భాష్యం చెప్పిన

సినీ రంగంలో వినూత్న పోకడలకు శ్రీకారం చుట్టి, సాహసోపేత సినిమాల నిర్మాణంతో నటనకే కొత్త భాష్యం చెప్పిన నటశేఖరునికి ఆంధ్రా జేమ్స్‌బాండ్‌గా, గూఢచారిగా, దేశభక్తి నిండిన గొప్ప మనీషిగా అన్నిటికీమించి సూపర్ స్టార్‌గా అభిమానుల గుండెల్లో నిలిచిపోయారు. భువినుంచి నింగికేగి రెండేళ్లవుతున్నా అభిమానుల గుండెల్లో మాత్రం ఆయన పదిలంగానే ఉన్నారు. నేడు ఆయన రెండవ వర్ధంతి. రాష్ట్ర వ్యాప్తంగా అభిమానులు ఆయన వర్ధంతి కార్యక్రమాల నిర్వహణకు సిద్ధమవుతుంటే, ఇటు తెనాలి, ఆయన స్వగ్రామం బుర్రిపాలెంలోనూ పలు కార్యక్రమాలను జరిపేందుకు, ఆయన స్మరణతో పాత జ్ఞాపకాలను నెమరువేసుకుంటున్నారు. ఏ రంగంలోనూ గుర్తింపు లేని తన స్వగ్రామానికి ఆయనే ఒక ప్రపంచ స్థాయి గుర్తింపు తెచ్చారు. ఎంత ఎత్తు ఎదిగినా సొంత ఊరుని, కన్నవారిని మరువకూడదన్న నానుడిని నిజం చేశారు కృష్ణ. తాను సంపాదించిన దానిలో కొంత స్వగ్రామానికి కూడా ఖర్చు చేయడం ఇక్కడివారి ప్రేమాభిమానాలను పదిలపరిచింది.



నేడు సూపర్ స్టార్ కృష్ణ ద్వితీయ వర్ధంతి

బుర్రిపాలెంలో కృష్ణ జ్ఞాపకాలు పదిలం

ఆయన వర్ధంతి సందర్భంగా పలు కార్యక్రమాలు

తెనాలి, నవంబరు 14, (ఆంధ్రజ్యోతి): సూపర్ స్టార్ కృష్ణగా సుపరిచితులైన ఆయన అసలు పేరు ఘట్టమనేని శివరామకృష్ణమూర్తి. ఘట్టమనేని వీరరాఘవయ్య చౌదరి, నాగరత్నమ్మ దంపతులకు 1943, మే 31న ఆయన జన్మించారు. ఈ దంపతులకు మొత్తం ఐదుగురు సంతానం. వారిలో కృష్ణ పెద్ద కుమారుడు. హనుమంతరావు, ఆదిశేషగిరిరావు, లక్ష్మి, అలివేలు మంగమ్మలు ఆయన సోదర సోదరీమణులు. సాధారణ రైతు కుటుంబంలో పుట్టిన ఆయన పాఠశాల విద్యను తెనాలిలోని తాలూకా హైస్కూల్‌లో అభ్యసించారు. ఉన్నత చదువులు గుంటూరు, ఏలూరులోని సీఆర్ రెడ్డి కళాశాలలో పూర్తిచేశారు. సీఆర్‌రెడ్డి కళాశాలలో అక్కినేనికి జరిగిన సన్మానం, ఆదరణ చూసిన కృష్ణకు హీరో కావాలనే కోరిక కలగడం, తండ్రిని ఒప్పించి సినిమాల్లోకి వెళ్లడం జరిగిపోయాయి. అదే సమయంలో స్వగ్రామానికి దగ్గర్లోని కంచర్లపాలెం గ్రామానికి చెందిన కృష్ణ మేనమామ కుమార్తె ఇందిరాదేవిని వివాహం చేసుకున్నారు. దీంతో ఈ రెండు గ్రామాలతో ఆయనకు అవినాబావ సంబంధం ఏర్పడింది. ఈయనకు ఐదుగురు సంతానం. రమేష్‌బాబు, మహేష్‌బాబు ఇద్దరు మగపిల్లలయితే, పద్మజ, మంజుల, ప్రియదర్శిని ఆడపిల్లలు. అయితే కృష్ణ సినిమాల్లోకి వెళ్లాక తనతో సాక్షి సినిమాలో కలసి నటించిన విజయనిర్మలతో పరిచయం ఏర్పడి, 1969లోనే ఆమెను రెండో వివాహం చేసుకున్నారు.

బుర్రిపాలెం బుల్లోడుగా గుర్తింపు

నా జీవన బృందావనిలో ఆమని ఉదయంలో అంటూ బుర్రిపాలెం నుంచి మొదలైన సూపర్ స్టార్ కృష్ణ సినీ ప్రస్థానం బాలీవుడ్ వరకు సాగింది. ప్రపంచ దేశాల్లోనూ ఆయనకు అభిమానులు, అభిమాన సంఘాలున్నాయంటే తన వినూత్న పోకడలే దీనికి నిదర్శనం. 'బుర్రిపాలెం బుల్లివాడిని నేనే'నంటూ సొంత ఊరిలో చిత్రాలను తెరకెక్కించి, తనతో పాటే, పుట్టిన గడ్డకూ ఎనలేని గుర్తింపు తెచ్చిపెట్టారు. తేనె మనసులు సినిమాతో తెలుగు తెరపై హీరోగా కనిపించిన కృష్ణ తర్వాత అనేక వినూత్న చిత్రాలను నిర్మించి, నటించారు. అయితే ఎంత ఎదిగినా, తన స్వగ్రామాన్ని మర్చిపోకుండా, గ్రామంపై ప్రేమతో గ్రామీణ వాతావరణం ఎక్కువగా కనిపించే చిత్రాలలో నటించారు. తన స్వగ్రామం పేరుతో 'బుర్రిపాలెం బుల్లోడు' సినిమా కూడా తీశారు. దీనితోపాటే వీణ, ప్రజారాజ్యం పూర్తి సినిమాలు బుర్రిపాలెం చుట్టుపక్కల తీస్తే, పాడిపంటలు, రైతు భారతం, ఈనాడు, డాక్టర్ సినీ యాక్టర్ వంటి మరికొన్ని చిత్రాలు కొంత భాగం బుర్రిపాలెంలో చిత్రీకరించారు. ఆయన నటించిన గ్రామీణ వాతావరణం ఉండే ప్రతి సినిమాను తన స్వగ్రామంలో కొంతయినా షూటింగ్ జరిపించటం ఆయనకు ఈ ప్రాంతంపై ఉన్న ప్రేమకు నిదర్శనం.

సినీ రంగం నుంచి రాజకీయం వైపునకు అడుగులు

1964 వరకు స్టేజీ ప్రదర్శనల్లో ప్రతిభ చూపిన ఆయన ఆశలు సినీ రంగానికి నడిపించాయి. తండ్రితో తన ఆలోచన చెప్పడమే తడవుగా సినీ లోకంలోకి అడుగు పెట్టేశారు. 1964 ముందు వరకు చిన్నచిన్న పాత్రల్లో నటించిన కృష్ణకు ఆ తర్వాత వచ్చిన తేనెమనసులు సినిమా హీరోగా గుర్తింపు తెచ్చిపెట్టింది. తక్కువ సమయంలో 345కి పైగా చిత్రాలలో నటించి రికార్డు సృష్టిస్తే, తెలుగు నుంచి బాలీవుడ్ వరకు పయనం సాగించారు. సొంతగా రూపొందించిన సింహాసనం సినిమాను సింఘాసన్ పేరుతో



తల్లిదండ్రులు వీరరాఘవయ్య చౌదరి, నాగరత్నమ్మతో కృష్ణ

1986లో హిందీలో తీస్తే, 2001లో 'అమ్దాని ఆఠాణా ఖర్చ్ రూపాయా' పేరుతో హిందీ చిత్రాన్ని సమర్పించారు. 1982లోనే కన్నాడు కన్న అనే మరికొన్ని ఇతర భాషా చిత్రాలనూ తెరకెక్కించారు. 2016లో చివరి శ్రీశ్రీ సినిమాతో నటనకు సెలవు చెప్పారు. అయితే 2010 తర్వాత నటనకు విరామం చెప్పినా రెండు, మూడు సినిమాల్లో అతిథి పాత్రల్లో నటించారు. రోజుకు మూడు షిఫ్టుల్లో పని చేసి వేలాది మంది సినీ కార్మికులకు ఉపాధి కల్పించారు. 1964-1995 మధ్య కాలంలో ఏడాదికి సుమారు 10 సినిమాల చొప్పున కృష్ణ నటించారు. 1972వ సంవత్సరంలో అయితే ఏకంగా 18 చిత్రాలలో నటించారు. ఇది అప్పటి నుంచి ఇప్పటి వరకు ఒక రికార్డుగా మిగిలిపోయింది. ఆయన నటించిన 100వ చిత్రం అల్లూరి సీతారామరాజు ఒక ల్యాండ్ మార్క్‌గా నిలిచింది. ఆయన రాజకీయ రంగంలోనూ తనదైన ముద్ర వేసుకున్నారు కృష్ణ. 1984లో కాంగ్రెస్ పార్టీలో చేరిన ఆయన 1989లో ఆ పార్టీ తరపున ఏలూరు పార్లమెంటు స్థానానికి పోటీచేసి ఎంపీగా గెలిచారు. తొలిసారిగా పార్లమెంటులో అడుగుపెట్టారు. అప్పటి భారత ప్రధాని రాజీవ్‌గాంధీతో మంచి సంబంధాలుండేవి. రాజీవ్ గాంధీ మరణం, మరికొన్ని ఇతర కారణాలతో, ఆయన రాజకీయాల నుంచి తర్వాత తప్పుకున్నారు.

స్వగ్రామాన్ని దత్తత తీసుకుని...

తనకు జన్మనిచ్చిన ఊరును అభివృద్ధి పథంలో నిలపాలనే తపన, అక్కడి వారి రుణం తీర్చుకోవాలనే ఆలోచనతో తన స్వగ్రామాన్ని దత్తత తీసుకున్నారు. బుర్రిపాలెంలో అనేక అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. తన బాటలోనే తన కుమారుడు మహేష్‌బాబును కూడా నడిపించారు. తండ్రి స్ఫూర్తితోనే మహేష్‌బాబు ప్రస్తుతం బుర్రిపాలెం గ్రామాన్ని, తల్లి స్వగ్రామం కంచర్లపాలెంను దత్తత తీసుకుని అభివృద్ధి చేస్తున్నారు. గ్రామస్తులకు వైద్యసేవలు మాత్రం ప్రతినెలా అందించేందుకు కృషి చేస్తున్నారు. బస్ షెల్టర్‌లు, కమ్యూనిటీ భవనాలు, జిల్లా పరిషత్ పాఠశాలలో తల్లి నాగరత్నమ్మ జ్ఞాపకార్థం అదనపు గదుల సముదాయాన్ని, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం అందించేందుకు అవసరమైన కంప్యూటర్‌ల వంటివాటిని సమకూర్చారు. మహేష్‌బాబు షూటింగ్ హడావిడిలో ఉన్నా, ఆయన సతీమణి నమ్రత, సోదరి పద్మజలు మాత్రం వచ్చి అన్ని ఏర్పాట్లు పరిశీలించి వెళుతుంటారు. అయితే కృష్ణ వర్ధంతి సందర్భంగా గ్రామస్తులు, అభిమాన సంఘాలు అనేక కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు.



2009లో అప్పటి రాష్ట్రపతి ప్రతిభాపాటిల్ నుంచి పద్మభూషణ్ పురస్కారాన్ని అందుకుంటున్న కృష్ణ



అప్పటి భారత ప్రధాని రాజీవ్‌గాంధీతో..



చంద్రబాబుతో కృష్ణ, విజయనిర్మల దంపతులు



కుటుంబసభ్యులతో కృష్ణ



బుర్రిపాలెంలో సూపర్‌స్టార్ కృష్ణ ఇల్లు

సీజీహెచ్‌ఎస్‌కు నేడు సెలవు

గుంటూరు, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): గురునానక్ జయంతి సందర్భంగా కేంద్రప్రభుత్వం శుక్రవారం సెలవు దినంగా ప్రకటించిన నేపథ్యంలో ఉద్యోగులు, పెన్షనర్స్‌కు ఉచితంగా సేవలందించే సెంట్రల్ గవర్నమెంట్ హెల్త్ స్కీమ్ (సీజీహెచ్‌ఎస్) కార్యాలయం సేవలు ఉండవని గుంటూరు సీజీహెచ్‌ఎస్ చీఫ్ మెడికల్ ఆఫీసర్ కోటేశ్వరరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి గుంటూరు, ప్రకాశం జిల్లాలోని సీజీహెచ్‌ఎస్ కార్డు లబ్ధిదారులు వైద్య సేవల నిమిత్తం శుక్రవారం గుంటూరుకు రావద్దని ఆయన విజ్ఞప్తి చేశారు.

పలు కార్పొరేషన్లకు సభ్యుల నియామకం

గుంటూరు, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం మరో నాలుగు కార్పొరేషన్లకు సభ్యులను నియమించింది. ఉమ్మడి గుంటూరుకు చెందిన పలువురు స్థానం సంపాదించుకున్నారు. వాల్మీకి/బోయ కార్పొరేషన్లో గురజాల నియోజకవర్గం నుంచి టీడీపీ నేత ముప్పన్న వెంకటేశ్వర్లు, మాదిగ కార్పొరేషన్లో మంగళగిరి నియోజకవర్గం నుంచి జనసేన నేత బేతపూడి విజయశేఖర్, తాడికొండ నియోజకవర్గం నుంచి అమరావతి ఉద్యమ నేత, టీడీపీ నాయకురాలు కంభంపాటి శిరీష, మాచర్ల నియోజకవర్గం నుంచి టీడీపీ నేత సాతులూరి కుమార్‌లు సభ్యులుగా నియమితులయ్యారు.

దేశం కోసమే నెహ్రూ కుటుంబం బతికింది

● ముగ్గురు మాజీ ప్రధానుల విగ్రహాల ఆవిష్కరణ సభలో షర్మిల

పెదకాకాని, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): దేశం కోసమే నెహ్రూ కుటుంబ బతికిందని, ఆ కుటుంబ దేశం కోసం ఎంతో త్యాగం చేసిందని కాంగ్రెస్ పార్టీ ఏపీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల అన్నారు. గురువారం పెదకాకానిలో దివంగత



ప్రసంగిస్తున్న కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు షర్మిల

మాజీ ప్రధానులు జవహర్‌లాల్ నెహ్రూ, ఇందిరాగాంధీ, రాజీవ్ గాంధీల విగ్రహాలను ఆమె ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో షర్మిల మాట్లాడుతూ రాహుల్ గాంధీ ప్రేమ, ఐక్యత కోసం ఎంతో కృషి చేస్తున్నారన్నారు. ఆంధ్రప్రదేశ్‌కు విభజన హామీలను నెరవేర్చలేదని, బీజేపీ, ఆర్‌ఎస్‌ఎస్ మతతత్వ పార్టీలుగా వ్యవహరిస్తున్నాయన్నారు. విభజన సమయంలో ఆంధ్రప్రదేశ్‌కు ఇచ్చిన హామీలను ఒకటి కూడా నెరవేర్చలేదన్నారు. బాబు, జగన్మోహన్‌రెడ్డి ఇద్దరు బీజేపీకి ఊడిగం చేస్తున్నారని ఆరోపించారు. బీజేపీ రాజ్యాంగాన్ని ఉల్లంఘిస్తుందని ఆమె ఆరోపించారు. రాజ్యాంగ పరిరక్షణ కోసం కాంగ్రెస్ పార్టీని గెలిపించుకోవాల్సిన అవసరం ఉందని తెలిపారు. ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు మాట్లాడుతూ పంచవర్ష ప్రణాళికలను అమలు చేసి దేశ అభివృద్ధి కోసం నెహ్రూ ఎంతో కృషి చేశారన్నారు. ఆయన ప్రధానిగా ఉన్నప్పుడు ప్రవేశపెట్టిన అనేక సంస్కరణలు ఇప్పుడు ఫలాలు ఇస్తున్నాయన్నారు. ప్రాజెక్టులు, ఐఐటీ, ఎన్‌ఐటీ, ఇస్రో వంటి ఎన్నో స్థాపించారని కొనియాడారు. మాజీ ఎమ్మెల్యే మస్తాన్ వలీ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ తల్లి లాంటిది అన్నారు. ఆ పార్టీ దేశానికి ఎంతో మేలు చేసిందన్నారు. మాజీ మంత్రి డొక్కా మాణిక్య వరప్రసాద్ మాట్లాడుతూ షర్మిల ప్రాణాలకు ముప్పు ఉందని, కుటుంబాన్ని, మీ ప్రాణాలను నువ్వే కాపాడుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే లింగంశెట్టి ఈశ్వరరావు, చిలకా విజయ్ కుమార్, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

జగన్ పాలనలో రాష్ట్రం 50 ఏళ్లు వెనక్కి

- చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు

వినుకొండ, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): ఐదేళ్ల జగన్ పాలనలో 50 ఏళ్ల రాష్ట్రం అన్ని రంగాల్లో వెనకబడి పోయిందని చీఫ్ విప్, వినుకొండ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు అసెంబ్లీలో అన్నారు. రాష్ట్ర బడ్జెట్‌పై ధన్యవాదాలు చెబుతూ గురువారం అసెంబ్లీలో ఆయన మాట్లడుతూ రూ. 10లక్షల 50వేల కోట్లు అప్పులు, పరిశ్రమలు పక్క రాష్ట్రాలకు పారిపోయేల చేయడం, ఉద్యోగాలు ఇవ్వకుండా యువతను వంచించడం, గుంతల రోడ్లు, దోపిడీ, హత్య రాజకీయాలు మినహా వైసీపీ రాష్ట్రానికి చేసింది ఏమీలేదని తెలిపారు. వైసీపీ అన్ని విధాలుగా ధ్వంసం చేసిన రాష్ట్రాన్ని తిరిగి పునర్నిర్మించేందుకు మంచి బడ్జెట్‌ను ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ ప్రవేశపెట్టారని చెప్పారు. ఆర్థిక నేరస్తులు, హంతకులు, దోపిడీదారులకు పదవులు, ప్రమోషన్లు జగన్ కల్పించారని దుయ్యబట్టారు. అలాంటి అరాచకాలను మళ్లీ చూడకూడదనే ప్రజలు సీఎంగా చంద్రబాబు నాయుడును గెలిపించారని చెప్పారు. సీఎం చంద్రబాబు నాయుడు రాష్ట్రాన్ని స్వర్ణాంధ్రప్రదేశ్‌గా చేయడానికి విజన్ 2047 తీసుకున్నారని తెలిపారు. వైసీపీ పాలనలో ఏ రోడ్డు చూసిన గుంతలమయం తప్ప ఏం సాధించారని, ఎక్కడైనా ఒక కొత్త రోడ్డు కాని, రోడ్డు మరమ్మతులు గాని చేయించారా అని ప్రశ్నించారు. రోడ్లపై గుంతలు పూడ్చటానికి రూ.600 కోట్లు బడ్జెట్‌లో కేటాయించారని వివరించారు. అవసరమైతే మరో రూ.300 కోట్లు ఇస్తారని చెప్పారు. చెత్తమీద పన్ను వేసిన ఏకైక చెత్త ప్రభుత్వం వైసీపీ అన్నారు. ఉద్యోగాలని చెప్పి వాలంటీర్ల ఉద్యోగాలు ఇచ్చి యువతను మోసం చేశారన్నారు. కూటమి ప్రభుత్వం 20లక్షల మందికి ఉద్యోగాలు ఇవ్వాలని లక్ష్యంగా పెట్టుకుందని అన్నారు. ఎవరైనా పరిశ్రమలు పెడతామంటే వారికి కావాల్సిన భూకేటాయింపులు మొదలు విద్యుత్ మిగతా అనుమతులన్నీ వేగంగా ప్రభుత్వం ఇస్తుందని తెలిపారు. స్వార్థ ప్రయోజనాల కోసం సొంత బాబాయిని హత్య చేస్తే హంతకులకు ఎంపీ సీటు ఇచ్చి ప్రమోషన్ ఇచ్చారని ఎద్దేవ చేశారు. ఒక మాజీ ముఖ్యమంత్రి ఇంటిపైకి దాడులకు వెళ్లిన వారికి పదవులు ఇచ్చి మంత్రులు చేస్తారా అని ప్రశ్నించారు.



వైసీపీ పాలనలో పాడైయిన రోడ్ల ఫొటోలను బడ్జెట్ సమావేశాల్లో చూపిస్తున్న చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు

నర్సింగ్ విద్యార్థిని ఆత్మహత్యాయత్నం

రాజుపాలెం, నవంబరు14 (ఆంధ్రజ్యోతి): కళాశాల భవనంపై నుంచి దూకి నర్సింగ్ విద్యార్థిని ఆత్మహత్యకు పాల్పడిన ఘటన గురువారం రాత్రి రాజుపాలెం మండలంలోని కోటనెమలిపురి గ్రామ శివారు కొండమోడు వద్ద చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం కొండమోడు గ్రామ సమీపంలోని అంజిరెడ్డి నర్సింగ్ కళాశాలలో కేరళ రాష్ట్రానికి చెందిన విస్మయ అనే విద్యార్థిని బీఎస్సీ నర్సింగ్ మొదటి సంవత్సరం చదువుతోంది. గురువారం రాత్రి విస్మయ తను చదువున్న కళాశాల బిల్డింగ్ పైనుంచి కిందికి దూకి ఆత్మహత్యాయత్నానికి పాల్ప డింది. తీవ్ర గాయాలతోవున్న విద్యార్థినిని కళాశాల సిబ్బంది నరసరావు పేటలోని అంజిరెడ్డి హాస్పిటల్‌కి తరలించారు. సమాచారం అందుకున్న స్థానిక ఎస్ఐ వేణుగోపాల్ సంఘటన స్థలానికి వెళ్లి వివరాలు సేకరించారు. విద్యార్థిని పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం.

నాసిరకం ల్యాప్‌టాప్‌ల పంపిణీపై 90 రోజుల్లో దర్యాప్తు

బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటాం

శాసనమండలిలో మంత్రి లోకేశ్ వెల్లడి

అమరావతి, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): వైసీపీ పాలనలో ఐఐఐటీ విద్యార్థులకు నాసిరకం ల్యాప్‌టాప్‌లు పంపిణీ చేశారని, దీనిపై 90 రోజుల్లో దర్యాప్తు పూర్తి చేసి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని విద్య, ఐటీ శాఖ మంత్రి నారా లోకేశ్ చెప్పారు. రాష్ట్రంలోని ఐఐఐటీ విద్యార్థులకు 2023లో నాసిరకం ల్యాప్‌టాప్‌లు అందించడంపై మండలిలో ఎమ్మెల్సీలు భూమిరెడ్డి, రాంగోపాల్‌రెడ్డి, దువ్వారపు రామారావు, కంచర్ల శ్రీకాంత్ అడిగిన ప్రశ్నలకు మంత్రి సమాధానం చెప్పారు. ఏపీ ఈ-ప్రొక్యూర్‌మెంట్ ద్వారా ఆర్జీయూకేటీ(ఐఐఐటీ)ల్లో అభ్యసించే విద్యార్థులకు అందించేందుకు 2023లో 6,500 ల్యాప్‌టాప్‌లు కొనుగోలు చేశారన్నారు. ఒక్కో ల్యాప్‌టాప్ కోసం రూ.27 వేలు వెచ్చించారని తెలిపారు. అయితే 1,520 ల్యాప్‌టాప్‌ల్లో సమస్యలు ఉన్నట్లు ఫిర్యాదులు వచ్చాయన్నారు. ల్యాప్‌టాప్‌ల్లో కనీసం ఒరిజినల్ ఆపరేటింగ్ సిస్టమ్ సాఫ్ట్‌వేర్ కూడా ఇన్‌స్టాల్ చేయలేదని, బేసిక్ అడాప్టర్‌లు కూడా పనిచేయని పరిస్థితి ఉందన్నారు. కొన్ని ల్యాప్‌టాప్‌ల్లో ఆడియో క్వాలిటీలో ఇబ్బందులు ఉన్నాయని, బ్యాటరీలు కూడా నాసిరకంగా ఉన్నాయని సభకు మంత్రి లోకేశ్ వివరించారు. 90 రోజుల్లో దర్యాప్తు పూర్తి చేసి ఆ వివరాలను తప్పనిసరిగా సభ ముందు పెడతాం' అని స్పష్టం చేశారు.

26న జరిగే ఆందోళనల్లో... ప్రజలు భాగస్వాములు కావాలి

ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఓబులేసు

గుంటూరు(తూర్పు), నవంబరు 14(ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న కార్మిక, ఉద్యోగ, రైతు వ్యతిరేక విధానాలను నిరసిస్తూ దేశ వ్యాప్తంగా ఈ నెల 26న జరిగే కార్యక్రమంలో ప్రజలు భాగస్వాములు కావాలని ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి ఓబులేసు పిలుపునిచ్చారు. గురువారం స్థానిక కొత్తపేట, మల్లయ్య లింగం భవన్‌లో కార్మిక, రైతు, ప్రజా, ఉద్యోగ సంఘాల నాయకులతో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహిం చారు. సమావేశానికి ఏ ఐ టీ యూ సీ జిల్లా ప్రధాన కార్యదర్శి మేడా హనుమంతురావు, సీఐటీ యూ జిల్లా నాయకుడు కే శ్రీనివాసరావు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఓబులేసు మాట్లా డుతూ 26న ఉదయం 10 గంటలకు స్థానిక శంకర్‌విలాస్ సెంటర్ నుంచి మార్కెట్ సెంటర్ వరకు ప్రదర్శన నిర్వహించి అనంతరం అక్కడ బహిరంగ సభ ఏర్పాటు చేస్తున్నట్టు తెలిపారు. అప్పటి వరకు మండల, గ్రామ స్థాయిలో ప్రచార కార్యక్ర మాలను చేపట్టాలని పిలుపునిచ్చారు. ఈ నెల 26న రాజ్యాంగా ఆమోద దినోత్సవం పురస్కరించుకుని ఈ ఆందోళనకు పిలుపునిచ్చినట్టు తెలిపారు. ఇప్పటివరకు పదిసార్లు క్యాబి నెట్ సమావేశం జరిగిందని, ఒక్కసారి కూడా రైతులు, కార్మికుల సమస్యలపై చర్చించలేదని విమర్శించారు.సమా వేశంలో వామపక్ష నాయకులు జంగాల అజయ్‌కుమార్, వెలుగూరి రాధాకృష్ణమూర్తి, దండా లక్ష్మీనారాయణ, కంచూమాటి అజయ్‌కుమార్, కొల్లి రంగారెడ్డి, పాటిబండ్ల కోటేశ్వరరావు, కొరపాటి కోటయ్య ప్రసంగించారు.



మాట్లాడుతున్న ఓబులేసు, పాల్గొన్న ప్రజా సంఘాల నాయకులు

కష్టమర్లకు మరిన్ని సేవలు

యూనియన్ బ్యాంకు వ్యవస్థాపక దినోత్సవంలో కలెక్టర్

గుంటూరు సిటీ, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): గుంటూరు జిల్లా లో లీడ్ బ్యాంకుగా ఉన్న యూనియన్ బ్యాంకు ద్వారా కష్టమర్లకు మంచి సర్వీసు అందుతుందని కలెక్టర్ ఎస్ నాగలక్ష్మి అన్నారు. యూనియన్ బ్యాంకు 106వ వ్యవస్థాపక దినోత్సవం పెదపలకలూరు రోడ్డులోని వీ కన్వెన్షన్‌లో గురువారం రాత్రి జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన



యూనియన్ వ్యవస్థాపక దినోత్సవంలో కేక్ కట్ చేస్తున్న కలెక్టర్ నాగలక్ష్మి

కలెక్టర్ నాగలక్ష్మి మాట్లాడుతూ యూనియన్ బ్యాంక్ ఎన్నో ఆటుపోట్లను ఎదుర్కొని ఈ స్థాయికి వచ్చినట్లు చెప్పారు. యూనియన్ బ్యాంక్ ఖాతాదారులకు భవిష్యత్తులో మరిన్ని సేవలు అందిస్తుందని ఆకాంక్షిస్తున్నానన్నారు. ఈ కార్యక్రమంలో చైతన్య గోదావరి గ్రామీణ బ్యాంక్ చైర్మన్ ప్రమోద్ కుమార్ రెడ్డి, యూనియన్ బ్యాంక్ రీజనల్ హెడ్ జవహర్, డిప్యూటీ రీజనల్ హెడ్ రాజేష్, ఎల్‌డీఎం మహిపాల్ రెడ్డి, చైతన్య గోదావరి గ్రామీణ బ్యాంక్ మాజీ చైర్మన్ బ్రహ్మానంద రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మేయర్ మనోహర్‌ను అరెస్టు చేయాలి

గతంలో చేసిన వ్యాఖ్యలపై డీఎస్పీకి ఆధారాల అందజేత

పోలీసుల లాఠీతో దాడి.. పవన్‌కల్యాణ్‌ను దూషించారన్న టీడీపీ నేతలు

గుంటూరు, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): గతంలో చంద్రబాబు అరెస్టును నిరసిస్తూ టీడీపీ నేతలు బంద్ పాటిస్తుండగా పోలీసుల చేతిలోని లాఠీని లాక్కొని టీడీపీ శ్రేణులపై దాడి చేయడమే కాక చంద్రబాబు, పవన్‌కల్యాణ్, లోకేశ్‌లను అసభ్య పదజాలంతో దూషించిన గుంటూరు మేయర్ కావటి మనోహర్‌నాయుడిపై చర్యలు తీసుకోవాలని గురువారం టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక



వెస్ట్ డీఎస్పీ జయరామ్ ప్రసాద్‌కు ఫిర్యాదు చేస్తున్న కనపర్తి శ్రీనివాసరావు, యల్లావుల అశోక్, అడకా శ్రీను, రమణ, వేములకొండ శ్రీనివాస్ తదితరులు

కార్యదర్శి కనపర్తి శ్రీనివాసరావు వెస్ట్ డీఎస్పీ జయరామ్ ప్రసాద్‌ను కలసి ఫిర్యాదు చేశారు. ఈ ఘటనపై అప్పట్లోనే అరండల్‌పేట పోలీసు స్టేషన్లో టీడీపీ, జనసేన నాయకులు ఫిర్యాదు చేసినా కనీసం ఎఫ్ఐఆర్ కూడా నమోదు చేయలేదని డీఎస్పీకి వివరించారు. ఆ రోజు మనోహర్ చేసిన వ్యాఖ్యలను డీఎస్పీకి వినిపించి, వీడియోని కూడా అందజేశారు. ప్రభుత్వం మారడంతో రాష్ట్ర వ్యాప్తంగా చంద్రబాబు, పవన్‌కల్యాణ్ కుటుంబసభ్యులను దూషించిన వారిపై కేసులు నమోదు చేసి అరెస్టు చేస్తున్నారన్నారు. ఈ క్రమంలో మేయర్ మనోహర్‌పై కూడా కేసు నమోదు చేసి చర్యలు తీసుకోవాలన్నారు. ఫిర్యాదు అనంతరం కనపర్తి, కార్పొరేటర్లు యల్లావుల అశోక్, రమణ, అడకా శ్రీనివాసరావు, వేములకొండ శ్రీనివాసరావులతో కలిసి మీడియాతో మాట్లాడుతూ అధికారాన్ని అడ్డుపెట్టుకుని నగర ప్రథమ పౌరుడినన్న స్పృహ కూడా లేకుండా చంద్రబాబు, పవన్‌కల్యాణ్ సహా కుటుంబసభ్యులను అసభ్యంగా దూషించిన మనోహర్‌ను వెంటనే అరెస్టు చేయాలన్నారు. గత ప్రభుత్వంలో మేయర్ రెచ్చిపోయి అచ్చెన్నాయుడు, పట్టాభిలను కూడా నోటికొచ్చినట్లు దూషించారన్నారు. ఆయనపై త్వరలో మరో ఫిర్యాదు కూడా చేయనున్నట్లు తెలిపారు. టీడీపీ రాష్ట్ర కార్యాలయంపై దాడి చేయించిన నేతలు సుప్రీంకోర్టుకు వెళ్లి దర్జాగా బయట తిరుగుతుంటే దాడి చేసిన వారు కటకటాల్లో రోజులు లెక్కబెడుతున్నారన్న విషయాన్ని ఆ పార్టీ కార్యకర్తలు గుర్తించాలన్నారు. జగన్‌రెడ్డి, సజ్జలరెడ్డి, సాయిరెడ్డి మాటలు నమ్మి సామాజిక మాధ్యమాల్లో మహిళలపై అసభ్య పోస్టులు, మార్ఫింగ్ ఫొటోలు, వ్యక్తిత్వ హననంకు పాల్పడితే ప్రభుత్వ పరంగా బెయిలు రాకుండా కఠిన చర్యలు ఉంటాయన్నారు. బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు వేములకొండ శ్రీనివాస్ మాట్లాడుతూ జగన్ రెడ్డి పాలనలో వైసీపీ నేతల చేతుల్లో వేధింపులకు, హత్యలకు గురైంది ఎక్కువగా బడుగు, బలహీనవర్గాలకు చెందినవారేనన్నారు. గత ప్రభుత్వంలో బడుగులపై వైసీపీ నేతలు చేసిన అరాచకాలపై ప్రభుత్వం సిట్టింగ్ న్యాయమూర్తితో విచారణ జరిపించాలని కోరారు.

మాదిగల ఆత్మీయ సమ్మేళనాన్ని జయప్రదం చేయండి

తాడికొండ, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): ఈనెల 19వ తేదీన జరుగుతన్న మాదిగల అత్మీయ సమ్మేళనాన్ని జయప్రదం చేయాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు రుద్రపోగు సురేష్ కోరారు. జనసమీకరణలో భాగంగా గురువారం తాడికొండ, నిడుముక్కల, పొన్నెకల్లులో పర్యటించారు. గుంటూరులోని వెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో జరుగు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు.

నేడు గండభేరుండ జ్వాలా దీపోత్సవం

● హాజరుకానున్న మంత్రి నారా లోకేశ్

మంగళగిరి సిటీ, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): కార్తీక పౌర్ణమి సందర్భంగా సనాతన ధర్మ రక్ష సేన ఆధ్వర్యంలో శుక్రవారం మంగళాద్రి క్షేత్రం పర్వత శిఖరాగ్రాన కొలువైన శ్రీగండాలయ స్వామి సన్నిధిలో గండభేరుండ జ్వాలా దీపోత్సవం జరుగుతుందని విశ్వ హిందూ పరిషత్ మంగళగిరి శాఖ అధ్యక్షుడు ఆకు రాతి నాగేంద్రం తెలిపారు. సాయంత్రం 6 గంటలకు 300 కిలోల ఆవునెయ్యితో 600 మీటర్ల కాటన్ క్లాత్‌తో జ్వాలా దీపాన్ని వెలిగిస్తారన్నారు. దీపోత్సవం నిమిత్తం భక్తుల నుంచి ఆవు నెయ్యి మాత్రమే స్వీకరిస్తామని తెలిపారు. శుక్రవారం సాయంత్రం శ్రీలక్ష్మీ నృసింహస్వామి దేవస్థానంలో జరిగే కోటి దీపోత్సవం, గండాలయ స్వామి సన్నిధిలో జరిగే జ్వాలా దీపోత్సవానికి మంత్రి నారా లోకేశ్ హాజరవుతారని తెలియజేశారు.

నేడు సత్యనారాయణస్వామి వ్రతాలు

మంగళగిరి, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): కార్తీక పౌర్ణమి సందర్భంగా పాత మంగళగిరి దుర్గానగర్ శ్రీకనకదుర్గ అమ్మవారి ఆలయ ప్రాంగణంలో కొలువైన శ్రీరమా సత్యనారాయణస్వామి ఆలయంలో శుక్రవారం సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాలు నిర్వహిస్తున్నట్టు ఆలయ కమిటీ ప్రతినిధి ఇంటూరి దుర్గాప్రసాద్ తెలిపారు. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరు కావాలని కోరారు.

17న ఉచితవైద్యశిబిరం

దుగ్గిరాల(ఆంధ్రజ్యోతి), నవంబరు 14: ఈనెల 17వతేదీన దుగ్గిరాల జడ్పీ బాలురోన్నత పాఠశాలలో మానవసేవాసంస్థ ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు సంస్థ వ్యవస్థాపకులు వంగర సురేష్‌కుమార్ తెలిపారు. ఆదివారం జరుగు వైద్యశిబిరాన్ని ప్రజలు సద్వినియోగించుకోవాలని కోరారు.



బైక్‌తో చెట్టుకు ఢీకొని బాలుడు మృతి

తాడికొండ, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): అతివేగంగా ద్విచక్ర వాహనంపై వస్తూ చెట్టుకు ఢీకొని బాలుడు మృతి చెందిన ఘటన లాంలో గురువారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం లాం గ్రామానికి చెందిన షేక్ బాజీ(17) బుధవారం రాత్రి ద్విచక్ర వాహనంపై గుంటూరు వెళ్లి పనులు ముగించుకొని ఇంటి వస్తున్నాడు. బైక్‌పై స్పీడ్‌గా రావటంతో బైక్ అదుపుతప్పి చెట్టుకొని ఢీకొట్టాడు. దీంతో బాలుడి తలకు తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు 108కు సమాచారం అందించి చికిత్స నిమిత్తం గుంటూరు జీజీహెచ్‌కు తరలించారు. చికిత్స పొందుతు బాలుడు మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. బాలుడి అక్క పోలీసులకు ఫిర్యాదు చేయటంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ జోజి తెలిపారు.

వివాహిత, ఇద్దరు పిల్లలు అదృశ్యం

తాడికొండ, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): వివాహిత, ఇద్దరు పిల్లలు అదృశ్యమైన ఘటన బుధవారం తాడికొండ మండలం పణిదరంలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం గండికోట శ్రీదేవికి భర్త చనిపోవటంతో తన ఇద్దరు పిల్లలతో కలిసి తన తండ్రి ఇంటి వద్ద నివాసం ఉంటుంది. అయితే బుధవారం శ్రీదేవి తండ్రి ఏడుకొండలు ఇంటికి వచ్చి చూసే సరికి ఇంట్లో ఎవరు లేరు. పిల్లల పాఠశాలలో విచారించగా పిల్లల తల్లి వచ్చి తీసుకువెళ్లినట్లు తెలిపారు. బంధువులను, చుట్టు పక్కల వారిని విచారించగా ఎలాంటి ఫలితం లేకుండా పోయింది. దీంతో శ్రీదేవి తన ఇద్దరు పిల్లలను తీసుకుకొని ఎటువెళ్లిపోయిందో తెలియకపోవటంతో తాడికొండ పోలీస్‌స్టేషన్‌లో గురువారం ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ జోజి తెలిపారు.

రైతు ఆత్మహత్య



జొన్నలగడ్డ అశోక్ (ఫైల్ ఫొటో)

ప్రత్తిపాడు, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): అప్పుల బాధతో రైతు గడ్డి మందు తాగి ఆత్మహత్య చేసుకున్న ఘటన కోయవారిపాలెంలో జరిగింది. కోయవారిపాలెం జొన్నలగడ్డ అశోక్ (36)కు ఐదు సంవత్సరాలుగా వ్యవసాయంలో పూర్తిగా నష్టాలు వచ్చాయి. మరలా ఈ సంవత్సరం తనకున్న ఒక ఎకరం పొలంతో పాటు మరో 8 ఎకరాల భూమి కౌలుకు తీసుకుని వ్యవసాయం చేశాడు. అయితే ఈ ఏడాది పంటలు దెబ్బతినడంతో గతంలో ఉన్న అప్పులతో పాటు ఈ ఏడాది అప్పులు పెరిగిపోవడంతో వాటిని ఎలా తీర్చాలో తెలియక బుధవారం సాయంత్రం పొలం వద్దకు వెళ్లి గడ్డిమందు తాగి నురుగు కక్కుకుంటూ ఇంటికి వచ్చాడు. దీనికి గమనించిన అశోక్ తండ్రి చిన్నోడు వెంటనే గుంటూరు ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ మరణించాడు. ఈ మేరకు ప్రత్తిపాడు ఎస్‌ఐ నాగేంద్ర కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సీఆర్డీఏ భూములు సాగు చేస్తున్న వ్యక్తిపై కేసు నమోదు

తుళ్లూరు, నవంబరు 14: (ఆంధ్రజ్యోతి) మండల పరిధిలోని శాఖమూరు రెవెన్యూ పరిధిలో దాదాపు 25 ఎకరాలు సీఆర్డీఏ భూములు ఆక్రమంచి ఐదేళ్లగా సాగుచేస్తున్న వ్యక్తిపై గురువారం తుళ్లూరు ఎస్‌ఐ బాబురావు కేసు నమోదు చేశారు. గత నెలలో సీఆర్డీఏ భూములను ఆక్రమించి మినుము పంట సాగు చేస్తున్న శాఖమూరుకు చెందిన వైసీపీ నేత జొన్నకూటి ప్రశాంత్ అని పంట ఫొటోతో సహా ఆంధ్రజ్యోతిలో వార్త వచ్చింది. సీఆర్డీఏ అధికారులు అప్పుడే పంటను తొలగించారు. అనంతరం దర్యాప్తు చేసి ప్రశాంత్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

విజ్ఞాన సముపార్జనకు గ్రంథాలయాలు దోహదం

● మంగళగిరి ఎంఈవో ఎస్ బాబు

● గ్రంథాలయ వారోత్సవాలు ప్రారంభం



తుళ్లూరులో ర్యాలీ చేస్తున్న విద్యార్థులు

మంగళగిరి సిటీ, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): విజ్ఞాన సముపార్జనకు పుస్తక పఠనం ఎంతగానో దోహదం చేస్తుందని ఎంఈవో ఎస్ బాబు అన్నారు. మంగళగిరి శివాలయం పక్కన గల శాఖా గ్రంథాలయంలో 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలను గురువారం ఆయన ప్రారంభించారు. గ్రంథాలయ వారోత్సవాలు, బాలల దినోత్సవం సందర్భంగా తొలుత గ్రంథాలయాల పితామహుడు అయ్యంకి వెంకటరమణయ్య, భారత మాజీ ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ చిత్రపటాలకు నివాళి అర్పించారు. ఈ కార్యక్రమంలో డీఎస్ శర్మ, గ్రంథాలయాధికారి ఆరోగ్యం, పీ.కృష్ణ, పాఠకులు, విద్యార్థులు పాల్గొన్నారు. నూతక్కి లోని శాఖా గ్రంథాలయంలో వారోత్సవాలను ఘనంగా ప్రారంభించారు. గ్రంథాలయంలో ఏర్పాటు చేసిన పుస్తక ప్రదర్శనను వల్లూరి భారతీదేవి ప్రారంభించారు. కార్యక్రమంలో గ్రంథాలయాధికారి ఎస్ నరసింహారావు, గ్రామ పెద్దలు, విద్యార్థులు పాల్గొన్నారు.

● తాడేపల్లి టౌన్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): తాడేపల్లి శాఖా గ్రంథాలయంలో వారోత్సవాలు గురువారం ప్రారంభమయ్యాయి. కేవీఆర్ జడ్పీ హైస్కూల్ హెచ్‌ఎం బి.తాతిరెడ్డి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. గ్రంథాలయాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని విద్యాలయంలో విద్య, గ్రంథాలయంలో జ్ఞానం దొరుకుతుందన్నారు. అనంతరం విద్యార్థులకు దేశభక్తి గీతాల పోటీలు నిర్వహించారు

● తుళ్లూరు, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు గురువారం తుళ్లూరులో ప్రారంభమయ్యాయి. మొదటి రోజు బాలల దినోత్సవాన్ని పురస్కరించుకొని జవహర్‌లాల్ నెహ్రూ చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. అనంతరం గ్రంథాలయాల ప్రత్యేకతను తెలిపే ర్యాలీని విద్యార్థులతో నిర్వహించారు. కార్యక్రమంలో తుళ్లూరు గ్రంథాలయ అధికారి టీ.గిరిధర్, జడ్పీ పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

● తాడికొండ, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): తాడికొండ శాఖ, బాలికల గ్రంథాలయాల్లో నెహ్రూ చిత్ర పటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా తాడికొండ సర్పంచ్ తోకల సరోజిని మాట్లాడుతూ గ్రంథాలయాల్లో చదువుకొని ఎంతో విజ్ఞాన్ని పెంచుకోవచ్చునని తెలిపారు.

● పెదనందిపాడు, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): స్థానిక శాఖ గ్రంథాలయంలో జాతీయ 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు గురువారం ప్రారంభమ య్యాయి. తొలుత వారోత్సవాలను మాజీ ఎంపీపీ ముద్దన నగరాజకుమారి ప్రారంభించారు. గ్రంథాలయాల్లో పాక్ష, వార, మాస పుస్తకాలు అందుబాటులో ఉంటాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ అధికారి సుభాషి బీ, శ్యాంసన్, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

పుస్తక పఠనంతోనే జ్ఞానం పెంపొందుతుంది

● గింజుపల్లి శివరామప్రసాద్

ప్రత్తిపాడు, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): పుస్తక పఠనం ద్వారానే జ్ఞానం పెంపొందుతుందని, ఇది నిరంతర ప్రక్రియ అని టీడీపీ మండల అధ్యక్షులు గింజుపల్లి శివరామప్రసాద్ అన్నారు. ప్రత్తిపాడు శాఖా గ్రంథాలయంలో వారోత్సవాలను గింజుపల్లి శివరామప్రసాద్ ప్రారంభించారు. అనంతరం బాలల దినోత్సవం సందర్భంగా నెహ్రూ చిత్ర పటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో వార్డు మెంబరు డబ్బూరి వెంకటేశ్వర్లు, కాకాని సురేష్, చెన్నుబోయిన శ్రీనివాసరావు, చిన్నం శ్రీకాంత్, కుర్రి సుబ్బారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా బాలల దినోత్సవం

● జవహర్‌లాల్ నెహ్రూ చిత్రపటానికి నివాళులు



దుగ్గిరాల బాలలదినోత్సవంలో నెహ్రూ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న విద్యార్థినులు, ఉపాధ్యాయినులు

దుగ్గిరాల, (ఆంధ్రజ్యోతి), నవంబరు 14: మండలంలోని పలుగ్రామాల్లో ప్రభుత్వ ప్రైవేటు, పాఠశాలల్లో మాజీప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ పుట్టినరోజును పురస్కరించుకుని బాలలదినోత్సవాన్ని గురువారం ఘనంగా జరుపుకున్నారు. స్థానిక జడ్పీ బాలికోన్నత పాఠశాలలో నెహ్రూ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. పెనుమూలి జడ్పీహైస్కూల్లో జాగృతభారత్ ఆధ్వర్యంలో పసుపులేటి గణేష్ ప్రొటీన్ చాకోచిప్స్‌ను అందించారు. హెచ్‌ఎం శోభాదేవి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

● తాడేపల్లి, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): తాడేపల్లి మండలం వడ్డేశ్వరం జడ్పీహైస్కూల్లో గురువారం బాలల దినోత్సవం నిర్వహించారు. పాఠశాల ఇన్‌చార్జి హెచ్‌ఎం బుజ్జిబాబు మాట్లాడుతూ నేటి బాలలే నేటి పౌరులని విద్యార్థుల అభివృద్ధితోనే దేశాభివృద్ధి ముడిపడి ఉందన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు డీవీ రమణమ్మ, కె.వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

● కాకుమాను, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): మండల వ్యాప్తంగా అన్ని ప్రభుత్వ పాఠశాలలు, ప్రైవేట్ పాఠశాలల్లో ఘనంగా జాతీయ బాలల దినోత్సవం గురువారం ఘనంగా నిర్వహించారు. స్థానిక ఎంఆర్‌సీ వద్ద ప్రత్యేక అవసరాలు కలిగిన విద్యార్థుల పాఠశాలల్లో ఎంఈవో కెన్నడీ పాల్గొన్నారు. చిన్నారులు స్వాతంత్ర్య సమర యోధుల వేషధారణలు, నృత్యాలు ప్రదర్శించిన తీరు ఆహుతులను ఎంతగానో అలరించాయి.


● వట్టిచెరుకూరు, నవంబరు 14(ఆంధ్రజ్యోతి) : నేటి బాలలే భావి భారత పౌరులుగా ఎదగటానికి ఉపాధ్యాయ వృత్తి కీలకమైందని మలినేని లక్ష్మయ్య మహిళా కళాశాల ఎన్‌సీసీ ప్రోగ్రాం అధికారి బీ సుబ్బారావు అన్నారు. బాలల దినోత్సవాన్ని పురస్కరించుకొని కళాశాల ఎన్‌సీసీ విభాగం విద్యార్థులు గురువారం మండలంలోని పుల్లడిగుంటలోని ఎంపీపీ స్కూల్లో హెచ్‌ఎం నిర్మల పర్యవేక్షణలో బాలల దినోత్సవాన్ని నిర్వహించారు.

● లేమల్లెపాడు గ్రామంలోని ఎంపీపీ స్కూల్లో గురువారం బాలల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ముఖ్యఅతిథులుగా ఎంపీడీవో ఎం రమేష్ బాబు, ఎస్‌ఐ సుబ్బారావు, సర్పంచ్ పాల్గొన్నారు.

రాజధాని అభివృద్ధికి కేంద్రమే గ్రాంట్‌గా ఇవ్వాలి

● పనుల్లో స్థానికులకే ప్రాధాన్యం ఇవ్వాలి

● సీపీఎం రాజధాని నాయకులు



తుళ్లూరు తహసీల్దార్ కార్యాలయం ముందు ధర్నా చేస్తున్న సీపీఎం నాయకులు కార్యకర్తలు


తుళ్లూరు, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): రాజధాని అమరావతి అభివృద్ధికి అప్పుగా కాకుండా కేంద్ర ప్రభుత్వమే గ్రాంట్‌గా ఇవ్వాలని, అభివృద్ధి పనుల్లో స్థానికులకే ప్రాధాన్యం ఇవ్వాలని సీపీఎం నాయకులు కోరారు. ప్రజా సమస్యల పరిష్కారానికై సీపీఎం నిర్వహించిన ప్రజా పోరు ముగింపు సందర్భంగా గురువారం తుళ్లూరు తహసీల్దార్ కార్యాలయం ఎదుట జరిగిన ధర్నాలో సీపీఎం గుంటూరు జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు, రాజధాని డివిజన్ కార్యదర్శి ఎం రవి మాట్లాడుతూ రోజురోజుకు పెరుగుతున్న అధిక ధరతో ప్రజలు సతమతమవుతుంటే విద్యుత్ చార్జీలను పెంచి ప్రజలపై భారం వేయటం దుర్మార్గమన్నారు. గెలిస్తే విద్యుత్ చార్జీలు పెంచబోమన్న కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉండాలని, ట్రూఅప్ చార్జీలను తక్షణం ఉపసంహరించుకోవాలన్నారు. రాజధాని డివిజన్ కార్యదర్శివర్గ సభ్యులు ఎం భాగ్యరాజు మాట్లాడుతూ ఉచిత ఇసుక సరఫరా సక్రమంగా జరిగేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో సీపీఎం రాజధాని నాయకులు వల్లభపురం వెంకటేశ్వరరావు, పేరం బాబురావు, కుంభ ఆంజనేయులు, షేక్ జానీ, పి.కృపారావు తదితరులు పాల్గొన్నారు. అనంతరం రెవెన్యూ అధికారులకు వినతిపత్రాన్ని అందజేశారు.

ఎంటీఎంసీ కార్యాలయం ఎదుట ధర్నా

మంగళగిరి సిటీ, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): మంగళగిరి పట్టణంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరుతూ సీపీ ఎం ఆధ్వర్యంలో గురువారం ఎంటీఎంసీ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. సీపీఎం నేత వీసం జవహర్‌లాల్ మాట్లాడుతూ పట్టణంలో అనేక చోట్ల పేదలు ఎంతో కాలంగా ఇళ్లు వేసుకుని నివాసం ఉంటున్నారని, వారికి ఇళ్ల పట్టాలు ఇవ్వాలని, ఇంటి స్థలం లేని పేదలకు ఇళ్లు నిర్మించి ఇవ్వాలని డిమాండ్ చేశారు. అనంతరం ఎంటీఎంసీ కమిషనర్ అలీమ్ బాషాకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సీపీఎం నేతలు పాల్గొన్నారు.

● తాడేపల్లి, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలను ప్రతి ఒక్కరు నిరసించాలని పెంచిన గ్యాస్, పెట్రోల్, నిత్యావసర వస్తువుల ధరలు తగ్గించాలని డిమాండ్ చేస్తూ తాడేపల్లి తహసీల్దార్ కార్యాలయం వద్ద సీపీఎం నేతలు గురువారం ధర్నా నిర్వహించారు. సీపీఎం జిల్లా కార్యదర్శి పాశం రామారావు మాట్లాడుతూ ఏడాదికి రెండు కోట్ల ఉద్యో గాలు ఇస్తామని చెప్పిన మోదీ ప్రభుత్వం ఉద్యోగాల కల్పనలో వెనకబడిందన్నారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సీపీఎం నేతలు దొంతిరెడ్డి వెంకటరెడ్డి, శ్రీనివాసకుమారి, దుర్గారావు, కొట్టే కరుణ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నగదు బహుమతులు



విద్యార్థినికి నగదు బహుమతి అందజేస్తున్న మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ రాయపాటి శ్రీనివాస్

తాడికొండ, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): భారతదేశపు మొట్ట మొదటి ప్రధానమంత్రి జవహర్‌లాల్ నెహ్రూ జయంతి సందర్భంగా తాడికొండలోని శ్రీవెల్లంకి వెంకటప్పయ్య ఉన్నత పాఠశాలలో బాలల దినోత్సవం గురువారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ రాయపాటి శ్రీనివాస్ పాల్గొని మాట్లాడారు. నెహ్రూ జయంతి సందర్భంగా ప్రతి సంవత్సరం చిల్డ్రన్స్ డే వేడుకలు దేశవ్యాప్తంగా నిర్వహిస్తారన్నారు. అన్ని తరగతుల్లో ప్రతిభావంతులైన 91 మంది విద్యార్థులకు నగదు బహుమతులు అందజేసినట్లు తెలిపారు. కార్యయక్రమంలో స్కూల్ అడ్మినిస్ట్రేషన్ ఆఫీసర్ కుర్ర అమల, పాఠశాల కమిటీ సభ్యులు త్రిపురనేని మల్లేశ్వరరావు, పీ.గోపిచంద్, ప్రధానోపాధ్యాయులు ఏవీవీ ప్రసాద్, సీనియర్ టీచర్ నేతి వెంకట రమణయ్య, యర్రా వీరయ్యయ, తుమ్మల తిరుపతిరెడ్డి, ఇతర అధ్యాపకులు, విద్యార్ధిని, విద్యార్థులు పాల్గొన్నారు.

సివిల్ ఇంజనీరింగ్ బీమాథాన్‌లో కేఎల్‌యూకు ఆలిండియా 2వ ర్యాంక్

తాడేపల్లి, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): కెఎల్ డీమ్డ్ యూనివర్సిటిలో సివిల్ ఇంజనీరింగ్ చదువుతున్న విద్యార్థులు ఇటీవల తెలంగాణలో జరిగిన ఇన్నోవాక్ 2024 జాతీయ స్థాయి 24 గంటల బీమాథాన్‌లో పాల్గొని ఆలిండియా స్థాయిలో 2వ ర్యాంక్, పదివేల నగదు రివార్డు సాధించారు. బివి రాజు ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ నర్సాపూర్‌లో జరిగిన బీమాథాన్‌లో కెఎల్‌యూ విద్యార్థులు కె సూర్య, వి మాధవరావు, జ్ఞానేశ్వర్‌లు రివిట్ ఆర్కిటెక్చర్ సాఫ్ట్‌వేర్ ద్వారా అత్యాధునికి త్రీడీ భవన నమూనాలను సృష్టించి ఆలిండియా స్థాయిలో ద్వితీయ ర్యాంక్ సాధించారు. విద్యార్థులను వీసీ సారధివర్మ, ప్రోవీసీ డాక్టర్ ప్రసాద్, రాజశేఖరరావు, వెంకటరామ్, సివిల్ ఇంజనీరింగ్ విభాగాధిపతి డాక్టర్ పి పోలురాజు, తదితరులు అభినందించారు.

గ్రామ పంచాయతీల అభివృద్ధికి ప్రణాళికాబద్ధంగా పనిచేయాలి : ఎంపీపీ

మేడికొండూరు, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీల అభివృద్ధికి ప్రణాళికాబద్ధంగా పనిచేయాలని మండల పరిషత్ అధ్యక్షురాలు మన్నవ స్వప్న రాజేష్ చెప్పారు. రాష్ట్రీయ గ్రామ స్వరాజ్ అభియాన్, పంచాయతీరాజ్ శాఖల ఆదేశాలతో సర్పంచ్, ఎంపీటీసీ, వీవోఏలకు గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళిక తయారీపై శిక్షణ కార్యక్రమం మండల పరిషత్ కార్యాలయంలో గురువారం నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు రాజకీయాలకు అతీతంగా గ్రామాల అభివృద్ధికి కృషి చేయాలని కోరారు. ఎంపీడీవో తోట, డీఎల్‌డీవో పిచ్చిరెడ్డి, డీఎల్‌పీవో, ఈవోపీఆర్‌డీ తదితరులు పాల్గొన్నారు.

పోలేరమ్మ దేవాలయంలో చోరీ

పెదనందిపాడు, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): మండలపరిధిలోని రావిపాడు పోలేరమ్మ దేవాలయంలో గుర్తు తెలియని దుండగులు బుధవారం రాత్రి ఆలయ హుండీ తాళాలు పగలగొట్టి చోరీకి పాల్పడ్డారు. గురువారం పోలీసులు స్థానికలు ఫిర్యాదు మేరకు గ్రామానికి విచ్చేసి సంఘటన స్థలాన్ని పరిశీలించారు. చెరువు కట్టపై హుండీ పడవేసి ఉండటం గమనించి విచారణ నిర్వహిస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

పోసానిపై దేశం నాయకుల ఫిర్యాదు



పోసాని మురళిపై సీఐ శ్రీనివాసరావుకు పిర్యాదు చేస్తున్న గింజుపల్లి వెంకటేశ్వరరావు

ప్రత్తిపాడు, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): సినీ నటుడు పోసాని మురళిపై ప్రత్తిపాడు తెలుగుదేశం పార్టీ నాయకులు పోలీస్ స్టేషన్‌లో పిర్యాదు చేశారు. పోసాని కృష్ణ మురళి టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడుతో పాటు, చంద్రబాబనాయుడుపై అసత్యకర ఆరోపణలు చేసిన తీరు బాధాకరంగా ఉందన్నారు. ఇలాంటి అవాకులు, చవాకులు పేలే వారిపై చట్టపరమైన చర్యలు కోవాలంటూ ఆధారాలతో సహా సీఐ శ్రీనివాసరావుకు తెలుగురైతు రాష్ట్ర మీడియా కో ఆర్డినేటర్ గింజుపల్లి వెంకటేశ్వరరావుతో పాటు కుర్రి సుబ్బారెడ్డి, అమర్తలూరి బలసవాబు, డక్కుమల్ల భాగ్యారావు, చెన్నుబోయిన శ్రీనివాసరావుతో పాటు పలువురు లిఖిత పూర్వకంగా పిర్యాదు చేశారు. దీనిపై కేసు నమోదు చేసి విచారణ చేస్తామని సీఐ తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల గింజుపల్లి శివరామప్రసాద్, తెలుగుయువత అధ్యక్షుడు చిన్నం శ్రీకాంత్, కాకాని సురేష్ బాబు, పమిడి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

చిరు వ్యాపారులకు తోపుడు బండ్లు అందజేత



తోపుడుబండి అందజేస్తున్న టీడీపీ నాయకులు

తుళ్లూరు, నవంబరు 14: (ఆంధ్రజ్యోతి): తుళ్లూరులో చిరు వ్యా పారులకు తోపుడు బండ్లను టీడీపీ నాయకులు గురువారం అందజేశారు. టీడీపీ మండల మాజీ అధ్యక్షుడు జొన్నలగడ్డ కిరణ్ సహకారంతో నాలుగు తోపుడు బండ్లు అందజేశారు. పెనుమాక రామారావు, సత్యవతి, వీరమ్మ, లక్ష్మయ్యలకు స్థానిక టీడీపీ నాయకుల చేతుల మీదగా బండ్లను అందజేశారు.

మహిళకు టిఫిన్ బండి

తాడేపల్లి, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): టీడీపీ యువనేత నారా లోకేశ్ స్ఫూర్తితో వడ్డేశ్వరం గ్రామ సీనియర్ టీడీపీ నేత కాట్రగడ్డ మధుసూదనరావు తన సొంత నిధులతో రాధారంగా నగర్‌కు చెందిన మహాలక్ష్మికి గురువారం టిఫిన్ బండి అందజేశారు. అనంతరం గ్రామానికి చెందిన ఆటో కార్మికుడు వెంకటరావుకు రూ.5వేల ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో టీడీపీ గ్రామ అధ్యక్షుడు ఈపూరి కోటయ్య, కాట్రగడ్డ మధుసూదనరావు, మద్దినేని సుబ్రహ్మణ్యం, దాసు, మౌనిక, కరీమా, మస్తాన్‌బీ, కరిమున్నీసా, తంబి, లక్ష్మి, చిన్ని తదితరులు పాల్గొన్నారు.

పశువుల షెడ్లను త్వరగా పూర్తి చేయాలి

● డ్వామా పీడీ శంకర్

మేడికొండూరు, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): పశువుల షెడ్లను త్వర గా పూర్తి చేయడానికి చర్యలు తీసుకోవాలని డ్వామా పీడీ శంకర్ చెప్పారు. మేడికొండూరు ఎంపీడీవో తోట చందనతో కలసి జంగంగుంట్లపాలెంలోని పశువుల షెడ్లను గురువారం పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పశువుల షెడ్లను త్వరగా పూర్తి చేసేందుకు 2వందల రోజుల కార్యాచరణ అమలు చేయాలని సూచించారు. అనంతరం అటవీశాఖ అధికారులతో కలిసి పేరేచర్లలోని నగరవనాన్ని సందర్శించారు. ఈ పర్యటనలో ఏపీవో కిరణ్మయి, అంబుడ్స్‌మన్ ఈసీ లక్ష్మీపతి, టీఏ ప్రసాద్, అటవీశాఖ అధికారులు పాల్గొన్నారు.

భవిష్యత్తు ఎలక్ట్రికల్ ఇంజనీర్లదే



జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న వై సుజిత్‌కుమార్

తాడికొండ, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): రాబోయే రోజుల్లో ఎలక్ట్రికల్ ఇంజనీర్లకు భవిష్యత్తు ఉంటుందని చలపతి కళాశాలల సెక్రటరి వై.సుజిత్‌కుమార్ తెలిపారు. గురువారం లాం చలపతి ఇంజనీరింగ్ కళాశాలలో రెండు రోజుల పాటు ఈఈఈ డిపార్టుమెంట్ ఆధ్వర్యంలో ఎలక్ట్రికల్ వెహికల్స్‌పై అవగాహన సదస్సును నిర్వహించారు. కార్యక్రమంలో ఈఈఈ విభాగాధిపతి పీవీ నరేంద్రకుమార్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రజల భాగస్వామ్యంతోనే చట్టాలు విజయవంతం

● సీఐడీ రీజియనల్ ఏఎస్పీ ఆదినారాయణ

ఫిరంగిపురం, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి) : ప్రజల భాగస్వామ్యంతోనే చట్టాలు విజయవంత మవుతాయని సీఐడీ రీజినల్ ఏఎస్పీ ఆదినారాయణ అన్నారు. గురువారం మండలంలోని గొల్లపాలెంలో క్రైం ఇన్వెస్టిగేషన్ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో జరిగిన ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టంపై అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. చట్టాన్ని తెలుసుకొని సద్వినియోగం చేసుకోవాలని, ఐతే చట్టాలను దుర్వినియోగం చేయకూడదని ఆయన తెలిపారు. కార్యక్రమంలో ల్యాంప్ సంస్థ డైరెక్టర్ కొండపల్లి సాల్మన్‌పాల్, సీఐడీ అధికారి వెంకట రమణ తదితర పోలీసు అధికారులు, సర్పంచ్ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ సభ్యత్వంలో ప్రథమ స్థానంలో వడ్డేశ్వరం



కేక్ కటింగ్‌లో పాల్గొన్న మహిళలు, టీడీపీ నేతలు

తాడేపల్లి, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): తెలుగుదేశంపార్టీ సభ్యత్వ నమోదులో మండలంలో ఇప్పటివరకు 2325 సభ్యత్వాలు చేసి వడ్డేశ్వరం ప్రథమ స్థానంలో ఉందని గ్రామ అధ్యక్షుడు ఈపూరి కోటయ్య సీనియర్ టీడీపీ నేత కాట్రగడ్డ మధుసూదనరావు తెలిపారు. ఇంటింటికి తిరిగి స్వచ్ఛందంగా సభ్యత్వాలు నమోదు చేసి ప్రజల నుంచి సమస్యలు అడిగి తెలుసుకుంటున్నామని చెప్పారు. ఈ సందర్భంగా గ్రామ కార్యాలయం వద్ద గురువారం టీడీపీ నేతలు కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో కోటయ్య, సుబ్రహ్మణ్యం, స్థానిక మహిళలు, టీడీపీ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆత్మకూరులో చురుగ్గా టీడీపీ సభ్యత్వ నమోదు

మంగళగిరి, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): మంగళగిరి మండలం ఆత్మకూరులో టీడీపీ సభ్యత్వ నమోదు చురుగ్గా సాగుతోంది. గ్రామస్థుల నుంచి సభ్యత్వ నమోదుకు విశేష స్పందన లభిస్తోంది. టీడీపీ నేతలు గ్రామంలో తిరుగుతూ సభ్యత్వాలను నమోదు చేస్తున్నారు. ఈ సందర్భంగా ఐటీడీపీ నియోజకవర్గ కోఆర్డినేటర్ అబ్దుల్ కరీమ్ మాట్లాడుతూ దేశంలో ఏ రాజకీయ పార్టీ చేయని విధంగా తెలుగుదేశం పార్టీ కార్యకర్తల సంక్షేమానికి ప్రాధాన్యమిస్తుందన్నారు. పార్టీ సభ్యత్వం సామాన్య కార్యకర్తకు సైతం భరోసా ఇస్తుందన్నారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు కొమ్మా సుకుమార్, తాటి వెంకటరావు, శానం మాణిక్యాలరావు, సోమరౌతు శివ నాగేశ్వర రావు, కాండ్రు రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

తొలిదశలోనే క్యాన్సర్ నివారణకు సహకరించాలి

దుగ్గిరాల, (ఆంధ్రజ్యోతి), నవంబరు 14: తొలిదశలలోనే క్యాన్సర్‌ను గుర్తించేందుకుగానూ ఇంటింటికీ తిరిగి వైద్యసిబ్బంది అనుమానిత లక్షణాలున్న వారికి పరీక్షలు నిర్వహిస్తున్నట్లు దుగ్గిరాల పీహెచ్‌సీ డాక్టర్ ఇజాజ్ తెలిపారు. గ్రామంలో గురువారం జరిగిన సర్వే తీరును ఇన్‌చార్జి ఎంపీపీ జబీన్ తనిఖీ చేశారు. తొలిదశలోనే క్యాన్సర్‌ను గుర్తించేందుకుగానూ, పిహెచ్‌సీ వైద్యసిబ్బంది జరుపుతున్న పరీక్షలకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. మధుమేహం, బీపీ, రక్తశాతం, నోటి పరీక్షలు, గర్భాశయక్యాన్సర్ నిర్ధారణ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు డాక్టర్ ఇజాజ్ తెలిపారు. మీఇంటికి వచ్చిన వైద్యసిబ్బంది అడిగే ప్రశ్నలకు సమాధానాలు ఇవ్వాలని డాక్టర్ ఇందిర కోరారు.

బహిరంగ ప్రకటన

నా క్లయింటు అయిన గుంటూరుసిటీ, కన్నావారితోట, మెడికల్‌కాలేజ్‌రోడ్డు, రైల్వే కోర్టర్స్ నెం.236/1 కాపురస్తులు తన్నీరు వెంకటేశ్వర్లుగారి కుమారుడు బ్రహ్మనాయుడుగారి సంజాయిషీ పొంది యావన్మందికీ తెలియజేయునది ఏమనగా దిగువ షెడ్యూలు అస్తి ది.19-03-1931న దాసరి అదిశేషు గారికి విక్రయ ద.నెం.496/1931 గా ది.24-03-1931న రిజిష్టరు కాబడిన విక్రయ దస్తావేజు రీత్యాను మరియు ది.27-07-1931న దాసరి శ్రీహరి మైనరైనందున గార్డియన్ తల్లి అదిశేషుగార్ల పేరుతో విక్రయ ద.నెం. 1530/1931 ది.31-07-1931న రిజిష్టర్ కాబడిన విక్రయ దస్తావేజుల రీత్యా వారిరువురికీ సంక్రమించినదని సదరు దాసరి అదిశేషుగారు మరణించిన దరిమిలా వారి ఏకైక సంతతి వారసురాలు అయిన దాసరి శ్రీహరి @హరిరాజమ్మగారికి సంక్రమించినదని ఆ తదాది ఆమె నిరాటంకంగా సదరు అస్తిని అనుభవించుచూ తన జేష్ఠ కుమార్తె అయిన దాసరి రాజకుమారికి ద.నెం.1946/1965గా కొంత అస్తిని రిజిష్టర్ చేసిఇవ్వగా మిగిలిన అస్తిని లేటు చదలవాడ కుమారరావు గారి భార్య శ్రీహరి@హరిరాజమ్మగారు అనుభవించుచూ, తన తృతీయ కుమార్తె అయిన గుంటూరుజిల్లా, వినుకొండ, కొత్తపేట కాపురస్తులు సారంగం లోకనాథంగారి భార్య బేబీ సరోజిని @ బేబి సరోజినినాథ్ గారికి ది.10-07-2003న దఖలు దస్తావేజు నెం.6437/2003గా రిజిష్టర్ చేసిన దరిమిలా సదరు అస్తి బేబీ సరోజిని @ బేబి సరోజిని నాథ్ గారికి సంక్రమించి ఆ తదాది ఆమె స్వాధీన హక్కు భుక్తములో అనుభవించుచూ మరణించిన దరిమిలా అమె ఏకైక వారసురాలైన యస్. సురేష్‌కుమార్ గారి భార్య యస్.వెంకట పద్మబిందు గారికి సంక్రమించినదని, ఆమె మాత్రమే హక్కుదారురాలిని అని తెలుపుచూ దిగువ షెడ్యూలు అస్తిని అమ్మటకు బహిరంగపరచగా నాక్లయింటు కొనుగోలు చేయుటకు సిద్ధపడి విక్రయ ఖరాఫుపడి కొంత క్రయ ధనమును చెల్లించియున్నారు. కావున దిగువ షెడ్యూలు దాఖలా అస్తిపై గాని మరియు దాసరి అదిశేషు, బేబీ సరోజిని @ బేబి సరోజిని నాథ్ గార్ల వారసత్వంపై గాని ఎవరికైనా ఏవిధమైన అభ్యంతరములు ఆక్షేపణలు, ఇతర క్లయిములు వగైరాలు ఉన్నయెడల ఈ ప్రకటన తేది నుండి 7 రోజులలోగా నాకు గాని, నాక్లయింటుకు గాని వ్రాతపూర్వకమైన ఆధారాలతో లిఖితపూర్వకముగా తెలియజేయగలరు. గడువు లోగా షెడ్యూలు అస్తిపై గాని, అదిశేషు గారి వారసత్వంపై గాని ఎటువంటి క్లయిములు రానియెడల షెడ్యూలు అస్తి నిష్పేచి అస్తిగా భావించి నాక్లయింటు సదరు యస్.వెంకట పద్మబిందు గారి నుండి సక్రమమైన విక్రయ దస్తావేజును పొందగలరని గడువు తరువాత వచ్చే ఎట్టి ఆక్షేపణలు, క్లయిములు షెడ్యూలు అస్తిని గాని, నా క్లయింటు హక్కులను గాని బైండుచేయజాలవు.

షెడ్యూలు:గుంటూరు డి॥ఉసబ్.డి॥, గుంటూరు మున్సిపల్ కార్పోరేషన్ ఏరియాలో చేరిన గుంటూరు సిటీ, కన్నవారి తోట ఏరియా మున్సిపల్ పాత వార్డు నెం.17రు, కొత్త వార్డు నెం.21రు బ్లాకు నెం.6రు మున్సిపల్ సర్వే నెం.135రు విస్తీర్ణం 12662 చ.అ లు మింజుమలె మున్సిపల్ డోరు నెం.27-6-35రు మున్సిపల్ అస్తి పన్ను అసెస్మెంటు నెం.4082220-01,02 చ.గ.210లు స్థలము గల అస్తికి హద్దులు. తూర్పు:సందన హాస్పిటల్ గోడ వెంబడి ఈ దఖలు అస్తికి చెందిన గోడ కొంత స్థలం హద్దు,49-8లు, దక్షిణం:చదలవాడ రామకృష్ణ బాకీ క్రింద దఖలు పరచిన అస్తి హద్దు, అ.37-10లు,పడమర:కుర్నాపు ఆదిలక్ష్మికి దఖలు పరచిన అస్తి హద్దు, అ.50-2.1/2లు.ఉత్తరం:కన్నవారి తోట 5/1వ అడ్డరోడ్ మున్సిపల్ రోడ్ హద్దు.అ.37-11లు.

నరాలశెట్టి శ్రీనివాసరావు, న్యాయవాది
అంకమ్మనగర్, 3వ లైను, గుంటూరు, 8464962960, 8309369942

తెనాలి వార్తలు

◆ తెనాలి ◆ పొన్నూరు

తెనాలిలో ఫ్లెక్సీల తొలగింపు

తెనాలి, మారీసుపేట, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో అనధికార ఫ్లెక్సీలను మున్సిపల్ అధికారులు తొలగించారు. స్థానిక వహబ్ రోడ్డులో గురువారం అనధికార ఫ్లెక్సీలను, ఐరన్‌ఫ్రేమ్‌లను మున్సిపల్ అధికారులు తొలగించారు. పురపాలక సంఘం అనుమతులు లేని ఫ్లెక్సీలను, ట్రాఫిక్‌కు అంతరాయంగా ఉన్న ఐరన్‌బోర్డులను తొలగిస్తున్నామని మున్సిపల్ అధికారులు తెలిపారు.

క్రైమ్ జోన్

పలు చోరీల కేసుల్లో పోస్టల్ ఉద్యోగి అరెస్టు

పెదకాకాని, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని పలు గ్రామాల్లో ఇటీవల జరిగిన చోరీలకు పాల్పడ్డ నిందితుడిని అరెస్టు చేసినట్లు పెదకాకాని పోలీసులు గురువారం తెలిపారు. నిందితుడు పోస్టల్ ఉద్యోగి కావటం గమనార్హం. ఇటీవల పెదకాకాని మండలం కొప్పురావూరు గ్రామంలో వరుసగా గొలుసు స్నాచింగ్ జరిగిన కేసుల్లో గుంటూరు రూరల్ మండలం జొన్నలగడ్డ గ్రామంకు చెందిన ఇమడాబత్తిని నాగార్జునను అదుపులోకి తీసుకున్నారు. ఎస్పీ ఉత్తర్వులు మేరకు, సీసీఎస్ డీఎస్పీ సిబ్బంది సహకారంతో అతని వద్ద బంగారపు గొలుసులను రికవరీ చేసి, నిందితుడిని అరెస్టు చేసినట్లు పోలీసులు తెలిపారు.

ఆటో బోల్తా... ఒకరు మృతి

తెనాలి రూరల్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): ద్విచక్రవాహనాన్ని తప్పించబోయిన ఆటో మరో ద్విచక్రవాహదారుడికి తగలడంతో వ్యక్తి మృతి చెందిన ఘనట తెనాలి జేఎంజే కళాశాల ప్రధాన రహదారిపై జరిగింది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం అంగలకుదురు వైపు నుంచి తెనాలికి ప్రధాన రహదారిపై రెండు ద్విచక్రవాహనాలు వస్తుండగా తెనాలి నుండి అంగలకుదురు వైపుకు ఆటో వెళ్లోంది. ఒక ద్విచక్రవాహనదారుడు ఆటోకు అడ్డంగా రావటంతో ఆటో అదుపుతప్పి అటుగా వస్తున్న మరో ద్విచక్ర వాహనానికి తగిలి పల్టీకొట్టింది. ఈ ఘటనలో వడ్లమూడికి చెందిన బి.జ్ఞానరాజు (49) అక్కడికక్కడే మృతి చెందాడు. ఇతడికి వివాహమై భార్య ఇరువురు పిల్లలున్నారు. ఆటోలో, ద్విచక్రవాహనంపై ఉన్న మరో వ్యక్తి కలిపి ఐదుగురికి గాయాలయ్యాయి. స్థానికులు వారిని తెనాలి జిల్లా ప్రభుత్వ వైద్యశాలకు తరలించి చికిత్స అందిస్తున్నారు. ఘటనపై కేసు విచారణ చేపట్టామని పూర్తి వివరాలు తెలియాల్సి ఉందని ఎస్ఐ ప్రతాప్‌కుమార్ తెలిపారు.

జోన్ డైరీ

● తెనాలి, మారీసుపేట: వర్తక వ్యాపారస్థులకు ఎంఎస్ఎంఈ సర్వేపై అవగాహన కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహిస్తామని పట్టణ పురపాలక సంఘ కమిషనర్ శేషన్న గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.

పాస్టర్ ఇశ్రాయేలు మృతి

తెనాలి అర్బన్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): ఐతానగర్ ప్యాడిసన్ పేట గాస్పెల్ చర్చి సంఘ కాపరి ఆరెమళ్ల ఇశ్రాయేలు బుధవారం రాత్రి మృతి చెందారు. ఎన్నో ఏళ్లగా దైవసేవ చేస్తున్నారని, పట్టణ పాస్టర్స్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు కె.సుధీర్‌కుమార్ సంతాపం తెలిపారు.

మద్యం షాపుల్లోని పరికరాల వేలం

తెనాలి క్రైం, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వంలో ప్రభుత్వ మద్యం షాపుల కోసం కొనుగోలు చేసిన ఫ్రీజర్లు, ఇన్వర్టర్లు, బ్యాటరీలు, క్యాష్‌చెస్టలు, స్కానర్లు, క్యాష్ కౌంటింగ్ మిషన్లకు బహిరంగ వేలం నిర్వహిస్తున్నట్లు తెనాలి ఐఎంఎల్ డిపో మేనేజర్ టి.శౌరి గురువారం తెలిపారు. ఈ నెల 15వ తేదీ ఉదయం 11 గంటలకు ఐఎంఎల్‌ఎఫ్‌యస్‌కు డిపో గోడౌన్ వద్ద ఈ వేలం పాట నిర్వహించడం జరుగుతుందన్నారు.

పోక్సో కోర్టు ఇన్‌చార్జి ఎపీపీగా రమేష్‌బాబు

తెనాలి క్రైం, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): తెనాలి పోక్సో కోర్టు ఇన్‌చార్జి ఏపీపీగా కోటా రమేష్‌బాబు నాయుడు గురువారం బాధ్యతలు స్వీకరించారు. విజయవాడ డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్ ఆదేశాల మేరకు బాధ్యతలు స్వీకరించినట్లు వారు తెలిపారు. 11వ అదనపు జిల్లా కోర్టు ఇన్‌చార్జి ఎపీపీగాను, అడిషనల్ సీనియర్ సెషన్స్ కోర్టు ఏపీపీగా కూడా రమేష్‌బాబు కొనసాగుతున్నారు.

వైభవంగా సాయిబాబా మందిర వార్షికోత్సవం

కొల్లిపర, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రం కొల్లిపర షిర్డిసాయిబాబా మందిరంలో 22వ వార్షికోత్సవాన్ని గురువారం కన్నుల పండువగా నిర్వహించారు. వివిధ గ్రామాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు రావడంతో బాబా మందిరం కిటకిటలాడింది. పండితులు కుమారస్వామి, కుటుంబరావు, జగన్నాధాచార్యులు, బాబాకు ఉదయం నుంచి రాత్రి వరకు పూజాకార్యక్రమాలు నిర్వహించారు.

గ్రామాల అభివృద్ధికి ప్రణాళికను సిద్ధం చేయాలి: ఎంపీపీ

కొల్లిపర, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): ప్రజాప్రతినిధుల భాగస్వామ్యంతో గ్రామాలాభివృద్ధికి ప్రణాళికను సిద్ధం చేయాలని ఎంపీపీ భీమవరపు పద్మావతి అన్నారు. గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గ్రామపంచాయతీల అభివృద్ధి ప్రణాళికపై సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులతో నిర్వహించిన శిక్షణా కార్యక్రమాన్ని జ్యోతి ప్రజ్వలన చేసి ఆమె ప్రారంభించారు. కార్యక్రమానికి ఎంపీడీవో విజయలక్ష్మి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా పద్మావతి మాట్లాడుతూ అధికారులు, ప్రజాప్రతినిధులు కలిసికట్టుగా పనిచేస్తే గ్రామాలు మరింత అభివృద్ధి చెందటానికి అవకాశం ఉందన్నారు. కార్యక్రమంలో పంచాయతీ రాజ్ ఏఈ అవుతు సాంబిరెడ్డి, ఈవోపీఆర్‌డీ భార్గవ్, సీనియర్ అసిస్టెంట్ శ్రీనివాసమూర్తి, వివిధ శాఖాధికారులు తదితరులు పాల్గొన్నారు.

చురుగ్గా మురుగునీటి శుద్ధి ప్లాంట్ పనులు



● మరో నెలలో అందుబాటులోకి
● ప్రాజెక్టును నిర్లక్ష్యం చేసిన వైసీపీ ప్రభుత్వం
● పనులు వేగవంతానికి టీడీపీ ప్రభుత్వం చర్యలు
● రైతులు, ప్రజాసంఘాల్లో హర్షాతిరేకాలు

పూలే కాలనీలో సిద్ధమౌతున్న శుద్ధి ప్లాంటు, ప్లాంటులోని మురుగును వేరుచేసే యంత్రాలు



వేగవంతంగా జరుగుతున్న శుద్ధి ప్లాంటు పనులు

తెనాలి, మారీసుపేట, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): పట్టణ ప్రజల, రైతుల దశాబ్దాల కల మురుగు నీటిని శుద్ధి చేసే ప్లాంట్ ఏర్పాటు మరో నెలలో అందుబాటులోకి రానుంది. పురపాలక సంఘ పరిధిలో 40 వార్డులు ఉన్నాయి. వార్డు ప్రజలు వాడిన వ్యర్థపు నీటిని మురుగు కాలువల ద్వారా పూలేకాలనీ వద్ద జంపని కాలువకు అనుసంధానం చేసి పంటపొలాలకు మళ్లిస్తారు. వేల ఎకరాల పంటలకు ఈ మురుగు నీటిని వినియోగించడం వలన పంట భూములు బీడవుతున్నాయి. మురుగునీటిని దోమలు ఆవాసాలుగా మర్చుకొని పైర్లపై దాడులు చేస్తున్నాయి. తద్వారా పంట దిగుబడి తగ్గి రైతులు నష్టపోతున్నారు. మురుగు నీటి వలన పర్యావరణం దెబ్బతింటోందని, ప్రజలకు అనారోగ్య సమస్యలు తలెత్తుతున్నాయని పర్యావరణ ప్రేమికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రైతులు, పలు ప్రజా సంఘాలు ఈ సమస్యలను అప్పటి టీడీపీ ప్రభుత్వ పెద్దలకు, అధికారుల దృష్టికి తీసుకొని వెళ్లి సమస్యలను పరిష్కరించాలని వినతి పత్రాలను అందించారు. ఈ సమస్యపై ప్రత్యేక దృష్టి పెట్టిన నాటి టీడీపీ ప్రభుత్వం 2018వ సంవత్సరంలో రోజుకి సుమారు కోటి లీటర్ల మురుగును శుద్ధిచేసే ప్లాంటును అమృత్ -1 పథకంలో శుద్ధి ప్లాంట్ నిర్మాణ పనులను 30.06 కోట్లతో చేపట్టింది. ఈ ప్రాజెక్టును నిర్మించి, 10 సంవత్సరాలు నిర్వహించడానికి కిలారి కన్‌స్ట్రక్షన్ ముంబాయి సంస్థకు అప్పగించారు. అయితే 2019లో జరిగిన సార్వత్రిక ఎన్నికలలో టీడీపీపై వైసీపీ పార్టీ గెలిచి అధికారం చేపట్టింది. ముఖ్యమంత్రిగా అధికారం చేపట్టిన వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ఐదేళ్ళ పాలనలో అన్ని రంగాలను భ్రష్టుపట్టించారు. మరి ముఖ్యంగా శుద్ధి ప్లాంట్ ప్రాజెక్టుకు కేటాయించిన నిధులను ఇతర పథకాలకు మళ్లించడం, దానితో పాటు అధికారుల నిర్లక్ష్యంతో ప్లాంట్ పనులు నత్తనడకన సాగాయి. మరలా 2024లో జరిగిన సార్వత్రిక ఎన్నికలలో తిరిగి టీడీపీ, జనసేన, బీజేపీ పార్టీల కూటమి అధికారం చేపట్టింది. కూటమి ప్రభుత్వం ఎన్నికలలో ఇచ్చిన హామీలలో భాగంగా రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ ప్రాజెక్టును క్షేత్ర స్థాయిలో పరిశీలించి త్వరితగతిన నిర్మాణ పనులను పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో ప్లాంటు పనులు వేగంగా జరుగుతున్నాయి. మరో నెల రోజులలో ప్లాంటు పనులు పూర్తవుతాయని, రాష్ట్రమంత్రి నాదెండ్ల మనోహర్ ప్రారంభిస్తారని అధికారులు తెలిపారు. ఈ ప్లాంట్‌లో రోజుకు 40 వార్డుల నుంచి వచ్చే సుమారు 5 లేక 6 ఎంఎల్‌డీల మురుగునీటిలోని మురుగును, వ్యర్థాలను వేరుచేసి శుద్ధిచేసిన నీటిని సాగునీరుగా అందిస్తుంది. మురుగునీటి శుద్ధి ప్లాంటు అందుబాటులోకి రానుండటంతో రైతులు, పలు ప్రజాసంఘాలు హర్షాతిరేకాలు వ్యక్తం చేస్తున్నారు.

గ్రంథాలయాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలి



గ్రంథాలయ వారోత్సవాలు ప్రారంభిస్తున్న కమిషనర్ శేషన్న

తెనాలి అర్బన్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): గ్రంథాలయాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ కమిషనర్ శేషన్న చెప్పారు. నెహ్రూరోడ్డులోని శాఖా గ్రంథాలయంలో గురువారం గ్రంథాలయ వారోత్సవాలు జ్యోతి వెలిగించి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, పాఠశాలలతో పాటు గ్రంథాలయాల్లో ఎక్కువ సమయం గడిపే విద్యార్థులు జీవితంలో రాణిస్తారని చెప్పారు. వారోత్సవాల్లో నిర్వహించే పోటీల్లో పాల్గొని బహుమతులు గెలుచుకోవాలని చెప్పారు. అయినాల మల్లేశ్వరరావు, రాయపాటి శివనాగేశ్వరరావు, ప్రసాద్, మొవ్వా సుబ్బారావు, జయశేఖర్, కె.రమాదేవి తదితరులు పాల్గొన్నారు. కొత్తపేటలోని మహిళా బాలల గ్రంథాలయంలో వారోత్సవాలను సీనియర్ న్యాయవాది వెలినేని రాఘవయ్య ప్రారంభించారు. చాచా నెహ్రూ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కె.అంజని, విజయ్‌కుమార్, వెంకటేశ్వరరావు, మస్తాన్‌రావు పాల్గొన్నారు. రూరల్ మండలం నందివెలుగులో గ్రంథాలయ వారోత్సవాలను పంచాయితీ కార్యదర్శి హేమకుమారి ప్రారంభించారు. భార్గవరామ్, బొల్లు మాధవి, సీతాకుమారి తదితరులు పాల్గొన్నారు.

● తెనాలి రూరల్: గ్రంథాలయాల సేవలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని పెదరావూరు గ్రామ సర్పంచ్ కాకి రమాదేవి అన్నారు. గురువారం మండలంలోని కొలకలూరు, పెదరావూరు, సంగంజాగర్లమూడి, నందివెలుగు గ్రామాల్లోని శాఖ గ్రంథాలయాల్లో 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. గ్రంథాలయాధికారి ఏ రాఘవేంద్రరావు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమాల్లో కూటమి నాయకులు పాలడుగు సురేంద్ర, పంచాయతీ కార్యదర్శి దానయ్య, విశ్రాంత గ్రంథాలయాధికారి కొడాలి చంద్రమౌళి, ఉపాధ్యాయులు విజయనిర్మల, సామ్రాజ్యం, విద్యార్థిని విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

● పొన్నూరు టౌన్: పాతపొన్నూరు శాఖ గ్రంథాలయంలో గురువారం 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు ప్రారంభమైయ్యాయి. బాలల దినోత్సవాని పురస్కరించుకుని జవహర్‌లాల్ నెహ్రూ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో గ్రంథాలయ అధికారి జి.కృష్ణమోహన్, ప్రభుత్వ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు పి నరేష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

● కొల్లిపర: మండలంలోని పలు గ్రామాల్లో 57వ గ్రంథాలయ వారోత్సవాలు గురువారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ప్రజాప్రతినిధులు అధికారులు, గ్రామపెద్దలు జవహర్‌లాల్ నెహ్రూ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమాల్లో సర్పంచ్‌లు పిల్లి రాధిక, వల్లభాపురం నిర్మలా, ఉపసర్పంచ్ అవుతు పోతిరెడ్డి, వివిధ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా బాలల దినోత్సవం

తెనాలి అర్బన్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో బాలల దినోత్సవ వేడుకలు గురువారం ఘనంగా నిర్వహించారు. దేశ ప్రథమ ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ జయంతి పురస్కరించుకుని ఆయన చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. బుర్రిపాలెం రోడ్డులోని వివేకానంద సెంట్రల్ స్కూల్‌లో మూడు రోజుల పాటు నిర్వహించనున్న బాలల దినోత్సవ వేడుకలకు సినీ బాలనటి మోక్ష హాజరై సందడి చేశారు. కార్యక్రమంలో డైరెక్టర్ రావిపాటి వీరనారాయణ, సీఈవో వెంకట్రామ్, ప్రిన్సిపల్ పద్మజ, షహనాజ్, రత్నాకర్, బొల్లిముంత కృష్ణ తదితరులు పాల్గొన్నారు. బోసురోడ్డులోని నెహ్రూనికేతన్ స్కూల్‌లో విద్యార్థులు వివిధ వేషధారణలతో అలరించారు.

సంగం జాగర్లమూడిలో క్యాన్సర్ పరీక్షలు

తెనాలి రూరల్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): ప్రాణాంతకమైన క్యాన్సర్ వ్యాధిని తొలిలోనే గుర్తించి తగిన వైద్యం పొందటం ద్వారా దానిని జయించవచ్చని అంగలకుదురు గ్రామ ఉపసర్పంచ్ టీడీపీ నేత కనగాల నాగభూషణం చెప్పారు. గురువారం సంగంజాగర్లమూడి పీహెచ్‌సీ వైద్యుడు డాక్టర్ షేక్ హనీఫ్ పర్యవేక్షణలో అంగలకుదురులో క్యాన్సర్‌పై గ్రామస్థులకు పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా గ్రామ ఉపసర్పంచ్ నాగభూషణం పాల్గొని కార్యక్రమాన్ని ప్రారంభించారు.

మధుమేహంపై అప్రమత్తంగా ఉండాలి

● డాక్టర్ దక్షిణామూర్తి ● శిబిరంలో 100 మందికి వైద్య పరీక్షలు



వైద్య శిబిరంలో పాల్గొన్న వైద్యులు

తెనాలి, మారీసుపేట, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): మధుమేహం వ్యాధిపై అప్రమత్తంగా ఉండాలని గుండె వైద్య నిపుణులు డాక్టర్ పాటిబండ్ల దక్షిణామూర్తి అన్నారు. స్థానిక బోసురోడ్డులోని ఇండియన్ మెడికల్ అసోసియేషన్ తెనాలి శాఖ కార్యాలయంలో గురువారం ఉచిత వైద్య శిబిరాన్ని ఐఎంఏ తెనాలి శాఖ సభ్యులు నిర్వహించారు. ఈ వైద్య శిబిరాన్ని ఐఎంఏ తెనాలి శాఖ అధ్యక్షుడు డాక్టర్ కె అనిల్ కుమార్ ఆధ్వర్యంలో ముఖ్య అతిథిగా సీనియర్ గుండె వైద్య నిపుణులు డాక్టర్ పాటిబండ్ల దక్షిణామూర్తి పాల్గొని రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. సుమారు 120 మందికి షుగర్, బీపీ, గుండె, కంటి పరీక్షలను నిర్వహించి వారికి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో డాక్టర్‌లు కె శ్యాంప్రసాద్, చందు సాంబశివుడు, ఘంటా నరసింహారావు, జాస్తి వెంకట సుబ్బారావు, మధుప్రభాకర్, కంటి వైద్య నిపుణురాలు రోజారాణి, కిమ్స్ హాస్పటల్ సిబ్బంది పాల్గొన్నారు.

కొల్లిపరలో ఎన్‌సీడీ-సీడీ సర్వే ప్రారంభం

కొల్లిపర, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): ఎన్‌సీడీ-సీడీ సర్వేతో దీర్ఘకాలిక రోగాలను గుర్తించటానికి అవకాశం ఉందని మండల వైద్యాధికారి లక్ష్మీసుధ అన్నారు. గురువారం మండల కేంద్రం కొల్లిపరలో ఎంపీపీ భీమవరపు పద్మావతి, సర్పంచ్ రాధిక, కూటమి నాయకులు భీమవరపు చినకోటిరెడ్డి, భీమవరపు కిశోర్‌లతో కలిసి వైద్యాధికారులు ఎన్‌సీడీ-సీడీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా లక్ష్మీసుధ మాట్లాడుతూ మండల గ్రామాల ప్రజలు ఈ సర్వేను సద్వినియోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో వైద్యాధికారి వేముల ప్రియాంక, ఎంపీహెచ్‌ఈవో నాగరాజు, ఎంపీహెచ్ఎస్ సాయిబాబు, పీహెచ్ఎన్ సుమతి, ఏఎన్ఎమ్ వేము లక్ష్మి, ఎమ్‌పీహెచ్‌ఏ శ్రీనివాసరావు, ఆరోగ్య సిబ్బంది, ఆషా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ పాలనలో గ్రామ పంచాయతీలు నిర్వీర్యం: ధూళిపాళ్ల

చేబ్రోలు, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): వైసీపీ పాలనలో నిధులు మళ్లించి గ్రామ పంచాయతీలను నిర్వీర్యం చేశారని ఎమ్మెల్యే, సంగం డెయిరీ చైర్మన్ ధూళిపాళ్ళ నరేంద్ర కుమార్ అన్నారు. గురువారం చేబ్రోలు టీడీపీ కార్యాలయంలో వైసీపీ సర్పంచి అత్తోట వినీత రాణి ఎమ్మెల్యే సమక్షంలో టీడీపీలో చేరారు. పార్టీ కండువ కప్పి ఎమ్మెల్యే నరేంద్ర కుమార్ సాదర స్వాగతం పలికారు. ఈ సందర్భంగా జరిగిన సభలో ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామాలాభివృద్ధిపై కూటమి ప్రభుత్వం చిత్తశుద్ధితో వ్యవహరిస్తుందన్నారు. గ్రామ సభలు నిర్వహించి ప్రజా సమస్యలను గుర్తించామన్నారు. పల్లె పండగ మొదటి దశ ద్వారా నిధులు కేటాయించి రహదారులు, మురుగు కాల్వల నిర్మాణాలు చేపట్టామన్నారు. రెండో దశలో సంక్రాంతి తర్వాత మరిన్ని మౌలిక వసతుల కల్పనపై దృష్టి సారించనున్నట్లు వివరించారు. ప్రజలు కూడా రెండు ప్రభుత్వాల మధ్య వ్యత్యాసం గుర్తించి కూటమి ప్రభుత్వానికి అండగా నిలవాలని కోరారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు షైలా వెంకట రామరాజు తదితరులు పాల్గొన్నారు.

కుమార్తె అదృశ్యంపై పిర్యాదు

తెనాలి, మారీసుపేట, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): వివాహమై భర్తతో కలసి పుట్టింటికి వచ్చిన కుమార్తె అదృశ్యమైందని తల్లి ఇచ్చిన పిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు త్రీటౌన్ పోలీసులు తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం స్థానిక పాండురంగ పేటకు చెందిన దివ్యతో యడ్లపలికి చెందిన నాగుతో 10 సంవత్సరాల క్రితం వివాహం జరిగింది. యడ్లపల్లిలో నివాసముంటున్న కుమార్తె 15 రోజుల క్రితం భర్తతో కలసి పుట్టిలైన తెనాలి పాండురంగపేటలోని తల్లిని చూసేందుకు వచ్చారు. ఈ క్రమంలో గురువారం ఇంటి నుండి బయటకు వెళ్లిన దివ్య (28) రాత్రి అయిన ఇంటికి తిరిగి రాకపోవడంతో తల్లి లక్ష్మి ఇచ్చిన పిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ప్రకాశరావు పేర్కొన్నారు.

సామాజిక పురోభివృద్ధికి పరిశోధనలు అవసరం

● ఏఎన్‌యూ ఉపకులపతి ఆచార్య కె.గంగాధరరావు

పెదకాకాని, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): సామాజిక పురోభివృద్ధికి పరిశోధనలు ఎంతో అవసరమని ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య కంచర్ల గంగాధరరావు పేర్కొన్నారు. ఇటీవల అంతర్జాతీయ సదస్సులో ఉత్తమ పరిశోధక పురస్కారాలు పొందిన విశ్వవిద్యాలయ ఆచార్యులైన ఆచార్య బట్టు నాగరాజు, ఆచార్య కడిమి మధుబాబులను గురువారం వీసీ ఆచార్య గంగాధరరావు అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశ ప్రగతికి, విద్యార్థుల భవితకు ఆచార్యుల పరిశోధనలు ఎంతో దోహద పడతాయని తెలిపారు. అంతర్జాతీయ సదస్సులో ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయ అర్థశాస్త్ర విభాగాధిపతి, పాఠ్యప్రణాళికా మండలి అధ్యక్షులు ఆచార్య కడిమి మధుబాబు, కామర్స్ అండ్ ఎకానమీ సెషన్‌లో "స్వచ్ఛ భారత్ మిషన్ అండ్ ఇట్స్ రోల్ ఇన్ ట్రాన్స్ఫార్మింగ్ రూరల్ శానిటేషన్ ఇన్ ఇండియా" అంశంపై సమర్పించిన పరిశోధన పత్రం ఉత్తమ పరిశోధన పత్రంగా ఎంపికైంది.

రోడ్డు విస్తరణ పనులు వేగవంతం చేయండి

● మున్సిపల్ ఇన్‌చార్జ్ ఎంఈ

తెనాలి, మారీసుపేట, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): రోడ్డు విస్తరణ పనులను వేగవంతంగా పూర్తి చేయాలని అధికారులను మున్సిపల్ ఇన్‌ఛార్జ్ ఎంఈ శ్రీనివాసరావు ఆదేశించారు. బోసురోడ్డులోని స్వరాజ్ టాకీస్ సెంటర్‌లో గురువారం జరుగుతున్న రోడ్డు విస్తరణ పనులను ఆయన మున్సిపల్ అసిస్టెంటు సిటీ ప్లానర్ శ్రీమన్నారాయణతో కలసి క్షేత్రస్థాయిలో పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో టీపీవో సాంబశివరావు, ఏఈ సునీల్ కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

కళలపై అభిరుచి ఉండాలి: సినీ రచయిత బుర్రా సాయిమాధవ్

తెనాలి రూరల్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): విద్యార్థి దశ నుంచి పిల్లలు చదువుతోపాటు కళలపై కూడా అభిరుచి కలిగి ఉండాలని సినీ మాటల రచయిత బుర్రా సాయిమాధవ్ చెప్పారు. గురువారం మండలంలోని కొలకలూరు హైస్కూల్‌లో నిర్వహించిన బాలల దినోత్సవానికి ఆయన ముఖ్యఅతిథిగాహాజరై ప్రసంగించారు. తొలుత జవహర్‌లాల్ నెహ్రూ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. రచయిత వల్లూరి శివప్రసాద్ బాలల దినోత్సవంపై ప్రసంగించారు. హెచ్‌ఎం నాగేశ్వరరావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో గ్రామ సర్పంచి చొప్పర ప్రీతి, మాజీ సర్పంచి వరప్రసాద్, విద్యాకమిటీ సభ్యులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

మధుమేహంపై అవగాహన ఉండాలి: డాక్టర్ మంజూష

తెనాలి రూరల్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): షుగర్ (మధుమేహం) వ్యాధిపై అవగాహన ఉండాలని తెనాలి జిల్లా ప్రభుత్వ వైద్యశాల డాక్టర్ మంజూష అన్నారు. గురువారం వరల్డ్ డయాబెటిక్ డే ను పురస్కరించుకుని పట్టణంలోని జిల్లా ప్రభుత్వ వైద్యశాల్లో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో పీజీ వైద్యులు డాక్టర్ విజయ్, ఫిజియోథెరపీ వైద్యులు డాక్టర్ అపర్ణ, వైద్య సిబ్బంది సత్తార్, మధులత, శ్రావణి, పరిపూర్ణ, అనురాధ, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌పీసీఐ డ్రైవ్‌ను సద్వినియోగం చేసుకోండి: కమిషనర్

తెనాలి, మారీసుపేట, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): సచివాలయాల్లో నిర్వహిస్తున్న ఎన్‌పీసీఐ డ్రైవ్‌ను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని పట్టణ మున్సిపల్ కమిషనర్ శేషన్న అన్నారు. పట్టణంలోని 2, 23వ వార్డు సచివాలయాల్లో జరుగుతున్న ఎన్‌పీసీఐ స్పెషల్ డ్రైవ్‌ను మున్సిపల్ కమిషనర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా ఖాతాలను అప్డేషన్, నూతన ఖాతాలు ప్రారంభించడానికి స్పెషల్ డ్రైవ్‌ను నిర్వహిస్తున్నామని వార్డు ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఇండియా పోస్ట్ శాఖ అధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



మురుగు నీటితో తాగునీరు కలుషితం

మండల కేంద్రమైన పెదకాకాని గ్రామానికి తాగునీటిని సరఫరా చేసే ప్రధాన తాగునీటి చెరువు, అది అనుకొని ఉన్న డ్రైనేజీ చెరువుకు మధ్య ఉన్న కట్ట ఇటీవల కురిసిన వర్షాలకు తెగిపోయింది. దీంతో రెండు చెరువుల నీరు ఏకమయ్యాయి. కాగా ప్రతిరోజు ఈ ట్రాక్ గుండా వాకింగ్ చేసే వాకర్స్ కి ఇబ్బందిగా ఉంది. తక్షణమే ఆ రెండు చెరువు లకు మధ్య ఏర్పడ్డ గండిని పూడ్చాలని పెదకాకాని ప్రజల కోరుకుంటున్నారు. - పెదకాకాని, ఆంధ్రజ్యోతి

జియో ట్యాగింగ్‌కు ప్రతి ఒక్కరూ సహకరించాలి

● పురపాలక సంఘ అసిస్టెంట్ కమిషనర్ లక్ష్మీపతిరావు

ఫటా ఫట్



తెనాలి, మారీసుపేట, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): పురపాలక సంఘ పరిధిలో జరుగుతున్న జియో ట్యాగింగ్ సర్వేకు ప్రతి ఒక్కరూ సహకరించాలని పట్టణ మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్ లక్ష్మీపతిరావు కోరారు. గురువారం సర్వేపై మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్ లక్ష్మీపతిరావు ఆంధ్రజ్యోతికి తెలిపిన వివరాలు.

ప్రశ్న: జియో ట్యాగింగ్ అంటే ఏమిటి?

జవాబు: పట్టణ ప్రజలు 40 వార్డులలో ఏ ఇంట్లో ఎంతమంది నివసిస్తున్నారో ఈ సర్వే ద్వారా నమోదు చేస్తున్నాం.

ప్ర: జియో ట్యాగింగ్‌కు ఏమైనా ధ్రువ పత్రాలు కావాలా, ఎలా చేస్తారు?

జ: ఈ సర్వేకు ఎటువంటి పత్రాలు అవసరం లేదు.

ప్ర: ఈ సర్వేను ఎలా నిర్వహిస్తారు?

జ: ఈ సర్వేలో ప్రతి ఇంటికి అధికారులు వచ్చి కుటుంబ సభ్యుల వివరాలను నమోదు చేసి హౌస్ హోల్డింగ్ మ్యాపింగ్ చేసి ఆ ఇంటిని, కుటుంబ సభ్యుడి ఫొటోను తీసుకుంటారు.

ప్ర: ఈ సర్వే వల్ల ఎటువంటి ఉపయోగాలు ఉంటాయి?

జ: జియో ట్యాగింగ్ చేయడం వలన ప్రభుత్వ సంక్షేమ పథకాలు నేరుగా వారికే అందేందుకు ఉపయోగపడుతుంది. ఈ సర్వేతో అర్హులకు ప్రభుత్వ పథకాలకు అందేందుకు అవకాశం ఉంటుంది.



ఇండోర్ స్టేడియంలో జంగిల్ క్లియరెన్స్ పనులు చేస్తున్న సిబ్బంది

ఇండోర్ స్టేడియంలో జంగిల్ క్లియరెన్స్ ప్రారంభం

తెనాలి రూరల్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 13న ప్రచురితమైన అధ్వానంగా ఇండోర్ స్టేడియం నిర్వహణ అంటూ ఆంధ్రజ్యోతిలో వచ్చి కథనంపై అధికారులు స్పందించారు. చుట్టూ చిట్టడిని తలపిస్తున్న ఇండోర్ స్టేడియంలో జంగిల్ క్లియరెన్స్ పనులు ప్రారంభించారు. స్టేడియంలో నెలకొని ఉన్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువచ్చి సమస్యల పరిష్కారానికి కృషిచేసిన ఆంధ్రజ్యోతికి పలువురు క్రీడాకారులు, వారి తల్లిదండ్రులు కృతజ్ఞతలు తెలిపారు. మంత్రి నాదెండ్ల మనోహర్ పేదలకు ఉపయోగపడేలా స్టేడియంలో సమస్యల పరిష్కారానికి చొరవ చూపినందుకు గణేష్‌యూత్ కన్వీనర్, టీడీపీ నేత వీరవల్లి మురళి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

నిత్యం ప్రజల్లో ఉండే ధూళిపాళ్ళను గుర్తించాలి

● ముస్లిం మైనార్టీ సెల్ అధ్యక్షుడు ఫిరోజ్‌ఖాన్

పొన్నూరు టౌన్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): ప్రజల కోసం నిత్యం ప్రజల్లో ఉండే ఎమ్మెల్యే ధూళిపాళ్ళ నరేంద్ర కుమార్‌కు చంద్రబాబు సముచిత స్థానం ఇచ్చి గౌరవించాలని నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ మైనార్టీ సెల్ అధ్యక్షుడు పఠాన్ ఫిరోజ్‌ఖాన్ కోరారు. పట్టణంలోని డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలామ్ షాదీఖానలో గురువారం టీడీపీ మైనార్టీ సెల్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా పలువురు టీడీపీ నాయకులు మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీని ప్రాణప్రదంగా భావిస్తూ అహర్నిశలు పార్టీ అభివృద్ధి కోసం పనిచేసే వ్యక్తి ఎమ్మెల్యే ధూళిపాళ్ళ అన్నారు. ఆరుసార్లు ఎమ్మెల్యేగా గెలిచిన నరేంద్ర కుమార్‌కు మంత్రి పదవి కానీ, క్యాబినెట్ పదవులు కేటాయించకపోవటంపై నియోజకవర్గ ముస్లింలను తీవ్రంగా బాధించిందన్నారు. సమావేశంలో షేక్ బాషా, షేక్ బాజీసాహెబ్, ముబ్బుల్ బేగ్, జానీ బేగ్, షేక్ బాబ్జి, కరిముల్లా బాజీ, పఠాన్ ఫైజుల్లాఖాన్, తదితరులు పాల్గొన్నారు.

నరేంద్ర కుమార్ సేవలను గుర్తించాలి: మాదిగ సెల్ నాయకులు

ఎమ్మెల్యే ధూళిపాళ్ళ నరేంద్ర కుమార్ సేవలను టీడీపీ అధినేత గుర్తించాలని టీడీపీ ఎస్సీ మాదిగ సెల్ నాయకులు కోరారు. గురువారం టీడీపీ ఎస్సీ సెల్ మాదిక సామాజిక వర్గం నాయకులు ఎమ్మెల్యే ధూళిపాళ్ళ నరేంద్ర కుమార్‌కు సంఘీభావం తెలిపారు. సమావేశంలో కూచిపూడి సత్యం, ఎం. హృదయ రాజు, పి.సురేష్, పి.సాంబయ్య, సోపాటి వెంకట్రావు, గంగవరపు పుల్లారావు, పులి ప్రభుదాసు తదితరులు పాల్గొన్నారు.

గుండెపోటుతో మామిళ్లపల్లి సర్పంచ్ మృతి



పొన్నూరు టౌన్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని మామిళ్లపల్లి గ్రామ సర్పంచ్ జాలాది యానాది రావు గురువారం గుండెపోటుతో మృతి చెందాడు. యానాదిరావు వైసీపీలో క్రియాశీలకంగా వ్యవహరిస్తూ 2020 సంవత్సరంలో జరిగిన ఎన్నికలో గ్రామ సర్పంచ్‌గా ఎన్నికయ్యారు. యానాదిరావుకు భార్య, ఇద్దరు కుమార్తెలు.

కాలనీల సంక్షేమ సంఘం కార్యదర్శిగా జోషి



జాతీయ కాలనీల సంక్షేమ సంఘం కార్యదర్శిగా నియామక పత్రం అందుకుంటున్న నారా జోషి

పొన్నూరు టౌన్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): జాతీయ సంక్షేమ సంఘం సంయుక్త కార్యదర్శిగా నారా జోషి నియమితులైయ్యారు. ఈ నెల 10వ తేదీన హైదరాబాద్‌లో జరిగిన ఆల్ ఇండియా రెసిడెంట్ వెల్ ఫేర్ అసియేషన్ 11వ జాతీయ మహా సభలో నారా జోషిని సంయుక్త కార్యదర్శిగా నియమించారు. నారా జోషి తెలుగు నాడు ప్రజా సమితి వర్కింగ్ ప్రెసిడెంట్‌గా పనిచేస్తున్నారు. జాతీయ సంయుక్త కార్యదర్శిగా నియమితులైన జోషిని అభిమానులు ప్రత్యేకంగా అభినందించారు.

రోహిణి ఆసుపత్రిలో వైద్య పరీక్షలు

తెనాలి అర్బన్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): గంగానమ్మపేట రోహిణి ఆసుపత్రిలో గురువారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. మధుమేహ దినోత్సవం పురస్కరించుకుని ఉచితంగా ఓపి, రక్తపరీక్షలు నిర్వహించారు. డాక్టర్ వినీల్ షుగర్ వ్యాధిగ్రస్తులు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వివరించారు.